దేవుడొక్కడే - నామము లనేకం

(వివరణాత్మక వ్యాఖ్య)

అనుబంధం :

వైదిక సుప్రభాతం

మూలగ్రంథం :

మహర్షి దయానంద స్వామి విరచిత జగత్ ప్రసిద్ధ

"సత్యార్థ ప్రకాశం" (ప్రథమ సముల్లాసం)

కర్త :

సుమ్నార్థి

(డా॥ కోడూరి సుబ్బారావు)

గాయత్రీ ఆశ్రమ ట్రస్టు ప్రచురణ

12-10-586/6, ఆర్య సమాజము - మేడిబావి,

వారాసిగూడ, సికింద్రాబాదు - 500 061

Cell : 98480 11073, 99089 94084

దేవుడొక్కడే నామములనేకం

ప్రతులు :

దయానందాబ్దము	**:**	**201**
సృష్టి సంవత్సరం	**:**	**193,08,53,125**
విక్రమాబ్దము	**:**	**2081**
కలియుగ సంవత్సరం	**:**	**5125**
సంవత్సరము	**:**	**శ్రీక్రోధి నామ సంవత్సరము**
ఆంగ్ల సంవత్సరము	**:**	**2024**
మూల్యము	**:**	**..../-** (తపాలా ఖర్చులు అదనము)

ప్రతులకు :

1. **డా॥ కోడూరి సుబ్బారావు**
గాయత్రీ ఆశ్రమ ట్రస్టు, ఆర్య సమాజము, 12-10-586/6,
మేడిబావి, సీతాఫలమండి, సికింద్రాబాద్-500 061.
సెల్: 99089 94084, 98480 11073.

2. **ఆర్య సమాజము**
సీతాఫలమండి, మెయిన్‌రోడ్,
రైల్వే ఫ్లైఓవర్ దగ్గర,
సికింద్రాబాద్ - 500 061.
సెల్: 99893 36766, 9000621950

3. **డా॥ మట్టి కృష్ణారెడ్డి,** వేదధర్మ ప్రచార ట్రస్టు(రి.).,
2-27, ఆర్య సమాజ మందిరం,
బాదం కాంప్లెక్సు, చైత్యనపురి క్రాస్ రోడ్, దిల్‌సుఖ్‌నగర్.
హైదరాబాద్-60. సెల్: 94412 00322.

ప్రాక్కథనం (Forword)

ప్రియమైన పాఠకులారా! సోదర సోదరీమణులారా!

శుభం భూయాత్ – మీకు శుభమగును గాక!

మహర్షి దయానంద సరస్వతి గారు హిందీభాషలో 'సత్యార్థ ప్రకాశం' అనే పేరుతో ఒక జగత్ప్రసిద్ధమైన గ్రంథాన్ని రచించారు. అది నిజంగా వేదశాస్త్రాలలోని సత్యమైన అర్థాలను ప్రకాశపరచే ఒక అద్భుతమైన గ్రంథం. మానవులై పుట్టినవారందరు తప్పక చదువవలసిన అతిముఖ్య గ్రంథం. అది మనలోని వివేకాన్ని నిద్రలేపి, బుద్ధిని పదునుపెట్టి వికసింపచేస్తుంది. తద్వారా మనకెంతో మేలు జరుగుతుంది. అయితే దానిని తెలుగులో అనువదించిన పండితులు గ్రాంథిక భాషలో అనువదించారు. **యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః । స యత్ప్రమాణాం కురుతే లోకస్తదనువర్తతే ॥** (భ.గీ. 3–21) అని చెప్పినట్లు శ్రేష్ఠులైన పండితులు, మేధావులు, ధర్మప్రబోధకులు దేనిని ఆచరించితే జనసామాన్యమంతా దానినే అనుసరిస్తారనే ఉన్నత ఆశయంతో మహర్షి సత్యార్థ ప్రకాశాన్ని అనువాదకులు ప్రాచీన గ్రాంథికభాషలో వ్రాయటం జరిగింది.

అనేక కారణాలవల్ల నేడు లోకంలో గ్రాంథికభాష కనుమరుగైపోతూ వ్యవహార భాష ప్రచలితమౌతున్నది. నేటి తరానికి గ్రాంథికభాష చాలా బరువగుతున్నది. అందుచే దానిని విద్యార్థినీ విద్యార్థులకు, ప్రారంభిక జిజ్ఞాసువులకు అర్థమయ్యేటట్టు వ్యవహార భాషలో వ్రాయమని చాలామంది మిత్రులు శ్రీ మా సీతాఫలమండి ఆర్యసమాజ అధ్యక్షులు శ్రీమాన్ డి. గంగాధర్ ఆర్యగారు నన్ను ఎంతో కోరుతున్నారు. అందుచే ఆ ప్రయత్నంగా అందలి ప్రథమ సముల్లాసాన్ని (అధ్యాయాన్ని) "దేవుడొక్కడే – నామములనేకం" అనే పేరుతో సంకలన రచనగా వ్రాశాను. పాఠకులు దీనిని చదివి మీ మీ అభిప్రాయాలను, సూచనలను వ్రాయగోరుచున్నాను. తదుపరి ముద్రణలో సవరించే ప్రయత్నం చేస్తాను.

మీ శ్రేయోభిలాషి

సుమ్నార్థి

(గ్రంథకర్త)

ధర్మసోదరి శ్రీమతి డా॥ కందుల జానకి గారి సంక్షిప్త పరిచయం

శ్రీమతి జానకి గారు కాలేజీ విద్యార్థినిగా ఉన్నప్పటినుండి నాకు పరిచయం. నేను 1970 సం॥లో స్వ. మహేంద్రకర్ రామచంద్రరావు (స్థాపక సభ్యులు) గారితో ఆర్యసమాజము–సీతాఫలమండి, సికింద్రాబాద్ నగరానికి రావటం జరిగింది. 1971 సం॥ ఉగాది రోజున సీతాఫలమండి ఆర్య సమాజము వారు తమ సమాజంలో దయానంద హోమియో వైద్యశాలను ఏర్పాటు చేశారు. అందు స్వ. నందిపూడి రామచంద్రరావు గారు (వైద్యులుగా) వారి సేవలు అందించారు. వీరు RMP హోమియో వైద్యులు. వారికి సహాయకులుగా నన్ను ఉండమని కోరారు. నాకును సేవ చెయ్యాలని అభిలాష ఉండటంవల్ల సాయం చేశాను. క్రమంగా డా॥ నందిపూడి రామచంద్రరావుగారు వృద్ధులై డిస్పెన్సరీకి రాలేక ఆ బాధ్యతను నాపై పెట్టారు. నాకును అభిరుచి ఉండటంవల్ల హోమియో విద్యను నేర్చుకొని ప్రభుత్వ RMP పరీక్షలో ఉత్తీర్ణుడనై వైద్యుడనయ్యాను. అప్పుడు నాకు శ్రీమతి కె. జానకి గారు సహాయకులయ్యారు. క్రమంగా తోటి విద్యార్థి శ్రీ కందుల దివాకర్ గారిని వివాహం చేసుకొని కొంతకాలం ICRISET లో పనిచేశారు. అనంతరం న్యూజిలాండ్ చేరుకొని అక్కడనే స్థిరపడ్డారు. ఆ దంపతులకు రవికిరణ్ అనే అబ్బాయి, తేజస్విని పేరు గల అమ్మాయి కలిగారు. అబ్బాయి ఇంజనీరుగా, అమ్మాయి అల్లోపతి చిల్డ్రన్ స్పెషలిస్టుగా ఆస్ట్రేలియాలో సేవలందిస్తున్నారు. శ్రీమతి జానకిగారు క్రమంగా అక్కడి హోమియో డిప్లొమా పొందారు. ఈ భార్యాభర్తలిద్దరికి ఆర్యసమాజ సిద్ధాంతాలపై శ్రద్ధ కలిగి న్యూజిలాండ్‌లో కూడా ఆర్యసమాజం స్థాపించి ప్రచారం చేస్తున్నారు.

– సుమ్నార్థి

(కోడూరి సుబ్బారావు)

దేవుడొక్కడే - నామము లనేకం

ఓం శన్నో మిత్రః శం వరుణః, శన్నో భవత్వర్యమా ।

శన్న ఇంద్రో బృహస్పతిః, శంనో విష్ణు రురుక్రమః ॥

– యజు. 36–9, ఋ. 1–90–9

ఓం నామక సర్వవ్యాపక సచ్చిదానంద సర్వేశ్వరా! నీవు ప్రాణులన్నిటికి మిత్రుడవు. వరించతగిన వారిలో నీవే శ్రేష్ఠతముడవు. అత్యంత న్యాయకారివి. సకలైశ్వర్య ప్రదాతవైన ఇంద్రుడవు. బ్రహ్మాండాధిపతివి. నీవు విష్ణువువు – సర్వవ్యాపకుడవు. ఉరుక్రముడవు – గొప్ప పరాక్రమశాలివి. మరెన్నో దివ్యగుణాలను కలిగిన నీవు మాకు 'శమ్ భవతు' – సుఖశాంతులను ప్రసాదింపుము.

నమో బ్రహ్మణే, నమస్తే వాయో, త్వమేవ ప్రత్యక్షం
బ్రహ్మాసి, త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మ వదిష్యామి,
ఋతం వదిష్యామి, సత్యం వదిష్యామి,
తన్మామవతు, తద్వక్తార మవతు, అవతుమా మవతు వక్తారమ్.
ఓ3మ్ శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

– తైత్తిరీయ అరణ్యకం 7–1

అన్నిటికన్న గొప్పదియగు బ్రహ్మకు – పరమాత్మకు నా నమస్సులు, ఆయనిచ్చిన వేదములకును నా నమస్సులు. ఓ వాయువా! అత్యంత బలశాలివగు సర్వేశ్వరా! నీవు అంతర్యామి రూపమున ప్రత్యక్ష బ్రహ్మవు. నీవే ప్రత్యక్ష బ్రహ్మవని ప్రవచింతును గాక! నీవు అంతటా వ్యాపించి ఉన్న దేవదేవుడవు. అందుచే ఋతం వదిష్యామి = వేదమునగల నీ ఆజ్ఞలను అందరికి ఉపదేశింతునుగాక! సత్యం వదిష్యామి = సత్యమునే పలుకుదునుగాక! సత్యమునే గ్రహింతునుగాక! సత్యమునే ఆచరింతునుగాక! తన్మామవతు = కనుక నీవు నన్ను రక్షించు. తద్వాక్తార మవతు = సత్యవక్తల నందరిని రక్షించుము.

ఓ పరమ రక్షకా! నన్ను రక్షించు.

మా ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక దుఃఖాలన్నీ నీ కృపవలన శాంతించునుగాక!

పై ఋగ్వేద మంత్రంలోని మిత్ర, వరుణ, వాయు, అర్యమ, ఇంద్రాది నామములన్నీ ఓం నామక సర్వసంరక్షకుని విశేషణాలే. ఈ విషయాన్ని మరింత స్పష్టం చేస్తూ వేదం ఏమి చెబుతున్నదంటే -

ఇంద్రం మిత్రం వరుణమగ్నిమ్ + ఆహు రథో దివ్యః స సుపర్ణో గరుత్మాన్ ।
ఏకం సద్ విప్రా బహుధా వదన్తి + అగ్నిం యమం మాతరిశ్వాన మాహుః ॥ - ఋ. 1-164-46

సృష్టి స్థితి లయకర్త ఒకే ఒక్కడు. అతనినే విప్రులు - జ్ఞానులు అనేక నామములతో పిలుస్తున్నారు. ఆ నామములన్నీ సృష్టికర్తలోని విశేష గుణకర్మ స్వభావాలను తెలిపేవే. వీటిలో ఓం అనేదే అతని ముఖ్యనామము - అసలు పేరు. కనుక ముందుగా మనం ఓం పదమును గురించి కొంత వివరంగా తెలుసుకుందాము.

'ఓం' అనే పదము 'అవ-రక్షణే' అనే సంస్కృత మూలధాతువుతో నిర్మించబడింది. అవ ధాతువులో రక్షణ, గతి, కాంతి, ప్రీతి మొదలైన 23 అర్థాలున్నాయి. వీటిలో మొదటిదైన 'రక్షణ' అనేదే ప్రధానమైనది. పరమేశ్వరుడు మనకు అసలైన సంరక్షకుడు. మనకు మన అమ్మకడుపులో ఈ శరీరాన్ని నిర్మించి యిచ్చినది, అప్పటినుండి ఇప్పటివరకు శరీరంలోని జీవన క్రియలన్నీ చేస్తున్నది అతడే కదా! శ్వాసను నడిపించేది, గుండెను స్పందింపచేసేది, మనం తిన్న ఆహారాన్ని రస రక్తాదులుగా మార్చేది, ఆ ఆహారసారాన్ని, ఆక్సిజన్‌ను ప్రతీకణానికి అందచేస్తున్నది అతడే కదా! కనుక ఆ సృష్టికర్తనే మనకు నిజమైన సంరక్షకుడు (Guardian). ఇదే దేవునకు మనకు ఉండే అసలైన సంబంధం. అందుచే జీవాత్మలమైన మనం సదా ఓం నామంతో దేవుని స్మరిస్తూ, ప్రార్థిస్తూ, ఉపాసిస్తూ అతనికి దగ్గరకావటం కోసం యత్నిస్తూ ఉండాలి. వేదం కూడా **"ఓ3మ్ క్రతోస్మర"** - యజుర్వేదం (40-15) = ఓ కర్మశీల మానవా! ఓ3మ్ నామముతో సృష్టికర్తనైన నన్ను స్మరించు" అంటుంది. **'ఓ3మ్ ఖం బ్రహ్మ'** (యజు. 40-17) = అట్టి నేను

‘ఖం’ ఆకాశం వలె సృష్టిలో అంతటా వ్యాపించి ఉన్నాను. ‘బ్రహ్మ’ అన్నిటికన్న పెద్దవాడను, గొప్పవాడను కూడా నేనే” నంటున్నాడు దేవుడు.

ఇంతేగాక, మన ప్రాచీన ఋషులు సమాధి స్థితులై అంతర్యామిగా ఉన్న ఓం నామక పరమాత్మను దర్శించి ఓం పదములోని మరికొన్ని అర్థాలను తెలుసుకొన్నారు. అవి ఏవంటే – “ఓం పదము ‘అ’ కార, ‘ఉ’ కార, ‘మ’ కారములతో ఏర్పడింది.

అ+ఉ+మ = ఓం అయ్యింది.

అ కారంలో – విరాట్, అగ్ని, విశ్వ మొదలైన నామములున్నాయి.

ఉ కారంలో – హిరణ్యగర్భ, వాయు, తైజసాది నామములు,

మ కారంలో – ఈశ్వర, ఆదిత్య, ప్రాజ్ఞాది నామములు ఇమిడి ఉన్నాయి” అని బ్రాహ్మణ, ఆరణ్యకాది గ్రంథాలలో ఋషులు వ్రాసి పెట్టారు.

పరమాత్మ సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సృష్టికర్త. అతని గుణకర్మలు, శక్తి సామర్థ్యాలు, స్వభావాలు అనంతంగా ఉంటాయి. వాటిలో ముఖ్యమైన వాటిని అకారాది క్రమంలో పెట్టి వాటి ముఖ్యమైన అర్థాలను సంక్షిప్తంగా తెలుసుకుందాము.

మనం చిన్నప్పటినుండి వింటూ వచ్చింది ఏమంటే – బ్రహ్మదేవుడు బ్రహ్మాండాలను, ప్రాణిసృష్టిని చేస్తూ ఉంటాడనీ, విష్ణుదేవుడు పాలిస్తూ ఉంటాడనీ, మహేశ్వరుడు 432 కోట్ల సంవత్సరాల కొకసారి ప్రలయంగా – అన్నిటిని విడివిడి పరమాణువులుగా మార్చివేస్తూ ఉంటాడని. కాని, పరమేశ్వరీయ జ్ఞానమైన వేదం, ఋషులు వ్రాసిన దర్శన ఉపనిషాదులు అన్నీ సృష్టి స్థితి ప్రలయాలను చేసేవాడు ఒకే ఒక్కడని నొక్కి వక్కాణిస్తున్నాయి. ఉదాహరణకు – **ఓం స నో బంధు ర్జనితా స విధాతా ధామాని వేద భువనాని విశ్వా ।** (ఋ. 10–121–10). అని వేదం,

శ్లో॥ స బ్రహ్మా, స విష్ణుః, స రుద్ర స్స
శివ స్సోఽక్షర స్స పరమః స్వరాట్ ।
స ఇంద్ర స్స కాలాగ్ని స్స చంద్రమాః ॥ – కైవల్యోపనిషత్ 1–8

ఆ సర్వవ్యాపక పరమాత్మయే బ్రహ్మ, అతడే విష్ణువు, అతడే రుద్రుడు, అతడే శివుడు, అతడే అక్షరుడు, అతడే పరమాత్మ, విరాట్, ఇంద్ర కాలాగ్ని చంద్రులు”. అని ఉపనిషత్తులు చెబుతున్నాయి. (ఇట్లే మన తెలుగు పద్యాలు

కూడా కొన్ని ఉన్నాయి. **"ఎవ్వనిచే జనించు జగము, ఎవ్వని లోపల నుండు, లీనమై ఎవ్వనియందు డిందు, పరమేశ్వరుడెవ్వడు, మూలకారణం బెవ్వడు, అనాది మధ్య లయు డెవ్వడు, సర్వము దానయైన వాడెవ్వడు, వానిన్ ఆత్మభవున్ ఈశ్వరునే శరణంబు వేడెదన్."**

కనుక, మతానికి ఒక దేవుడు, సంప్రదాయానికి ఒక దేవుడు వేరువేరుగా ఉండరు. అందరి శరీర నిర్మాణం, జీవనక్రియలు ఒకే రకంగా ఉన్నాయి కదా! మనమంతా ఒకే ఫ్యాక్టరీలో తయారైన శరీరాంగాలను కలిగి ఉన్నాము కదా!

పరమాత్మ నామములలో అగ్ని, వాయు, ఆదిత్య సూర్య చంద్రాది నామములు కూడా ఉన్నాయి. అట్లని ప్రాకృతిక పదార్థాలు దేవుళ్ళుకారు. ప్రకరణాన్ని సందర్భాన్నిబట్టి అట్టి నామములు భౌతిక పదార్థాలకు కూడా వర్తిస్తాయి. ఉదాహరణకు సంస్కృతభాషలో 'సైంధవము' అంటే గుఱ్ఱము, ఉప్పు అని రెండర్థాలున్నాయి. యజమాని భోజనం చేస్తూ సేవకున్ని సైంధవం తీసుకురా అంటే ఉప్పు తీసుకురావాలి. ఒకవేళ యజమాని మంచి దుస్తులు ధరించి పట్టణానికి పోయేటప్పుడు సేవకున్ని సైంధవం తీసుకురా అంటే గుఱ్ఱాన్ని తీసుకురావాలి. అంతేగాని భోజనం చేసేటప్పుడు గుఱ్ఱాన్ని, ప్రయాణ సమయంలో ఉప్పుని తీసుకువస్తే అతను మూర్ఖుడవుతాడు. అట్టివారిని యజమాని పనిలోనుండి తొలగించవలసి వస్తుంది. కనుక పదములకు ప్రకరణాన్ని (Context ను) బట్టి అర్థం చెప్పుకోవాలి.

పరమేశ్వరుని స్తుతి ప్రార్థన ఉపాసనలకు చెందిన మంత్రాలలో అగ్ని, వాయు, ఆదిత్య, సూర్య, చంద్రాది పదములకు దేవుని పరంగానే అర్థం చెప్పుకోవాలి. భౌతిక విజ్ఞానానికి చెందిన మంత్రాలలో అట్టి పదములకు ప్రాకృతిక పదార్థాల పరంగానే అర్థం చెప్పుకోవాలి. అందుచేత "ఆకాశాద్ వాయుః, వాయోరగ్నిః, అగ్నే రాపః, అద్భ్యః పృథివీ (తైత్తరీయోపనిషత్ బ్రహ్మానందవల్లి - 1) అనే వాక్యాలు వచ్చినచోట వాటికి భౌతిక పంచభూతాల పరంగానే అర్థం చెప్పుకోవాలి. ఇవే పదములు పరమేశ్వరుని స్తుతి ప్రార్థనోపాసన మంత్రాలలో వచ్చినపుడు వాటికి పరమేశ్వరుని పరంగానే అర్థం చెప్పుకోవాలి.

పరమేశ్వరుని నామములన్నీ సార్థకములు, అంటే - అర్థవంతములు.

లోకంలో కొందరి పేర్లు విచిత్రంగా ఉంటాయి. చాలా పేదవారు కూడా తమపిల్లలకు ధనరాజ్, దేవేంద్ర, దశరథ్ మొదలైన పేర్లు పెట్టుకుంటారు. కురూపికి శ్యామసుందర్ అనీ, పిసినారికి దానారావు అనీ పేర్లుంటాయి. అట్టివాటిని నిరర్థక నామములనవచ్చు. కాని దేవుని నామములన్నీ సార్థకములే. అవి ఎలా సార్థకములో వరుసగా అకారాదిక్రమంలో (Alphabetic ఆర్డరులో) చెప్పుకుందాము. ఇది ఆధ్యాత్మిక ప్రకరణం కనుక ఇక్కడ ఆ పదములకు దేవుని పరంగానే అర్థం చెప్పుకుందాము.

సంస్కృత భాషలో వ్యాకరణ సూత్రాలతోబాటు ధాతుపాఠం ఒకటి ఉంటుంది. అంటే – పదములకు మూల ధాతువు లేమిటో ఆ ధాతువులో ఏ అర్థముంటుందో దానిలో సంక్షిప్తంగా చెప్పబడుతుంది. బంగారంతో రకరకాల పేర్లతో – ఉంగరం, ముక్కుపుడక, చెవిపోగులు, చంద్రహారం, వడ్డాణం మొ॥నవి తయారు చేసుకున్నా అన్నిటిలో ఉండే మూలధాతువు బంగారమే కదా! గీటురాయితో దేనిని పరీక్షించినా అది బంగారమనే తెలుస్తుంది కదా! అట్లే మూలధాతువులో ఉండే అర్థమే ఆ ధాతువుతో ఏర్పడిన పదములలో భాసించాలి. కనుక ఈ క్రింది దేవుని నామములలో అది ఏ ధాతువుతో ఏర్పడిందో బ్రాకెట్స్‌లో ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాము.

సర్వవ్యాపక సర్వేశ్వరుని అనేక నామములు

1) అక్షరుడు - (క్షర - సంచలనే) – క్షరించటమంటే నశించటం. అక్షరుడంటే వ్యతిరేకార్థంగా నశించనివాడు అవుతుంది. దేవుడు నశించనివాడు. అక్షర పదము **'అశూఙ్–వ్యాప్తౌ'** అనే ధాతువుతోనూ నిర్మించవచ్చు. కనుక సర్వత్ర వ్యాపకుడని మరొక అర్థం.

'యః సర్వమశ్నుతే న క్షరతి వినశ్యతి తదక్షరమ్.'

2) అగ్ని - అగ్ని పదం వినగానే మనకు వంటశాలలోని అగ్ని గుర్తుకు వస్తుంది. కాని, 'అగ్ని' అనే పేరు పరమాత్మకు కూడా వర్తిస్తుంది. ఎట్లంటే –

ఈ పదం **"అఞ్చు గతి పూజనయోః"** అనే సంస్కృత మూలధాతువుతో తయారౌతుంది. కనుక అగ్ని అంటే – "గతి కలిగినది, పూజించ తగినది" అని అర్థం చేసుకోవాలి. ఇక్కడ గతి అంటే కేవలం కదలిక, వేగం కలదని అర్థం

కాదు. గతికి ఋషులు "గతేః + త్రయో అర్థాః, జ్ఞానం, గమనం, ప్రాప్తిశ్చేతి" అని నిర్వచనం చెప్పారు. ఇంతేగాక – "పూజనం నామ సత్కారః". **"యోఽ ఇఞ్చతి, అచ్యతే ఆగతి, అంగతి ఏతి వా సోఽ య మగ్నిః"** అని కూడా వివరించారు. అంటే – 1. జ్ఞాన పూర్వకమైన గమనంతో లక్ష్యంవైపు పయనించి, ప్రాప్తించవలసిన దానిని ప్రాప్తించటాన్ని గతి అంటారని ఋషుల వివరణ.

2. అట్లే పూజనం అంటే గుళ్ళల్లో విగ్రహాలను పూజించినట్లు కాదు. ఎవరికి తగినట్లు వారిని సత్కరించటం. దేవుడు వేదం ద్వారా బోధించిన ఉపదేశాలను నిత్యజీవితంలో ఆచరించటం, ఆయన చెప్పిన విహిత కర్మలను చెయ్యటం, నిషిద్ధ కర్మలను వదిలిపెట్టటం దేవుని పూజ అవుతుంది. తల్లిదండ్రులను పూజించటమంటే వారి మాటలను శ్రద్ధగా విని ఆచరించటం. శ్రీరామునివలె తల్లిదండ్రుల వాగ్దానాలను పూర్తిచెయ్యటం.

సృష్టికర్త జ్ఞానం పరిపూర్ణం. అతని బలక్రియలు కూడా పరిపూర్ణాలే. కనుకనే ఉపనిషత్ ఋషులు **"స్వాభావకీ యస్య జ్ఞాన బల క్రియా చ"** అని కీర్తించారు. అందుచే ప్రార్థనా ప్రకరణంలో 'అగ్ని' నామము పరమాత్మకే వర్తిస్తుంది. మొదటిదైన ఋగ్వేదం 'అగ్ని' పదముతోనే ప్రారంభమౌతుంది. నాలుగు వేదాలలోను అగ్ని పదం వందల పర్యాయాలు పరమేశ్వరుని పరంగా పేర్కొనబడింది.

వైదిక వ్యాకరణం తెలియని కొంతమంది ఆచార్యులు అగ్ని పదాన్ని అగ్నిహోత్ర పరంగాను, సామాన్య అగ్నిపరంగాను వ్యాఖ్యానించారు. వాటినే విదేశీ వేదభాష్యకారులైన మాక్స్‌ముల్లర్, మోనియర్ విలియం, ప్రొ. విల్సన్ మొదలగు పండితులు కూడా అదేవిధంగా వేదాలకు ఆంగ్లంలో (ఇంగ్లీషులో) వ్యాఖ్యానించారు. మహర్షి దయానంద సరస్వతి గారి సంస్కృత భాష్యం చదివిన తరువాత కొందరు భాష్యకారులు తమ తప్పిదాన్ని తెలుసుకొని సవరించుకొన్నారు. కొందరు ఇంకా తమ మూర్ఖత్వాన్ని వదలలేదు. పరమాత్మ వారికి వివేకబుద్ధిని కలిగించును గాక! అగ్ని పదము ఆధిభౌతికార్థంలో రాజుకు, సేనాపతికి, దేశనాయకులకు వర్తిస్తుంది. ఆధిదైవికార్థంలో అగ్నిహోత్రానికి, సామాన్య అగ్నికి వర్తిస్తుంది.

3) అజుడు – 'అజ – గతిక్షేపణయోః' ; 'జని – ప్రాదుర్భావే' అను ధాతువు వలన 'అజ' శబ్దమేర్పడును. 'జ' అంటే జన్మించటమని అర్థం. ముందు 'అ'

చేర్చటం వల్ల వ్యతిరేకార్థమై అజుడంటే జన్మించనివాడని అర్థం. **"న జాయతే మ్రియతేవా కదాచిత్** (భ.గీ. 2)" అని చెప్పినట్లు జీవాత్మలమైన మనం కూడా అజులమే. కాని, మనం శరీరాలలోనికి ప్రవేశిస్తూ, విడిచి పెడుతూ జనన మరణ దుఃఖాలకు గురి అవుతూ ఉంటాం. జడమైన మూల ప్రకృతిని కూడా అజ అనవచ్చు. అది కూడా క్రొత్తగా పుట్టదు. ఒకసారి ప్రపంచంగాను, మరొకసారి ప్రలయంగాను మారుతూ ఉంటుంది. కనుక ఆయా ప్రకరణాలనుబట్టి అజ పదమునకు అర్థం చెప్పుకోవాలి. పరమేశ్వరుని పరంగా అజ పదమునకు "మూల ప్రకృతియైన పరమాణువులతో సృష్టిని చేయువాడు, జీవులను వారి వారి కర్మల ననుసరించి ఆయా శరీరాలలో ప్రవేశపెడుతూ తానెప్పుడూ జన్మించనివాడని" అర్థం చెప్పుకోవాలి.

ముఖ్యసూచన : గ్రంథ విస్తరణ భీతిచే ఈ పదముల సంస్కృత నిర్వచనాలు వ్రాయుటకు వీలుపడుటలేదు. తెలుసుకోగోరువారు వాటిని మూలగ్రంథం – 'సత్యార్థ ప్రకాశం'లో చూసుకోగోరోచున్నాము.

'యోऽ జతి సృష్టిం ప్రతి సర్వాన్ ప్రకృత్యాదీన్ ప్రక్షిపతి, జనయతి కదాచిన్నజాయతే సోऽ జః'

4) అత్తా - ఈ నామము విచిత్రంగా ఉంది. కాని, తైత్తరీయోపనిషత్తులో (2-10లో) **"అద్యతేऽ త్తిచ భూతాని తస్మాదన్నం తదుచ్యతే"** అనియు, వేదాంతదర్శనం (1-2-9)లో **"అత్తా చరాచర గ్రహణాత్"** అనియు వాక్యాలొస్తాయి. వీటికి దయానంద మహర్షి "అన్నిటిని తనలోపల ఉంచుకొన్నవాడు, అందరిచే గ్రహించుటకు యోగ్యుడు, చరాచర జగత్తును గ్రహించువాడును అగుటచే దేవునకు అన్నము, అన్నాదుడు, అత్త అను నామములు కలిగిన"వని వివరించారు. కనుక ఇచ్చట 'అత్తా' అంటే అందరిచే కోరతగినవాడని అర్థం. మేడిపండులో పురుగులు పుట్టి చస్తున్నట్లే పరమేశ్వరునిలో జగత్తుయొక్క ఉత్పత్తి స్థితి లయాలు జరుగుచున్నాయి" అని తమ సత్యార్థ ప్రకాశం (మూలగ్రంథంలో) వివరించారు.

5) అన్నము - "అద భక్షణే" ఈ ధాతువు వలన "అన్న" శబ్దమేర్పడును.

6) అన్నాదము -

'అహమన్నాదోऽ హమన్నాదోऽ హమన్నాదః'

ఈ రెండు నామముల అర్థము పై వాక్యములలో ఉన్నాయి.

7) అద్వైతము (అద్వైతుడు) – బహుళ ప్రాచుర్యం పొందటంవల్ల అద్వైత పదము వినగానే ఆది శంకరాచార్యులవారు ప్రతిపాదించిన అద్వైత సంప్రదాయం గుర్తుకు వస్తుంది. వారి అభిప్రాయం ప్రకారం బ్రహ్మపదార్థం తప్ప మరొకటి లేనే లేదనేది వారి వాదన. ఇది పూర్తిగా శాస్త్ర విరుద్ధం, యుక్తి విరుద్ధం. "మహాభారత కాలంనాడు అర్జునుడు అద్వితీయ ధనుర్ధారి" అంటారు. అప్పుడు అర్జునుడు తప్ప మరెవ్వరు విలుకాండ్రు లేరని కాదుకదా! కర్ణుడున్నాడు కదా! మరెందరో విలుకాండ్రు ఉన్నారు కదా!

అసలు అద్వైత పదమునకు అర్థమేమిటంటే – రెండుగా గాని, రెంటితో కలిసిగాని ఉండటాన్ని ద్విత్వము అంటారు. దానికి ముందు 'అ' చేర్చటం వల్ల వ్యతిరేకార్థంగా రెండుగా లేనిదని అర్థం వస్తుంది. పరమేశ్వరుడు అద్వైతుడు అంటే – పరిమాణంలోగాని, శక్తిసామర్థ్యాలలోగాని పరమేశ్వరునితో సమానుడు కాని, అతనికన్న ఎక్కువవాడుగాని ఎవరూ లేరని అర్థం. అతనికన్న తక్కువ పరిమాణ శక్తి సామర్థ్యాలు గల జీవులు, జడమైన – జ్ఞానంలేని ప్రకృతి పరమాణువులు ఉన్నవని అభిప్రాయం.

'న విద్యతే ద్వైతం ద్వితీయేశ్వర భావో యస్మిన్ తద్ అద్వైతమ్'

8) అనంతుడు – (నాస్తి అంతో యస్య సః అనంతః) ఎవనికి అంతము – చివరభాగము లేదో వాడిని అనంతుడంటారు. అంటే – ఎవరికి పొడవు వెడల్పు మందము ఉండవో, మొదలు చివరలు ఉండవో అతను అనంతుడు. దేవునిలో ఇవన్నీ ఉండవు కనుక దేవుడు అనంత పరిమాణము గలవాడు.

శ్లో॥ దేశతః కాలతో వాపి గుణతో వాస్తుతోఽపి వా ।

అవధిర్యస్య నాస్తేతి సోఽ అనన్తః పరికీర్తితః ॥ – అని నిరుక్త టీకాలో మరొక నిర్వచనం.

'న విద్యతేఽన్తో న్తోఽ వధిర్ మర్యాదా యస్య తదన్తమ్'

9) అనాది – దేవుడు ఎప్పటినుండి ఉన్నాడు? ఎప్పటివరకు ఉంటాడు? దేవుని ఉనికికి కారణం ఎవరు? అనే ప్రశ్నలకు అంతుబట్టనివాడు కనుక అతడు అనాది.

'న విద్యతే ఆదిః కారణం యస్య సోఽ నాదిరీశ్వరః'

10) అంతర్యామి - (యమ ఉపరమే) యామి అంటే నియమించేవాడని అర్థం. అంతర్యామి అంటే లోపల ఉండి నియమించేవాడని అర్థం. దేవుడు అత్యంత సూక్ష్మడు కనుక ప్రతీ అణువులోను వ్యాపించి అందలి పరమాణువులను నియమించి నడుపుతూ ఆయా అణువుల ధర్మాలను కాపాడుతున్నాడు. లేకుంటే ఆక్సిజన్ నైట్రోజన్‌గా, నైట్రోజన్ ఆక్సిజన్‌గా మారిపోతూ ఉండేవి. అట్లే ప్రాణుల శరీరాలలో వ్యాపించి వాటి జీవనక్రియలను నియమించి నడిపిస్తున్నాడు. కనుక అతడు సర్వాంతర్యామి – అన్నిటిని, అందరిని నియమించి నడిపించేవాడు.

'అంతర్యన్తుం నియన్తుం శీలం యస్య సోఽ య మన్తర్యామి'

11) అర్యముడు - (ఋ–గతి ప్రాపణయోః + యత్ + మాజ్–మానే) సరియైన న్యాయం చేసేవారిని సన్మానించటం, సుఖింపచేయుటం, మానవులు మనోవాక్కాయాలతో చేసే కర్మలకు సున్నితపు త్రాసుతో తూచి యిచ్చునట్లు ఫలాలను ఇవ్వటం చేస్తున్నాడు కనుక దేవుడు అర్యముడు – అత్యంత న్యాయకారి.

'యోఽ ర్యాన్ స్వామినో న్యాయాధీశాన్ మిమీతే మాన్యాన్ కరోతి సోఽ ర్యమా'

12) ఆకాశము - (కాశృ దీప్తౌ) అన్నివైపుల నుండి జగత్‌ను ప్రకాశపరుస్తూ ఉంటాడు కనుక దేవునకు ఆకాశమనే పేరు కలిగింది.

'యః సర్వతః సర్వం జగత్ ప్రకాశ యతి స ఆకాశః'

13) ఆచార్యుడు - (య ఆచారం గ్రాహయతి సర్వా విద్యా బోధయతి స ఆచార్యః ఈశ్వరః) సదాచారాన్ని నేర్పుతూ సకల విద్యలను బోధించే వారిని ఆచార్యులంటారు. సృష్టికర్త ప్రథమ మానవసృష్టి సమయంలో ఋషులకు సకల విద్యలను, సదాచారాన్ని వేదం ద్వారా ఉపదేశించాడు. కనుక ఆచార్యులకు కూడా ఆచార్యుడు దేవుడు.

'య ఆచారం గ్రాహయతి సర్వా విద్యా బోధయతి స ఆచార్య ఈశ్వరః'

14) ఆత్మా - (అత సాతత్యగమనే) సతత గమనం కలిగిన దానిని ఆత్మ అంటారు. జీవాత్మ ఒక శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని ధరిస్తూ ఉంటుంది. కనుక జీవాత్మను కూడా ఆత్మ అనవచ్చు. పరమేశ్వరుడు సృష్టిలోని సమస్త జడపదార్థాలలోను,

జీవులలోను కూడా నిరంతరం వ్యాపించి ఉంటాడు కనుక అతనిని ఒక ఆత్మ అంటాయి శాస్త్రాలు.

'యోఽ తతి వ్యాప్నోతి స ఆత్మా'

15) పరమాత్మ - పరమేశ్వరుడు అత్యంత సూక్ష్ముడు కనుక సూక్ష్మములైన మూల ప్రకృతిలోను, జీవులలోను, ఆకాశంలోను వ్యాపించి అంతర్యామిగా ఉంటాడు కనుక అతనిని పరమాత్మ అంటాయి శాస్త్రాలు.

'పరాశ్చసా వాత్మ చ, య ఆత్మభ్యో జీవేభ్యః సూక్ష్మేభ్యః పరోఽ తి సూక్ష్మః స పరమాత్మ'

16) ఆదిత్యుడు - దో అవఖండనే. ఖండితము, నాశము అయ్యేదానిని దితి అంటారు. ఖండితము, నాశనము కానిదానిని అదితి అంటారు. దానికి తద్ధిత ప్రయోగంతో ఆదిత్య పదము నిర్మితమౌతుంది. కనుక ఆదిత్యుడంటే ఎప్పటికీ నశించనివాడని అర్థం. (యజు. 33-39 చూడండి.)

'న విద్యతే వినాశో యస్య సోఽ య మదితిః", అదితిరేవ ఆదిత్య'

17) ఆనందుడు - (టునది సమృద్ధౌ + ఆజ్) దేవుడు ఆనంద స్వరూపుడు. ముక్త పురుషులను సదా ఆనందితులను చేయుటచేతను, ధర్మాత్ములకు జీవనానందాన్ని (ఆత్మతృప్తిని) కలిగించుటచేతను దేవునకు ఆనందుడని మరియొక పేరు.

'ఆనందంతి సర్వేముక్తా యస్మిన్, యద్ వా యః సర్వాన్ జీవాన్ ఆనందయతి స ఆనందః'

18) ఆప్తుడు - (ఆప్ - వ్యాప్తౌ) సామాన్య భాషలో ఆప్తుడంటే మన మేలుకోరేవాడని అర్థం. ఆ రకంగా దేవుడు మనకు పరమ ఆప్తుడు. మానవుల మేలుకోరుతూ సృష్ట్యాదిలోనే సకల సత్యవిద్యాదాతయును, ధర్మాత్ములకు సులభంగా లభించువాడును, ధర్మాత్ములు పొందుటకు యోగ్యుడును అగుటచే దేవుడు ఆప్తుడు. (పరమ ఆప్తుడు).

'యః సర్వాన్ ధర్మాత్మన ఆప్నోతి వా సర్వధర్మాత్మభిరాప్యతే చలాది రహితః స ఆప్తః'

19) ఇంద్రుడు - (ఇది - పరమైశ్వర్యే) విశ్వమంతా అతని ఐశ్వర్యమే కనుక దేవునకు ఇంద్రుడని మరొక పేరు.

'యః ఇన్దతి పరమైశ్వర్యవాన్ భవతి స ఇంద్రః పరమేశ్వరః'

20) ఈశ్వరుడు - (ఈశ - ఐశ్వర్యే) దేవుని ఐశ్వర్యం అనంతం. అందుచే దేవునకు ఈశ్వరుడని పేరు. జ్ఞానం కూడా ఐశ్వర్యమే. అట్టి జ్ఞానం కూడా అనంతంగా ఉండటంవల్ల దేవునకు ఈశ్వరుడని సార్థక నామధేయం.

'యః ఈష్టేసర్వైశ్వర్యవాన్ వర్తతే స ఈశ్వరః'

21) పరమేశ్వరుడు - నియమంగా నడిపించు సామర్థ్యం గలవానికి ఈశ్వరుడని పేరు. ఈశ్వరులలో సమర్థవంతులలో అత్యంత సమర్థమంతుడగుట వలన దేవునకు పరమేశ్వరుడని మరియొక పేరు.

'యః ఈశ్వరేషు సమర్థేషు పరమశ్రేష్ఠః స పరమేశ్వర

22) ఉరుక్రముడు - (ఉరు = గొప్ప; క్రమః = పరాక్రమము) గొప్ప పరాక్రమవంతుడు అని అర్థం.

'ఉరుర్ మహాన్ క్రమః పరాక్రమో యస్య స ఉరుక్రమః'

23) ఓమ్ - (అవ - రక్షణే) దేవుడు మనకు గొప్ప సంరక్షకుడు (Guardian). వివరణ పూర్వ పుటలలో ఉన్నది.

'అవతీత్యోమ్'

24) కవి - (కు - శబ్దే) వేదముల ద్వారా సర్వవిద్యలను ఉపదేశించిన మహాకవి. సర్వ విద్యానిధి. కనుక అతడు ఆది కవి.

'యః కౌతి శబ్దయతి సర్వావిద్యాః స కవిరీశ్వరః'

25) కాలము - (కల - సంఖ్యానే) విశ్వమున గల సమస్త పదార్థాలను, జీవులను లెక్కించగలవాడు కనుక దేవునకు కాలము అని మరియొక పేరు.

'కలయతి సంఖ్యాతి సర్వాన్ పదార్థాన్ కాలః'

26) కాలాగ్ని - దేవుడు ప్రలయ సమయంలో అగ్నిసమానుడై కాలమునకు కూడా కాలమై 'కాలాగ్ని' ఔతాడు.

'యోఽగ్నిరివ కాలః కలయితా ప్రళయకర్తా స కాలాగ్నిరీశ్వరః'

27) కుబేరుడు - (కుబి - ఆచ్ఛాదనే) తన వ్యాపక గుణంచే దేవుడు అన్నిటిని

కప్పివేస్తాడు కనుక దేవునకు కుబేరుడని పేరు. లోకంలో ఎక్కువ ధనం కలవాడిని కుబేరుడంటారు. బహుశః డబ్బుతో అన్నిటిని కొనివేయగలుగుతాడని ఆ పేరు వచ్చి ఉండవచ్చు.

'యః సర్వం కుష్బతి స్వవ్యాప్త్యాచ్ఛాదయతి స కుబేరో జగదీశ్వరః'

28) కూటస్థుడు - (కూటే తిష్ఠతి ఇతి కూటస్థః) కూటము అంటే సమూహమని సామాన్యార్థం. జీవుడు దేహేంద్రియ మనోబుద్ధుల కూటములో (సమూహములో) ఉంటాడు కనుక జీవుణ్ణి కూటస్థుడని ఆధ్యాత్మిక శాస్త్రాలలో అక్కడక్కడ (భగవద్గీత 15-16 మొ॥చోట) కనబడుతుంది. సృష్టిలోని సర్వ పదార్థాలలో, వ్యవహారాలలో వ్యాప్తుడైయున్నప్పటికి పరమేశ్వరుడు తన స్వరూపమును విడువక వేరుగానే ఉంటాడు కనుక దేవుణ్ణి అక్కడక్కడ కూటస్థుడని పేర్కొనబడింది.

'యః కూటేऽనేక విధ వ్యవహారే స్వస్వరూపేణ తిష్ఠతి స కూటస్థ పరమేశ్వరః'

29) కేతువు - ఏకేశ్వరునకు నవగ్రహాల పేర్లు కూడా ఉన్నాయి!!!

దేవునకు గల అనేకానేక నామాలలో విచిత్రంగా పౌరాణికులు చెప్పే నవగ్రహాల పేర్లు కూడా ఉన్నాయి. అలాగని నవగ్రహాలు దేవుళ్ళుకారు. అసలు రాహుకేతువులు గ్రహాలే కాదు, నీడలు మాత్రమే. వాటికి బదులు ఆధునిక ఖగోళ విజ్ఞానం చెప్పే యురేనస్, నెప్ట్యూన్‌లను గ్రహాలుగా చెప్పుకోవటం మంచిది. అయితే లోకంలో బహుళ ప్రాచుర్యం పొందిన నవగ్రహాల పేర్లు కూడా ఏకేశ్వరునికి వర్తిస్తాయి మూలార్థాన్ని (Roor meaningను) బట్టి. అకారాది క్రమంలో ఇక్కడ కేతువు పేరు వచ్చింది. కనుక 'కేతువు' అనే పదములో మూలార్థం ఏముందో తెలుసుకొని, అది ఏకేశ్వరునకు ఎలా వర్తిస్తుందో ఇక్కడ తెలుసుకుందాము.

'కేతువు' పదము **"కిత నివాసే, రోగాపనయనేచ"** అనే సంస్కృత ధాతువుతో నిర్మించబడింది. కనుక నివసించుట, రోగాన్ని పోగొట్టుకోవటానికి చికిత్స చేసుకొనుట అనే రెండర్థాలు ఉన్నాయి. అందుచే పరమేశ్వర పరంగా ఋషులు చెప్పిన నిర్వచనం ఏమంటే - "సమస్త జగత్తునకు నివాసస్థానము, సర్వరోగరహితుడు, ముముక్షువులను ముక్తిసమయంలో జరామరణాది సమస్త రోగాలనుండి విడిపింపచేయువాడు కనుక దేవునకు 'కేతువు' అనే పేరు వర్తిస్తుంది" అన్నారు.

'యో కేతయతి చికిత్సతి వా స కేతురీశ్వరః'

30) ఖమ్ - సంస్కృత భాషలో 'ఖమ్' అంటే ఆకాశమని అర్థం. ఆకాశంవలె దేవుడు కూడా వ్యాపించి ఉంటాడు కనుక వేదశాస్త్రాలో అక్కడక్కడ దేవుణ్ణి 'ఖమ్' అనే పదముతో పేర్కొనటం జరిగింది. ఉదా : **"ఓ3మ్ ఖమ్ బ్రహ్మ"** – యజుర్వేదం (40–17).

'ఆకాశమివ వ్యాపకత్వాత్ ఖమ్.'

31) గణపతి -

32) గణేశుడు - ఈ రెండు పదములు **"గణ – సంఖ్యానే"** అనే ధాతువుతో నిర్మించబడతాయి. కనుక లెక్కించతగినవానికి పతి, ఈశుడు అనే అర్థాలు వస్తాయి. దేవుని పరంగా లెక్కించతగిన ప్రకృతిలోని వివిధ పదార్థాలకు, అనేక జీవులకు పతి–పాలకుడు, రక్షకుడు కనుక గణపతియనీ, వాటిని నియమించి నడిపించగలవాడు కనుక గణేశుడనీ అర్థం చెప్పుకోవాలి.

'యే ప్రకృత్యాదయో జడా జీవశ్చ గణ్యన్తే సంఖ్యాయన్తే తేషా మీశః స్వామి పతిః పాలకో వా.'

33) గరుత్మాన్ - ఎవని ఆత్మ (స్వరూపము) చాలా పెద్దదో గొప్పదో అతడు గరుత్మాన్ – గరుత్మంతుడు. పరిమాణంలో, గొప్పదనంలో దేవుడే గొప్పవాడు కనుక ఈ విశేష నామము దేవునకు వచ్చినది.

'యో గుర్వాత్మా స గరుత్మాన్'

34) గురువు - "గృ – శబ్దే" మానవులకు కావలసిన సమస్త విద్యలను, వేదము ద్వారా సృష్ట్యాదిలోనే ఋషుల హృదయాలలో ప్రకాశింపచేసినవాడు కనుక గురువులకును గురువు ఆది గురువు పరమేశ్వరుడే. అందుచేతనే పతంజలి మహర్షి తమ యోగదర్శనం (1–29)లో **"స (ఏష) పూర్వేషామపిగురుః కాలే నానవచ్ఛేదాత్"** అని సూత్రీకరించారు.

ఇంతేగాక, ఇప్పటికినీ మనలో అంతర్యామిగా నుండి పరోపకారాది సత్కర్మలు చేసినపుడు ఆనందాన్నీ, ప్రోత్సాహాన్నీ కలిగిస్తున్నాడు. చెడుకర్మలు చేయబోయే ముందు భయము, శంక, లజ్జ కలుగజేసి హెచ్చరిస్తున్నాడు. అర్థం చేసుకున్న

బుద్ధిమంతులు వాటిని ఆపివేసి పాపం చేయకుండా రక్షింపబడుతున్నారు. నిర్లక్ష్యం చేసినవారు పాపులై కష్టాలపాలౌతున్నారు.

ఇంతేగాక, మనం యోగసాధనలు చేసి సమాధిస్థితిని పొందగలిగితే మనకి కావలసిన విద్యలను అంతర్యామి నుండి పొందవచ్చును. ఋషిత్వాన్ని పొందవచ్చును.

'యో ధర్మ్యాన్ శబ్దాన్ గృణాత్యుపదిశతి స గురుః'

35) చంద్రుడు - (చది - ఆహ్లాదే) చంద్రుడంటే ఆహ్లాదం కలిగించేవాడని మూలార్థం. భౌతిక చంద్రుని వెన్నెల మనకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది కనుక ఆకాశంలోని ఆ ఉపగ్రహాన్ని చంద్రుడని పేర్కొంటారు. దీనికి పరమేశ్వరుని పరంగా – తాను ఆనంద స్వరూపుడై తననుపాసించువారందరికి ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగిస్తాడు కనుక దేవునకు చంద్రుడని పేరు.

'యశ్చన్దతి చందయతి వా స చంద్రః'

36) చిత్ - (చితి – సంజ్ఞానే) చిత్ అంటే చక్కగా తెలిసినవాడు, విచారశీలుడు, జ్ఞానవంతుడు అని అర్థం. దేవుడు అందరికన్న ఎక్కువ జ్ఞానవంతుడు – పూర్ణజ్ఞాని. అతని జ్ఞానం అనంతం. కనుక దేవుణ్ణి చిత్ స్వరూపుడని పేర్కొంటారు.

'యశ్చేతతి చేతయతి సంజ్ఞాపయతి సర్వాన్ సజ్జనాన్ యోగిన సచ్చిత్ పరం బ్రహ్మ'

37) జలము - (జల - ఘాతనే) దుష్టులను దండించి దారిలో పెట్టువాడు కనుక దేవునకు జలమని పేరు. కనబడని పరమాణువులను వివిధ నిష్పత్తులలో కలిపి సృష్టిని చెయ్యటం, కాలాంతరంలో వాటిని విడదీసి ప్రలయం చేయటం మొ.నవి చేస్తూ ఉంటాడు కనుకను కూడా దేవునకు జలమని పేరు వచ్చిందంటారు ఋషులు.

'జలతి ఘాతయతి దుష్టాన్, సంఘాతయతి అవ్యక్త పరమాణ్వాదీన్ తద్ బ్రహ్మ జలమ్'

38) జ్ఞానము – చరాచర జగత్తునంతా తెలియువాడు కనుక దేవునకు జ్ఞానమని పేరు. "సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ" అని తైత్తరీయ ఉపనిషత్ (2–1). దేవుడు పరిపూర్ణ జ్ఞాని.

'యజ్ఞానాతి చరాచం జగత్ తద్ జ్ఞానమ్'

39) తైజసుడు - (తిజ - నిశానే) పరమేశ్వరుడు స్వయం ప్రకాశకుడు మరియు సూర్య నక్షత్రాదులకు ప్రకాశాన్నిస్తున్నాడు కనుక తైజసుడని చెప్పబడ్డాడు.

40) దయాళుడు - (దయ - దాన, గతి, రక్షణ, హింసా, దానేషు) దాన దయాది గుణాలు కలవాడు కనుక దేవునకు దయాళుడని పేరు. దీనిని మరికొంత వివరిస్తూ మహర్షులు "అభయదాత, సత్యాసత్యాలను సర్వవిద్యలను తెలియువాడు, సజ్జనులను రక్షిస్తూ దుష్టులను శిక్షించువాడు కనుక దేవునకు దయాళుడని పేరు వచ్చిం"దన్నారు.

'దయతే దదాతి జానాతి గచ్ఛతి రక్షతి హినస్తి యయా సా దయా, బహ్వీ దయా విద్యతే యస్య స దయాలుః'

41) దివ్యుడు - "ద్యుషు శుద్ధేశు పదార్థేషు భవో దివ్యః" అని మహర్షులు నిర్వచించారు. అంటే - ప్రకృతి మొదలైన దివ్య పదార్థాలలో వ్యాపించి ఉన్నవాడని అర్థం. దివ్య పదార్థాలన్నిటికీ దివ్యత్వాన్ని ప్రసాదిస్తున్నాడు కనుక దేవునకు దివ్యుడని మరియొక పేరు.

42) దేవదేవుడు - "దివు-క్రీడా విజిగీషా వ్యవహార ద్యుతి......" అనే 10 అర్థాలు గల పెద్ద ధాతువుతో దేవ పదము నిర్మించబడుతుంది. ఈ అర్థాలన్నీ దేవునకు వర్తిస్తాయి. ఎట్లంటే - అతడు

1. క్రీడా = పరుల సహాయం లేకుండా తానొక్కడే క్రీడగా ఈ సృష్టిని చేశాడు.

   'యో దీవ్యతి క్రీడతి స దేవః'

2. విజిగీషా = సదా అతడు జయశీలుడే - అతని నెవరూ జయించలేరు.

   'యో విజిగీషతే స దేవః'

3. వ్యవహార = అతడు న్యాయాన్యాయ వ్యవహార కుశలుడు.

   'యో వ్యవహారయతి స దేవః'

4. ద్యుతి = స్వయం ప్రకాశకుడు.

   'యశ్చరా చరం జగత్ ద్యోతయతి స దేవః'

5. స్తుతి = స్తుతించ తగినవాడు.

'య స్తూయతే స దేవః'

6. మోద = ఆనంద స్వరూపుడు.

'యో మోదయతి స దేవః'

7. మద = మదోన్మత్తుల మద మణిగిస్తాడు.

'యో మాద్యతి స దేవః'

8. స్వప్న = ప్రాణులను (జీవులను) నిద్రపుచ్చి విశ్రాంతి నిస్తాడు.

'యో స్వాపయతి స దేవః'

9. కాంతి = కామించ తగినవాడు - అందరిచే కోరతగినవాడు.

'యః కామయతే కామ్యతే వా స దేవః'

10. గతి = గతిశీలుడు. తాను కదలకనే జగత్తునంతా గతివంతం చేస్తున్నాడు.

'యో గచ్ఛతి గమ్యతే వా స దేవః'

ఈ విధంగా దేవ పదములోని 10 అర్థాలు ఏకేశ్వరునికి వర్తిస్తాయి. అందుచేతనే మనం పలుమార్లు 'దేవుని దయ', 'దేవుని దయ' అని వ్యవహరిస్తున్నాము.

ఇవేకాక సంస్కృత భాషలో 'దేవ' పదమునకు విస్తృతమైన అర్థాలున్నాయి. సంక్షిప్తంగా **"యో దీవ్యతి క్రీడతి స దేవః** = దేవుడు తన ఆనంద స్వరూపంలో స్వయంగా క్రీడిస్తూ, ఎవరి సహాయం లేకుండానే తానొక్కడే సృష్టి స్థితి ప్రలయాలు చేస్తున్నాడు కనుక దేవు"డని నిర్వచించారు.

43) దేవీ - దేవ పదములో ఉండే అర్థాలన్నీ దేవీపదములోనూ ఉన్నాయి. పరమేశ్వర నామములు మూడు లింగాలలోను ఉంటాయి. ఈశ్వరునకు విశేషణమైనప్పుడు దేవుడనీ, చితి, శక్తి పదములకు విశేషణమైనప్పుడు దేవీ అని అవుతుంది.

44) ధర్మరాజు - కేవలం ధర్మపూర్వక వ్యవహారమే చేస్తాడు కనుక దేవునకు ధర్మరాజు అని పేరు.

'యో ధర్మే రాజతే స ధర్మరాజః'

45) నారాయణుడు -

శ్లో॥ ఆపో నారా ఇతిప్రోక్తా ఆపో వై నరసూనవః ।
తా యదస్యాయనం పూర్వం తేన నారాయణః స్మృతః
– మను. 1-10

నీళ్ళకు, జీవులకు 'నారా' అని పేరు. అయనం అంటే నివాస స్థానం. కనుక సర్వజీవులందు వ్యాపకుడైన పరమేశ్వరునికి నారాయణుడని పేరు.

46) నిత్యుడు - త్రికాలలోను దేవుడు ఏకరసుడై ఉంటాడు. సర్వవ్యాపకుడు కనుక అతడు నిశ్చలుడు (చలన రహితుడు); ఎప్పటికీ నశించేవాడు కాదు కనుక దేవునకు 'నిత్యుడు' అని పేరు.

'యో నితధ్రువోఽ చలోఽ వినాశీ స నిత్యః'

47) నిరంజనుడు - అంజనుడంటే మోహ యుక్తుడని అర్థం. దేవుడు మోహం లేనివాడు, ఆకార రహితుడు, దుష్టాచారాలు, దుర్వ్యసనాలు లేనివాడు, విషయాసక్తుడు కానివాడు కనుక దేవునకు నిరంజనుడని పేరు.

'అంజనం వ్యక్తిర్ మ్లక్షణం కుకామనాభిర్ ఇంద్రియై ప్రాప్తిశ్చేత్యస్మాద్ యో నిర్గతః పృథగ్ భూతః స నిరంజనః'

48) నిరాకారుడు - దేవుడు సర్వవ్యాపకుడు కనుక అతనికి ఆకారం ఉండదు. ఆకారంలేని పరమేశ్వరునకు నిరాకారుడని పేరు. దుష్టసంహారం చెయ్యటానికి కూడా శరీరధారణ చేయవలసిన పనిలేదు. అతని గుండెను ఆపివేస్తే చస్తాడు కదా!

'నిర్గత ఆకారాత్ స నిరాకారః'

49) నిర్గుణుడు - శబ్ద స్పర్శాది ప్రకృతి గుణాలు, కామ క్రోధాది జీవుల గుణాలు లేనందువలన దేవునకు నిర్గుణుడని పేరు.

'యో గుణేభ్యో నిర్గతః స నిర్గుణ ఈశ్వరః'

50) న్యాయకారి - పక్షపాతరహితమైన ఆచరణకు న్యాయమని పేరు. కేవలం న్యాయకరమైన స్వభావమే కలవాడగుటచేత దేవునకు న్యాయకారి అనిపేరు.

'న్యాయం కర్తుం శీలం యస్య స న్యాయ కారీశ్వరః'

51) పిత - (పా - రక్షణే). పితా అంటే రక్షించి పోషించేవాడని అర్థం. దేవుడు సకల జీవులను పాలించి పోషిస్తాడు కనుక అతనికి 'పిత' అని 'పరమపిత' అని పేర్లు.

'యః పాతి సర్వాన్ స పితా'

52) పితామహుడు - తండ్రి తండ్రిని పితామహుడంటారు. మన తాత ముత్తాతలకును పిత కావున దేవునకు పితామహుడని పేరు.

'యః పితృణాం పితా స పితామహః'

53) పురుషుడు - దేహపురంలో ఉన్నవాడు కనుక జీవుణ్ణి పురుషుడంటారు. బ్రహ్మాండమనే పురంలో పూర్ణంగా ఉంటాడు కనుక దేవునకు కూడా పురుషుడనే పేరు వచ్చింది.

'యః స్వవ్యాప్త్యా చరాచరం జగత్ పృణాతి పూరయతి వా స పురుషః'

54) పృథివి - (పృథు - విస్తారే) విస్తరించి ఉండు దానిని పృథివి అంటారు. భూమి గుండ్రంగా ఉన్నా మన కంటికి బల్లపరుపుగానే కనబడుతుంది కనుక మనం భూమిని పృథివి అంటున్నాము. దేవుడు ప్రకృతిని జగత్తుగా విస్తరింప చేశాడు కనుక ఆయనకు పృథివి అని మరియొక పేరు.

'యః పర్థతి సర్వం జగత్ విస్తృణాతి పృథివీ'

55) ప్రజాపతి - జీవు లనే ప్రజలందరికి దేవుడు పతి - పాలకుడు. సకల ప్రాణులను పాలించి పోషించేవాడు కనుక దేవునకు ప్రజాపతి అని పేరు.

'యో పాలయతి రక్షయతి సర్వభూతాని సః ప్రజాపతిరీశ్వరః'

56) ప్రపితామహుడు - లోకంలో తాత తండ్రిని ప్రపితామహుడని అంటారు. దేవుడు మన ముత్తాతలకును ముత్తాత కనుక ఆయనకు ప్రపితామహుడని పేరు.

'యః పితామహానాం పితా స ప్రపితామహః'

57) ప్రాజ్ఞుడు - విశేషంగా తెలిసికోగలవాడు సర్వజగత్తు వ్యవహారములను ఉన్నది ఉన్నట్టుగా తెలుసుకోగలడు కనుక దేవునికి 'ప్రాజ్ఞుడు' అని పేరు.

'యః ప్రకృష్టతయ చరాచరస్య జగతో వ్యవహారం జానాతి స ప్రజ్ఞః ప్రజ్ఞ ఏవ ప్రాజ్ఞః'

58) ప్రాణము - ప్రాణవాయువును సృజించి ప్రాణులన్నిటికి ప్రాణము నిచ్చుచున్నాడు కనుక దేవునకు 'ప్రాణము' అని పేరు.

'ప్రాణాయ నమో యస్య సర్వ మిదం వశే, యో భూతః సర్వస్యేశ్వరో యస్మిన్త్సర్వం ప్రతిష్ఠితమ్'

59) ప్రియుడు - సకల ధర్మాత్ములను, ముముక్షువులను మరియు శ్రేష్ఠులను ఆనందింప చేయువాడునూ, అందరిచే కోరబడువాడును కనుక దేవునకు 'ప్రియు'డని పేరు.

'యః పృణాతి ప్రీయతే వా స ప్రియః'

60) బంధువు - (బంధ – బంధనే) బంధించి ఉన్నవాడిని 'బంధువు' అంటారు. మన చుట్టాలు మోహంతో మనను బంధించి ఉంటారు కనుక చుట్టాలకు బంధువులని పేరు. పరమేశ్వరుడు సకల జీవులను తన ప్రేమపాశంతో బంధించి ఉన్నాడు కనుక అతనికి బంధువు అనే పేరు వచ్చింది.

'యః స్వస్మిన్ చరాచరం జగత్ బధ్నాతి, బంధువత్ ధర్మాత్మానం సఖాయ సహాయో వా వర్తతే స బంధుః'

61) బుద్ధుడు - (బుధ – అవగమనే) అవగమనం అంటే చక్కగా తెలుసుకోవటం. లోకంలో ఎక్కువ తెలిసినవాడిని బుద్ధిమంతుడంటారు. దేవుడు సర్వజ్ఞుడు కనుకనూ, అందరి బుద్ధికి విషయమైన వేదాలను ప్రకాశపరిచాడు కనుకను దేవునికి బుద్ధుడని పేరు.

'యో బుద్ధవాన్ సదైవ జ్ఞాతాஉస్తి స బుద్ధో జగదీశ్వరః'

62) బుధుడు - (బుధ – అవగమనే) పై 61వ నామములో తెలిసికొన్నట్లు అవగమనం అంటే యథార్థ జ్ఞానం. స్వయంగా జ్ఞాన స్వరూపుడు, ఎల్లరి జ్ఞానమునకు కారణమైన బుద్ధిని సృజించినవాడు కనుక దేవునకు బుధుడు అని పేరు.

'యో బుధ్యతే బోధయతి వా స బుధః'

63) బృహస్పతి - బృహస్పతి అంటే 'గొప్పపతి' అని అర్థం. పరమేశ్వరుడు

బ్రహ్మాండములన్నిటికి పతి – పాలకుడు కనుక అతనికి 'బృహస్పతి' అని పేరు.

'యో బృహతామ్ ఆకాశాదీనాం పతిః స్వామి పాలయితా స బృహస్పతి'

64) బ్రహ్మ - 'సర్వేభ్యో బృహత్వాత్ బ్రహ్మ'

65) బ్రహ్మ - (బృహ – బృహి వృద్ధౌ) అనే ధాతువులతో బ్రహ్మ, బ్రహ్మ అనే పదములు తయారవుతాయి. కనుక బ్రహ్మ అంటే పెద్దది, గొప్పది అని అర్థం. దేవునికన్న గొప్పవాడు, పెద్దవాడు ఎవరూ లేరు కనుక అతనికి బ్రహ్మ లేక బ్రహ్మ అని పేర్లు కలిగాయి.

'యోఽ ఖిలం జగన్నిర్మాణేన బర్హతి (బృహంతి) వర్ధయతి స బ్రహ్మః'

66) భగవాన్ - (భజ – సేవాయామ్) సమగ్ర ఐశ్వర్యవంతుడు, అందరిచే భజింపదగినవాడు, మరియు సేవింపదగినవాడు అగుటచే దేవునకు 'భగవాన్' అని పేరు. భగ పదమునకు విద్వాంసులు మరి రెండు నిర్వచనాలు చెప్పారు.

శ్లో॥ ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః ।
జ్ఞాన వైరాగ్యమోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణ ॥

సమగ్ర ఐశ్వర్యం (రాజ్యాధిపత్యం) పరాక్రమం, కీర్తి, వివిధ సంపదలు ఆత్మ పరమాత్మల విషయక జ్ఞానం, వైరాగ్యం (భౌతిక సంపదలపై విరక్తి, భగవంతునిపై అనురక్తి) అనే ఆరింటికి "భగము" అని పేరు.

శ్లో॥ ఉత్పత్తించ వినాశం చ భూతానా మాగతమ్ గతమ్ ।
వేత్తి విద్యాం చావిద్యాం చ స వై భగవాన్ ఇతి స్మృతః ॥

సృష్టి యొక్క ఉత్పత్తి వినాశాలను, ప్రాణుల (జీవుల) రాకపోకలను, విద్య అవిద్యలను చక్కగా తెలుసుకున్న సాధు మహాత్ములను భగవాన్ అంటారు.

భగవాన్ అంటే భగాన్ని (ఐశ్వర్యాన్ని) కలవాడని అర్థం. కనుక పై సంపదలలో ఏ సంపదను కలిగి ఉన్నవారినైనా భగవాన్ అనవచ్చు. అట్లే ఆధ్యాత్మిక జ్ఞానం కలిగినవారినీ, వైరాగ్య సంపన్నులనూ కూడా 'భగవాన్' అని సంబోధించవచ్చు. కాని, మానవులలోని భగవాన్ లందరికంటె చాలా చాలా భగములను – ఐశ్వర్యాలను కలిగినవాడు కనుక దేవుడే అసలైన భగవంతుడు.

'భగః సకలైశ్వర్యం సేవనం వా విద్యతే యస్య స భగవాన్'

67) భూమి - దేనిపై సర్వభూతములు – ప్రాణులు నిలిచి ఉన్నాయో దానిని భూమి అంటారు. మనం ఉన్న భూమి అటువంటిదే కదా? విశ్వంలో ఇట్టి భూములు మరెన్నో ఉండి ఉంటాయి. ఇవన్నీ దేవునిలోనే ఉన్నాయి కదా! అందుచే అతను భూములన్నిటికీ భూమి – ఆధారం.

'భవంతి భూతాని యస్యాం సా భూమిః'

68) మంగళుడు - ఇక్కడ మంగళుడంటే మంగళ గ్రహం కాదు. **(మగి – గత్యర్థః)** పూర్వ పుటలలో తెలుసుకున్నట్లు గతికి – జ్ఞానం, గమనం, ప్రాప్తి అనే మూడర్థాలుంటాయి. ఇంతేగాక, శుభము, క్షేమము అనే అర్థాలు కూడా ఉన్నాయి. పరమేశ్వరుడు అందరి క్షేమాన్ని కోరేవాడు, వారికి శుభాలను, సుఖాలను ప్రసాదించేవాడు, మంగళ స్వరూపుడు కనుక దేవునికి మంగళుడని మరియొక పేరు.

'యోమంగతి మంగయతి వా స మంగలః'

69) మనువు - (మన – జ్ఞానే) దేవుడు జ్ఞాన స్వరూపుడు, మాననీయుడు కనుక అతనికి మను వని పేరు కలిగింది.

'యో మన్యతే స మనుః'

70) మహాదేవుడు - జడ, చేతన దేవతలన్నిటికి దేవుడు కనుక అతనికి మహాదేవుడనే పేరు కూడా ఉంది.

'యో మహతాం దేవః స మహాదేవః'

71) మాతరిశ్వుడు - మాతరి అంటే అంతరిక్షమని అర్థం. ఆ అంతరిక్షంలో సంచరిస్తూ ఉంటుంది కనుక వాయువునకు మాతరిశ్వుడు అనే పేరు కలిగింది. ఆ వాయువులో ప్రాణులన్నిటికి అత్యవసరమైనది ప్రాణవాయువు (Oxygen). అట్టి ప్రాణవాయువును సృజించినవాడు, వాయువుకన్న బలవంతుడు కనుక దేవుని కూడా అక్కడక్కడ మాతరిశ్వుడని పేర్కొనటం జరిగింది.

పూర్వం ఉదహరించిన ఋగ్వేద (1–164–46) మంత్రంలోని చివరి పదం "..... యమం మాతరిశ్వానమాహుః"లోని మాతరిశ్వ పదం అక్కడ సృష్టికర్తకే వర్తిస్తుంది.

'యో మాతరిశ్వా వాయు బలవాన్ స మాతరిశ్వా'

72) మాత - పూర్ణదయ కలిగిన తల్లి తన సంతానం యొక్క సుఖాన్ని, ఉన్నతిని కోరుతుంది. అట్లే, పరమేశ్వరుడు సర్వజీవుల ఉన్నతిని కోరుతూ ఉంటాడు కనుక అతనికి మాత అనే పేరు కూడా కలిగింది. **"త్వం హి నః పితా వసో త్వం మాతా...** (ఋ. 8-98-17) సర్వజీవులను నీయందు వసింపచేసుకొనుచున్న ఓ వసో! నీవే మాకు నిజమైన పితవు. మాతవు కూడా నీవే. తల్లిగర్భంలో మాకు శరీరాలను నిర్మించి యిచ్చుచున్నది నీవే కదా!" అని ప్రార్థన చేసుకోమంటుంది వేదం. "నీవే తల్లివి తండ్రివి నీవే గురుడవు దైవం......" అని ప్రార్థించారు మన తెలుగు కవులు.

'యో మిమీతే మానయతి సర్వాన్ జీవాన్ స మాతా'

73) మిత్రుడు - (ఞిమిదా - స్నేహనే) అందరిని ప్రేమించేవాడు, అందరిచే ప్రేమింపయోగ్యుడు, స్నేహశీలుడు కనుక దేవునకు మిత్రుడనే పేరు కలిగింది.

'మేద్యతి స్నిహ్యతి స్నిహ్యతే వా స మిత్రః'

74) ముక్తుడు - (ముచ్లృ - మోచనే) అవిద్యాది క్లేశాలనుండి, త్రివిధ దుఃఖాల నుండి సదా ముక్తుడు కనుక దేవుడు నిజమైన ముక్తుడు. అట్లే ముముక్షువులను కూడా అవిద్యాది క్లేశాలనుండి, త్రివిధ దుఃఖాలనుండి విడిపించి తన తృతీయ ధామంలో విహరింపచేస్తాడు కనుక అతడు ముక్త స్వభావుడు. అందుచేతనే దేవుని నిత్య శుద్ధ బుద్ధ ముక్త స్వభావా! అని కీర్తిస్తాము.

'యో ముంచతి మోచయతి వా ముముక్షూన్ స ముక్తో జగదీశ్వరః'

75) యజ్ఞము - (యజ - దేవపూజా సంగతికరణ దానేషు) యజ్ఞపదంలో 3 అర్థాలున్నాయన్నారు పాణిని మహర్షి.

అ) యజ్ఞము - జడమైన పంచభూతాలను, దైవీశక్తులను అగ్నిహోత్రం ద్వారా పూజించాలి. మాతా పిత ఆచార్యాది చేతన దేవతలను తగిన విధంగా సత్కరిస్తూ, సేవిస్తూ ఉండాలి. అట్టి దానినే దేవపూజ అంటారు. గుళ్ళల్లో చేసే షోడశోపచార పూజ దేవపూజ కాదు.

ఆ) సంగతికరణం - అంటే కలపటం. మానవులను సంఘటిత పరచి

ఒక ఉద్యమం నడపటాన్ని కూడా యజ్ఞం అనవచ్చు. కొన్ని మూలకాలను, పదార్థాలను కలిపి ప్రయోజనకరమైన ఒక క్రొత్త యంత్రాన్ని గాని, మందులనుగాని నిర్మించటం కూడా యజ్ఞమే.

ఇ) దానం – తన కష్టార్జితాన్ని పరోపకారం కొరకు ఖర్చుపెట్టడం. తను మనో ధనాలతో పరోపకారం చేయటం కూడా యజ్ఞమే. భూదాన యజ్ఞం, విద్యాదాన యజ్ఞం మొ.

పై విధమైన యజ్ఞాలు మనం చెయ్యవలసినవి. దేవుడు చేసేది సృష్టి కార్యరూప మహాయజ్ఞం. వివిధ నిష్పత్తులలో సత్త్వ రజ తమము లనబడే పరమాణువులను జ్ఞానపూర్వకంగా కలుపుతూ, జీవులమైన మనకొరకు ఈ అద్భుతాద్భుతమైన సృష్టిని చేస్తున్నాడు, దేవుడు. అతడు దేవతలందరిచేత పూజింప తగిన యోగ్యుడైన మహాదేవుడు. నిరంతర దానశీలి. కనుక అతడు యజ్ఞ స్వరూపుడు. కనుకనే "యజ్ఞో వై విష్ణుః" (శతపథ బ్రాహ్మణం 23-1-8-8) అని ఋషులు కీర్తించారు. విష్ణువే యజ్ఞము – సర్వవ్యాపకుడే నిజమైన యజ్ఞమన్నారు. సృష్టిలోని అనేకానేక పదార్థాలను పేర్కొంటూ అవన్నీ 'యజ్ఞేన కల్పంతామ్' = యజ్ఞ స్వరూపుడైన పరమాత్మచే సృజింపబడ్డాయంటుంది యజుర్వేద 18వ అధ్యాయం చమకం.

'యో యజతి విద్వద్భిర్జ్యతే వా స యజ్ఞః'

76) యముడు - యముని పేరు వినగానే అందరికి భయం. యముడు మృత్యుదేవతయనీ, భయంకర ఆకారంతో, దున్నపోతుపై స్వారీచేస్తూ మృత్యుపాశంతో ప్రాణుల ప్రాణాలు లాగివేస్తూ ఉంటాడనీ లోకంలో ఒక కల్పిత కథ బహుళ ప్రాచుర్యం పొందింది. కాని, ఇది ఎంతమాత్రం సత్యంకాదు. సర్వవ్యాపకుడైన ఏకేశ్వరునికే యముడనే పేరు కూడా ఉంది. యమ పదం **'యము – ఉపరమే'** అనే ధాతువుతో నిర్మించబడుతుంది. అంటే – నియమించేవాడని అర్థం. జీవులు చేసిన కర్మల ఫలాలను అనుభవింపచేయటానికి ప్రాణులుగా సృజించి ప్రారబ్ధం పూర్తయిన తదుపరి ఆ శరీరం నుండి వేరుచేసి మరొక శరీరంలో ప్రవేశపెడతాడు. జీవులు అవిద్యలవల్ల తన అసలు స్వరూపాన్ని మరచి దేహమే తాననే భావంలో ఉంటాడు. దేహంపై మోహాన్ని పెంచుకుంటాడు. అది పోతున్నదంటే చాలా చాలా భయపడిపోతూ ఉంటాడు. ఈ మరణ భయాన్నే

పతంజలి మహర్షి 'అభినివేశ' మన్నారు. ఈ అభినివేశ భయం పామరులకే కాక పండితులకు కూడా ఉంటుందట. ఆత్మజ్ఞానం బలపడినవారే నిర్భయంగా ఉండగలుగుతారు. పరమాత్మ సాక్షాత్కారం పొందినవారైతే యథేచ్ఛగానే "తేరీ ఇచ్ఛా పూర్ణహో" అంటూ శరీరాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోతారు. మహర్షి దయానందులవారు అట్లే చేశారు. వారు యమ పదమునకు ఈ క్రింది విధంగా నిర్వచనం వ్రాశారు.

"సర్వ ప్రాణుల కర్మలకు అత్యంత న్యాయంగా ఫలాల ననుభవింపచేయ వ్యవస్థ చేసేవాడు, సర్వ అన్యాయాలనుండి వేరుగా ఉండేవాడు కనుక పరమాత్మకు యముడని పేరు" అన్నారు. అంటే పరమాత్మ సుయోగ్యుడైన న్యాయాధీశుడు (Sincere Judge).

'యః సర్వాన్ ప్రాణినో నియచ్ఛతి స యమః'

77) రాహువు - పూర్వ పుటలలో కేతువు పదం వద్ద తెలుసుకున్నట్లే ఈ రాహువు పౌరాణిక నవగ్రహాలలోని రాహువు కాదు. (రహ–త్యాగే) – ఎవనిలో మరొక పదార్థం కలిసిపోలేదో – పరమ శుద్ధుడో, దుష్టులను దండించి శిష్టులను రక్షిస్తాడో అతడు రాహువు – పరమాత్మ.

'యో రహతి పరిత్యజతి దుష్టాన్, రాహయతి త్యాజయతి వా స రాహురీశ్వరః'

78) రుద్రుడు - (రుదిర్ – అశ్రువిమోచనే (రోదనే)) రుద్రుడంటే ఏడిపించేవాడని మూలార్థం. ఏకేశ్వరునికే శివ నామంతోబాటు రుద్ర నామం కూడా ఉంది. కనుక దేవుడు అకారణంగా ఎవరిని బాధపెట్టడు. పాప ప్రక్షాళన కోసమే దుఃఖాలనిచ్చి ఏడిపిస్తాడు. ఆయనది తల్లికి ఉండే రౌద్రం వంటిది. తల్లి పిల్లవాడు బాగుపడాలని చెడుపని చేస్తే దండించి ఏడిపిస్తుంది. తరువాత హృదయానికి హత్తుకొని ఆదరిస్తుంది. అట్లే దేవుని రౌద్రం కూడా ఉంటుంది.

'యో రోదయత్య న్యాయకారిణో జనాన్ స రుద్రః'

79) లక్ష్మి - (లక్ష – దర్శనాంకయోః) దర్శించునది, దర్శింపబడునది, దర్శించతగినది లక్ష్మి. లోకంలో ఈ పదమును ఐశ్వర్యానికి, వివిధ సంపదలకు, ఐశ్వర్య సంపన్నులకు విశేషణంగా ప్రయోగింపబడుతుంది. నిజంగా కూడా ఐశ్వర్యాన్ని, అందాన్ని మనం దర్శించగోరుతూ ఉంటాము కదా! ఈ నామము ఏకేశ్వరునికి కూడా వర్తిస్తుంది. పూర్వం తెలిపినట్లుగా దేవునకు స్త్రీ పురుష నపుంసక

లింగాల మూడింటిలోను పేర్లున్నాయి. అతడు లింగభేదంలేని సర్వవ్యాపక నిరాకారతత్త్వం. లక్ష్మీ పదమునకు ఋషులు ఈవిధంగా నిర్వచనం చెప్పారు – "చరాచరమగు సమస్త జగత్తును చూసేవాడు, సూక్ష్మరూపంలో ఉన్న మూలప్రకృతిని స్థూల జగత్తుగా చేసేవాడు, శరీరమందు కన్ను ముక్కు చెవులు నోరు మొదలగువానిని, వృక్షాలలో పత్ర పుష్ప ఫలాలను సృజించేవాడు, వాటిలో వివిధ రంగులను నింపి మనకు కనబడేటట్టు చేసేవాడు కనుక దేవునకు 'లక్ష్మి' అని పేరు. వేదాది శాస్త్రాలకు, ధార్మికులు విద్వాంసులు నగు యోగులకు లక్ష్యంగా – చేరుకోవలసిన గమ్యంగా ఉండేవాడు కనుకను దేవునకు లక్ష్మి అని పేరు" అన్నారు.

'యో లక్షయతి పశ్యతి, అంకతే చిహ్నాయతి చరాచం జగత్, అథవా వేదైరాప్తైభిర్ యోగిభిశ్చ యో లక్ష్యతే స లక్ష్మీః సర్వ ప్రియేశ్వరః'

80) వసువు - (వస – నివాసే) ఎవనిలో సర్వ పదార్థాలు, సర్వప్రాణులు వసించుచున్నవో, ఎవరు సర్వ పదార్థాలలో వసించుచున్నాడో అతడు వసువు. (పంచభూతాలు, సూర్య చంద్ర నక్షత్రాలు మనకు వసువులు. వాటిలో, వాటివలన మనం నివసిస్తున్నాము. ఈ వసుదేవతలు కూడా దేవునిలోనే వసిస్తున్నాయి) **"యస్మిన్ దేవా అధివిశ్వే విషేదుః"** అంటుంది ఋగ్వేదం (1-164-39).

'వసన్తి భూతాని యస్మిన్ అథవా యః సర్వేషు వసతి స వసురీశ్వరః'

81) వరుణుడు - (వృఞ్ – వరణే, వర – ఈప్సాయామ్) ముముక్షువులు, యోగులు ఎవనిని వరిస్తారో అతడు వరుణుడు. అట్టి యోగ్యులను దేవుడు కూడా వరిస్తాడు. స్వీకరిస్తాడు లేక **"వరుణో నామ వరః శ్రేష్ఠః"** పరమేశ్వరుడు అందరికన్న శ్రేష్ఠుడు, వరింపదగినవాడు. కనుక వరుణ నామము వచ్చింది.

'యః సర్వాన్ శిష్టాన్ ముముక్షూన్ ధర్మాత్మనో వృణోతి, అథవా యః శిష్టైర్ముక్షుభిర్ ధర్మాత్మాభిర్ వ్రియతే వర్యతే వా స వరుణః పరమేశ్వరః'

82) వాయువు - (వా – గతి గంధనయోః), (బలినాం బలిష్ఠః స వాయుః) గతి, గంధ గుణములు కలిగినది సామాన్య వాయువు. వాయువు చాలా బలమైన గతి కలిగి ఉంటుంది. అట్టి బలమైన దానికన్నను బలిష్ఠుడు కనుక దేవునకు వాయువని పేరు.

'యోవాతి చరాచరం జగద్ధరతి (జీవయతి ప్రలయతి) బలినాం బలిష్ఠః స వాయుః'

83) విరాట్ - (వి+రాజృ-దీప్తౌ) వివిధ జగములను ప్రకాశింపచేయువాడు కనుక దేవునకు విరాట్ అని పేరు.

'యో వివిధం నామ చరాచరం జగత్ రాజయతి ప్రకాశయతి స విరాట్'

84) విశ్వుడు - (విశ - ప్రవేశనే) ఆకాశాది సర్వభూతాలు ఎవనిలో ప్రవేశించి ఉన్నాయో, ఎవరు వీటిలో వ్యాప్తుడై ప్రవేశించి ఉన్నాడో అతడు విశ్వుడు - దేవుడు.

'విశన్తి ప్రవిష్టాని (భవన్తి) సర్వాణ్యాకాశాదీని భూతాని యస్మిన్, యో వాఽ_
కాశాదీషు సర్వేషు భూతేషు ప్రవిష్టః స విశ్వః ఈశ్వరః'

85) విశ్వంభరుడు - (డు భృ ఞ్ - ధారణ పోషణయోః) జగత్తును ధరించి పోషించేవాడు కనుక దేవుడు విశ్వంభరుడు. (అథర్వ. 2-16-5).

'యో విశ్వం బిభర్తి ధరతి పుష్ణాతి వా స విశ్వంభరో జగదీశ్వరః'

86) విశ్వేశ్వరుడు - విశ్వమునంతటిని నియమించి నడిపించువాడు కనుక దేవుడు విశ్వేశ్వరుడు. (మైత్రోపనిషత్తు 5-14).

'యో విశ్వమీష్టే స విశ్వేశ్వరః'

87) విష్ణువు - (విష్లృ-వ్యాప్తౌ) చరాచర జగత్తులో అంతటా వ్యాపించి ఉంటాడు కనుక దేవునకు విష్ణువని పేరు.

'వేవేష్టి వ్యాప్నోతి చరాచరం జగత్ స విష్ణుః'

88) శక్తి - (శక్ - శక్తౌ) సర్వజగత్తును తానొక్కడే నిర్మించి నడుపగల శక్తిమంతుడు కనుక దేవునికి 'శక్తి' అని పేరు.

'యః సర్వం జగత్ కర్తుం శక్నోతి స శక్తిః'

89) శంకరుడు - (శం + డుకృఞ్ - కరణే) సుఖాలను, శుభాలను ఇచ్చేవాడు కనుక దేవునకు శంకరుడని పేరు.

'యః శం కల్యాణం సుఖం కరోతి స శంకరః'

90) శనైశ్చరుడు - (చర - తి భక్షణయోః) దేవుడు సహజముగా అన్నిటిలో ప్రవేశించి ఉంటాడు. అత్యంత ధైర్యశాలి కూడా. (నవగ్రహాలలోని శని కాదు).

'యః శనైశ్చరతి స శనైశ్చరః'

91) శివుడు - (శివు - కల్యాణే) కల్యాణ స్వరూపుడు, కల్యాణకరుడు గాన దేవునకు శివుడని పేరు. (యజుర్వేద 16వ అధ్యాయం – నమకం).

92) శుక్రుడు - (ఈ శుచిర్ – ప్రాతిభావే) దేవుడు అత్యంత పవిత్రుడు. అతనిని ఉపాసించే జీవులను కూడా పవిత్రం చేస్తాడు. కనుక అతనికి శుక్రుడని పేరు.

'యః శుచ్యతి శోచయతి వా స శుక్రః'

93) శుద్ధుడు - (శున్ధ - శుద్ధౌ) దేవుడు సదా శుద్ధుడు. తాను స్వయంగా పవిత్రుడై, సర్వ అశుద్ధులనుండి వేరుగా ఉంటూ తనను ఉపాసించేవారిని పవిత్రులను చేస్తూ ఉంటాడు కనుక దేవునకు శుద్ధుడను సార్థక నామం.

'యః శున్దతి సర్వాన్ శోధయతి వా స శుద్ధ ఈశ్వరః'

94) శేషుడు - (శిష్లృ - విశేషణే) పురుషసూక్తం ద్వారా పరమేశ్వరుడు తన విరాట్ స్వరూపాన్ని చక్కగా వర్ణించి చెప్పాడు. అందులోని ఒక మంత్ర మేమంటుందంటే –

"పాదోఽస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతం దివి॥"

– యజుర్వేదం 31-3

ఈ దృశ్యాదృశ్య బ్రహ్మాండాలన్నీ దేవునిలో ఏకపాదంగా (1/4 వంతుగా) ఉన్నాయి. మిగిలిన 3/4 భాగాలు అమృతలోకమే. అక్కడనే ముక్త పురుషులంతా దేవునినుండి ఆనందాన్ని, జ్ఞానాన్ని పొందుతూ స్వేచ్ఛగా విహరిస్తారు. ఈ అమృతలోకాన్నే వేదం **'శేషం'** అంటుంది. అంటే – అంతుబట్టని విశ్వాన్ని దేవుని పరిమాణంలో నుండి తీసివేస్తే మిగిలిన భాగాన్ని శేషం అంటుంది వేదం. ఇక్కడ శేషుడంటే – ఉత్పత్తి ప్రళయాలనుండి శేషించి ఉండేవాడు కనుక దేవునకు శేషుడని పేరు.

'యః శిష్యతే స శేషః'

95) శ్రీ - (శ్రీ౯ - ఞ - సేవాయామ్) విద్వాంసులచే, యోగులచే, మహాత్ములచే, సమస్త జగత్తుచే సేవింపబడువాడగుటచే దేవునకు శ్రీ యని పేరు.

'యః శ్రియతే సేవ్యతే సర్వేణ జగతా విద్వద్భిర్ యోగిభిః శ్చ స శ్రీరీశ్వరః'

సగుణ నిర్గుణ బ్రహ్మాల వివరణ

96) సగుణుడు - "యో గుణైః సహ వర్తతే స సగుణః" = గుణములతో కూడి ఉన్నవాడు సగుణుడని సామాన్యార్థం. ఏవైనా కొన్ని గుణములులేని పదార్థమే ఉండదు కదా లోకంలో! కనుక, ప్రతి పదార్థము కొన్ని గుణాలను కలిగి ఉంటుంది. కొన్ని గుణాలను కలిగి ఉండదు. అట్లే దేవునిలోనూ కొన్ని గుణాలు ఉంటాయి, కొన్ని గుణాలు ఉండవు. ఉదా : సర్వజ్ఞత, సర్వశక్తిమత్తత, పవిత్రత, ఆనందము మొదలైన అలౌకిక గుణాలు దేవునిలో అనేకం ఉన్నాయి. కనుక అతడు సగుణుడు. అతనిలో కామ క్రోధ లోభాది అరిషడ్వర్గాలు, పక్షపాతం, క్రూరత, స్వార్థ సంకుచిత భావాలు ఉండవు కనుక అతడు నిర్గుణుడు. నిర్గుణుడంట అతనిలో అసలు గుణాలు ఉండనే ఉండవనికాదు. సగుణుడంటే లోకంలోని మొత్తం గుణాలన్నీ ఉంటాయనియు కాదు.

సగుణుడంటే సాకారుడనీ, నిర్గుణుడంటే నిరాకారుడనీ కొందరనుకుంటారు. అది వారి అజ్ఞానం. దేవునికి ఆకారం ధరించి అవతరించవలసిన అవసరమేముంది? దుష్టులకు రోగాలను, బాధలను కలిగించి చంపగలడు కదా! అవతరించి జన్మ జనా మృత్యువాది అవస్థలు పడటమెందుకు?

97) సచ్చిదానందుడు - సత్ + చిత్ = ఆనందము కలిసి = సచ్చిదానందము అవుతుంది. ఈ మూడింటిని కలిపి చెప్పినపుడు అది కేవలం పరమేశ్వరునికే వర్తిస్తుంది. ఎందుచేతనంటే – సత్ అంటే ఉనికి (Existence) గలది. అంటే త్రికాలాలలోనూ (భూత వర్తమాన భవిష్యత్‌లలోనూ) ఎప్పటికీ ఉండేది. అట్టివి ఈ లోకంలో 3 పదార్థాలున్నాయి. 1. సృష్టికి మూలపదార్థాలైన పరమాణువులు. ఈ పరమాణువులు 3 రకాలుగా ఉంటాయి. అవి – సత్త్వము, రజస్సు, తమస్సు. వీటిని ఆధునిక వైజ్ఞానిక భాషలో ప్రోటాన్, ఎలక్ట్రాన్, న్యూట్రాన్ లని అంటారు.

2. నేను, నేను అనుకుంటూ వ్యవహరించే జీవాత్మలు. ఇవి అనేకం ఉంటాయి. ప్రతీ ప్రాణిలోను ఒక జీవాత్మ ఉంటుంది. అవి వేరువేరు కదా! కనుక అనేకం.

3. పరమాణువులతో ఒకప్పుడు ప్రపంచంగాను, కాలాంతరంలో ప్రలయంగాను చేసే సర్వవ్యాపకమైన మహత్తరశక్తి ఒకటి ఉంది. అది సర్వజ్ఞము,

సర్వశక్తివంతమునైన చేతన పదార్థం – జ్ఞానవంతమైన పదార్థం. కనుక మన వేదశాస్త్రాలు దానిని దేవుడు అన్నాయి. ఈ శక్తులేకాక దేవునిలో 'ఆనందము' అనే అత్యద్భుతమైన గుణం ఉంది. అంటే – తెంపులేని అనిర్వచనీయమైన సుఖం. దానిని భగవద్గీత (6–21), **"సుఖమాత్యంతికం యత్తత్ బుద్ధి గ్రాహ్యామ్ + అతీంద్రియం" =** అది ఇంద్రియాతీత ఆత్యంతిక సుఖం. దానిని పరిపూర్ణయోగి తన బుద్ధితో గ్రహించగలుగుతాడే కాని మాటలతో వర్ణించలేడు. ఈ లోకసుఖాలతో పోల్చలేడు అంటుంది. సచ్చిదానందాలను వేదం **"భూర్భువఃస్వః"** అంటుంది. ఇది గాయత్రీ మంత్రంలోని మొదటి పదములుగా ఉంటాయి. ఆ పద సముచ్ఛయం అక్కడ కేవలం సర్వవ్యాపక సర్వేశ్వరుని మాత్రమే సూచిస్తుంది.

98) సత్ స్వరూపుడు - (అస - భువి) పూర్వపదంలో చెప్పుకొన్నట్లుగా సత్ అంటే ఉనికి (Existence) కలవాడు. అయితే ప్రకృతి కన్నా జీవులకన్న విశేషంగా దేవుడు త్రికాలలోను ఏకరసుడై ఉంటాడు. ప్రకృతి పరిణామం చెందుతూ ఉ ంటుంది. జీవులు ఒకప్పుడు ప్రకృతి బద్ధులై జనన మరణాలు పొందుతూ జైలులో ఉన్నట్లుంటారు. మరొకప్పుడు యోగసాధనలు చేసి ముక్తులౌతూ ఉంటారు. ఆనందమగ్నులౌతూ ఉంటారు. కనుక సత్ నామమునకు దేవుని పరంగా ఋషులు ఈ విధంగా నిర్వచనం చెప్పారు.

"యదస్తి త్రిషు కాలేషు న బాధ్యతే తస్మాద్ బ్రహ్మ" అన్నారు. దేవుడు త్రికాలలోను ఏ మార్పు చెందకుండా ఉంటాడు. కనుక అతడు బ్రహ్మము సత్.

99) సత్యము - (సన్తీతి సన్తః, తేషు సత్సు సాధు తత్ + సత్యమ్) ఉనికిగల పదార్థాలను 'సత్' అంటారు. వాటిలో (పై మూటిలో) సాధు (గొప్పవాడు) కనుక దేవుని మరియొక నామము 'సత్యం'. (ఇక్కడ నిజమైన మాటలనికాదు).

100) సరస్వతి - (సృ - గతౌ) సరస్వతీ పదము గత్యర్థక సృ ధాతువుతో తయారౌతుంది. పూర్వం చెప్పుకొన్నట్లుగా 'గతి'లో జ్ఞాన గమన ప్రాప్తులు కలిసి ఉన్నాయి. అందులో జ్ఞానం ముఖ్యమైనది. అట్టి జ్ఞానాన్ని అనంతంగా కలిగి ఉన్నాడు కనుక అతనికి సరస్వతి యని మరొక పేరు. అది తెలుపటానికి ఋషులు **"సరో వివిధం జ్ఞానం విద్యతే యస్యాం చితౌ సా సరస్వతీ"** అని నిర్వచించారు. అంటే – "శబ్దార్థ సంబంధాన్ని యథావత్తుగా – ఉన్నది ఉన్నట్లుగా మాటలలో

చెప్పగల అద్భుత జ్ఞాని" అని అర్థం వస్తుంది. సామాన్య విద్వాంసులకు శబ్దము, దాని అర్థము, పదార్థానికి దాని నామమునకు గల సంబంధము కొంతవరకే తెలుస్తాయి. పూర్ణంగా తెలియవు. కాని, దేవుడు అవన్నీ పూర్ణంగా తెలిసినవాడు. కనుక అతని కావ్యమైన వేదంలో నిరర్థక పదము ఒక్కటి కూడా ఉండదు. కనుక తొందరపడి వేదంలో తప్పులు వెదుక ప్రయత్నించవద్దు. అర్థం చేసుకునే ప్రయత్నం చెయ్యాలి. అంతర్ముఖులై అర్థం తెలుపమని అంతరాత్మను ప్రార్థించాలి.

101) సర్వశక్తిమంతుడు - "సర్వా శక్తయో విద్యన్తే యస్మిన్ స సర్వశక్తిమాన్ ఈశ్వరః = తన కార్యాలైన సృష్టి స్థితి ప్రలయాలను చేయటంలోను, కోటానుకోట్ల జీవులు మనోవాక్కాయాలతో చేసే కర్మలకు అత్యంత న్యాయంగా ఫలాలనిచ్చి – అందుకు తగిన శరీరాలను నిర్మించటంలోను వేరొకరి సహాయ సహకారాలు దేవునకు అవసరంలేదు. కనుక అతడు సర్వశక్తిమంతు"డని ఋషులు నిర్వచనం చెప్పారు.

కొందరు ఈ పదమును పొరపాటుగా అర్థం చేసుకుంటారు. లోకంలో ఇన్ని ఘోరాలు, నేరాలు, కుంభకోణాలు, ఖూనీలు, అత్యాచారాలు జరుగుతూ ఉంటే దేవుడు చూస్తూ కూడా ఎందుకు నివారించలేకపోతున్నాడంటారు. కొందరైతే మాకు దేవుని ఉనికిపైనే నమ్మకం పోతున్నదంటారు. దేవుడు అకృత్యాలు చేసేవాని చెయ్యి పట్టుకుని ఆపడు. అంతర్యామిగా ఉండి హెచ్చరిస్తూ ఉంటాడు. వినకపోతే ఆ పాపాలకు తగిన ఫలాలను, శిక్షలను – క్రిమి కీటకాది జన్మలను, కష్టాలను, బాధలను కలిగిస్తాడు. అన్యాయానికి గురియైన వారికి కాలాంతరంలో లేదా జన్మాంతరంలో తగిన సుఖాలను ప్రసాదిస్తాడు. దేవుడు అత్యంత న్యాయకారి.

102) సవిత - (షుఞ్ – అభిషవే, షూఙ్ – ప్రాణిగర్భ విమోచనే) ఈ రెండు ధాతువులతోను సవితా పదము తయారు చేయవచ్చు. అభిషవం అంటే – యజ్ఞానంతర స్నానం అనీ సోమలతనుండి రసం తీయటం అని రెండర్థాలు చెబుతారు విద్వాంసులు. ఇక్కడ దేవుని పరంగా పరమాణువులనుండి స్థూలసృష్టిని చేయువాడని అర్థం వస్తుంది. 'ప్రాణి గర్భవిమోచనం అంటే ప్రాణుల ప్రసవక్రియ. సృష్టికి పూర్వం విశ్వమంతా ఒక ముద్దగా దేవుని గర్భంలో ఉండేదట. దానినే వేదం **"హిరణ్యగర్భః సమవర్తత + అగ్రే భూతస్య జాతః పతిర్ + ఏకః + ఆసీత్"** – యజుర్వేదం (13-4) అంటుంది. అంటే "సృష్టికి పూర్వం దేవుడు

హిరణ్యగర్భుడుగా ఉండి జగత్‌లోని పంచభూతాలను, ప్రాణులను ప్రసవించాడు. అతడు ఒకే ఒక్కడు" అని అర్థం. హిరణ్యం అంటే లోకభాషలో బంగారం. కాని, వైదిక భాషలో **"హిరణ్యం వై జ్యోతిః"** (శతపథ బ్రాహ్మణం). హిరణ్యం అంటే ప్రకాశించే సూర్యనక్షత్రాదులని అర్థం. కనుక ఇక్కడ సవితా పదమునకు జగదుత్పాదకుడని అర్థం వస్తుంది. పెక్కు వేదమంత్రాలలో సవితా పదము దేవుని పరంగా చెప్పబడింది.

ఇంతేగాక, 'షూ - ప్రేరణే' అనే ధాతువుతో కూడా సవితా పదం నిర్మించవచ్చునంటారు. కనుక, దేవుడు జీవులమైన మనకు అంతర్యామిగా ఉండి ప్రేరణ కలిగిస్తున్నాడు. కనుక సవితా పదమునకు ప్రేరకుడని కూడా అర్థం చెప్పవచ్చును. అతడు మనలో అంతర్యామిగా ఉండి సత్కర్మలు చేస్తుంటే ధైర్యం, ఉత్సాహం, ఆనందం కలిగిస్తూ ఉంటాడు. చెడు కర్మలు చేస్తుంటే శంక, భయం కలిగిస్తాడు.

లోకంలో చాలామంది పౌరాణికులలో సవిత అంటే ఆకాశంలో కనబడే సూర్యుడనే భావం ఉంది. గాయత్రీ మంత్రంలోని సవిత పదమును కూడా అట్లే అర్థం చేసుకొని గాయత్రీ మంత్రంతో సూర్యునికి అర్ఘ్యం (జలం) అర్పిస్తూ ఉంటారు. కాని, ఇది సరికాదు. భౌతిక సూర్యునిలో ప్రేరణ చేసే కొన్ని గుణాలున్నాయి. అట్లని ప్రార్థనా మంత్రాలలో సవిత అంటే సూర్యుడనుకోవటం పొరబాటే. ఎక్కడైనా సూర్య విజ్ఞానాన్ని తెలిపే మంత్రాలతో సవిత పదం వస్తే అక్కడ సూర్యపరంగా అర్థం చెప్పుకోవచ్చు.

'యః చరాచరం జగత్ సునోతి సూతేనోత్పాదయతి స సవితా పరమేశ్వరః'

103) సుపర్ణుడు - సుపర్ణుడంటే మంచి రెక్కలు గలవాడని సామాన్య అర్థం. అయితే, రెక్కలు దేవునికి, జీవునకు ఉండవు కదా! అందుకని ఇక్కడ జ్ఞానము, కర్మ (ప్రయత్నం) అనే రెండు రెక్కలుగా అర్థం చెప్పుకుంటే సమంజసంగా ఉంటుంది. ఇక్కడ పరిపూర్ణమైన జ్ఞానం, అనంతమైన సృష్టికార్యం అనే రెండు రెక్కలు గలవాడు దేవుడు అని అర్థం చేసుకోవాలి. (జీవుని గురించి సుపర్ణ పదము వచ్చినపుడు స్వల్పజ్ఞానం, స్వల్ప కర్మ రెక్కలుగా కలవాడని అర్థం చేసుకోవాలి.)

'శోభనాని పర్ణాని పాలనాని పూర్ణాని కర్మాణి వా యస్య స సుపర్ణః'

104) సూర్యుడు - (సృ - గతౌ) సూర్యః సర్తేర్వా, సువతేర్వా, స్వీయతేర్వా

(నిరుక్తం 12-14) సూర్యుడంటే ప్రకాశ స్వరూపుడు. **"సూర్య ఆత్మా జగతస్థుషశ్చ"** - యజుర్వేదం (7-42). స్థావర జంగమ ప్రాణులన్నిటిలో ఆత్మ సూర్యునిగా - అంతరాత్మగా దేవుడున్నాడు. ఇంతేగాక, స్వయం ప్రకాశకాలైన సూర్య నక్షత్రాదులకును ప్రకాశమునిచ్చు ఆధార సూర్యుడు దేవుడు (అథర్వ. 13-2-19).

105) స్వయంభువుడు - (భూ - సత్తాయామ్) అతని ఉనికికి మరొక కారణం లేదు కనుక దేవుడు స్వయంభువుడు. అంటే - దేవుడు ఎవరివలన పుట్టలేదు. తనంత తానుగా ఉన్నవాడు.

'యః స్వయం భవతి స స్వయం భూరీశ్వరః'

106) స్వరాట్ - (యః స్వయం రాజతే స విరాట్) దేవుడు స్వయం ప్రకాశకుడు. లోకంలో సూర్య నక్షత్రాలను స్వయం ప్రకాశకాలని చెప్పుకుంటూ ఉంటాము. కాని, వాటిలోని ప్రకాశానికి కారణం హైడ్రోజన్ హీలియంగా మార్పు చెందుతూ ఉండటం వల్ల పెద్ద పెద్ద మంటలు లేస్తూ ఉన్నాయి. అందుచే సూర్యుడు స్వయం ప్రకాశకుడనుకుంటాము. అప్పుడప్పుడు సూర్యునిలో అక్కడక్కడ ఈ న్యూక్లియర్ ఫ్యూజన్‌క్రియ స్వల్పంగా జరుగుతుందట. అవి వైజ్ఞానికులకు మచ్చలుగా కనబడుతున్నాయట. వీటికి వారు సన్ స్పాట్స్ (Sun Spots) అని పేరు పెట్టారు. ఆ సూర్యుని మచ్చలకు భూవాతావరణానికి సంబంధముందట. తుఫానులు, అతివృష్టి అనావృష్టులకు సన్‌స్పాట్స్ కారణమని కొందరు వైజ్ఞానికులంటున్నారు. కాని, దేవుని ప్రకాశంలో ఇట్టి లోపాలేమీ ఉండవు. అతడు స్వరాట్ - నిజమైన స్వయం ప్రకాశకుడు.

107) హిరణ్యగర్భుడు - పూర్వం 102వ నామము 'సవిత'లో వివరించినట్లు హిరణ్యగర్భుడంటే - సూర్య నక్షత్రాది ప్రకాశక గోళాలను తన గర్భంలో కలవాడని అర్థం వస్తుంది. **"హిరణ్యం వై జ్యోతిః"** (శతపథ బ్రాహ్మణం) అని ఋషుల వివరణ. ఇది తెలియని వేద భాష్యకారులు - "హిరణ్యం అంటే బంగారం కదా! బంగారాన్ని కనిపెట్టిన తరువాతనే వేదాలు వ్రాయబడ్డా"యని వ్యాఖ్యానించారు. మహర్షి దయానందుల వారు పై ఋషుల వాక్యాలను వెలుగులోనికి తెచ్చేవరకు వారి అజ్ఞానం పోలేదు. మహర్షి భాష్యం చదివిన వివేకవంతులు మాక్స్‌మూలర్ మొదలగువారు తమ తప్పిదాన్ని తెలుసుకొని సవరించుకున్నారు. వేదాలు సృష్ట్యాదిలోనే ప్రకాశింపబడ్డాయని అంగీకరించారు.

'యో హిరణ్యానాం సూర్యాదీనాం తేజసాం గర్భ ఉత్పత్తి నిమిత్త మధికరణం స హిరణ్యగర్భః'

108) హోతా - "(హు - దాన + అదనయోః ఆదానే చ)" అనే ధాతువుతో హోత్ర పదము తయారౌతుంది. అగ్నిహోత్రం మనం వేసే ఆహుతిని ఆదానం = స్వీకరిస్తుంది. అదనం = తిని జీర్ణం చేసుకుంటుంది. ఆ సారాన్ని – అణువులను తిరిగి దానం చేస్తుంది. గాలిలో కలిపివేస్తుంది. కనుక అది హోత్రం. అట్టి అగ్నిహోత్రంలో **"యః జుహోతి స హోతాః =** ఆహుతి ఇచ్చేవాడు హోత అవుతాడు. మనం ఇక్కడ దేవుని పరంగా అర్థం చెప్పుకుంటే – సృష్టికార్యం అనే యజ్ఞంలో పరమేశ్వరుడు మూల ప్రకృతిని ఆహుతిగా అర్పిస్తూ సృష్టికార్యాలను ముఖ్యంగా జీవులకొరకు వారి మేలుకొరకు చేస్తున్నాడు. సృష్టిరూప యజ్ఞంలో దేవుడు హోత. జీవులు ప్రయోజనం పొందేవారు. ఇంతేగాక, జీవులకు దేవుడు స్వీకరించతగిన కోరతగిన ఆప్తుడు, ఆనంద స్వరూపుడు కనుక అతడు హోత. కర్మ ఫలాల దాత.

పై అష్టోత్తర శత (108) నామములను మహర్షి దయానందుల వారు తమ జగత్ప్రసిద్ధ సత్యార్థ ప్రకాశంలో సంస్కృత నిర్వచనాలతోను, సంక్షిప్త హిందీ వివరణతోను ప్రథమ సముల్లాసంలో తెలిపారు. వాటి ఆధారంతోనే తెలుగువారికి అర్థం కావటానికి కొద్ది వివరణతో మేము ఇంతవరకు వ్రాశాము. నాలుగు వేదాలలోను దేవుని నామములు మరెన్నో ఉన్నాయి. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని చివరలో అనుబంధంగా చేర్చే ప్రయత్నం చేస్తాము.

ముఖ్యంగా వేదాలు దేవుడు ఒకే ఒక్కడంటాయి. పొరబడకుండా ఉండేందుకు అథర్వవేదం 13-4-16, 17, 18 మంత్రాలలో **'న ద్వితీయో న తృతీయోశ్చతుర్థో నా పృచ్యతే....... య ఏతం దేవమేకవృతం వేద ॥'** = సృష్టి స్థితి లయకర్త ఒకే ఒక్కడు. ఇద్దరుగాని, ముగ్గురుగాని, నలుగురుగాని లేనేలేరు. అతడు ఒకే ఒక్కడు అంటుంది. మతానికి ఒక దేవుణ్ణి, సంప్రదాయానికి ఒక దేవుణ్ణి చేసుకొని రాగద్వేషాలను, వైషమ్యాలను పెంచుకోవటం మంచిదికాదు. మీ దేవునికన్న మా దేవుడు గొప్ప అనుకోవటం కూడా పొరబాటే. మన శరీరాలన్నీ ఒకే కర్మాగారంలో తయారైనట్లు శరీర నిర్మాణ శాస్త్రం Anatomy, శరీర ధర్మశాస్త్రం Physiology చెబుతున్నాయి కదా! ఇంతకన్న పెద్ద సాక్ష్యం ఏది? మీరంతా బుద్ధిమంతులే కదా! ఆలోచించండి.

పరమేశ్వర స్తుతి ప్రార్థనోపాసనలు ఎందుకు? ఎలా చేయాలి?

మనకు ఉత్తమమైన మానవజన్మ నిచ్చి, వికసించిన ఇంద్రియాలను, వాటితో భోగించుటకు సృష్టిలో శబ్ద స్పర్శ రూప రసాది విషయాలను సృష్టించిన దేవునకు కృతజ్ఞతలు తెలుపటం ప్రతీ మానవుని కనీస కర్తవ్యం. లేకుంటే - మనం కృతఘ్నులమౌతాము. చేసిన, చేస్తున్న మేలును మరచిన పాపాత్ములమౌతాము. అయితే వాటిని మనం జ్ఞానపూర్వకంగా చెయ్యాలి. మూఢ నమ్మకాలతో కాదు.

స్తుతి : స్తుతించటమంటే దేవుని గుణగణాలను ఉన్నది ఉన్నట్లుగా తెలుసుకొని కీర్తించటం. అందువల్ల మనకు దేవుని యథార్థ స్వరూపం అవగతమై మనకు అతనిపై భక్తిశ్రద్ధలు కలుగుతాయి. దానితో మనం అతనికి చేరువవుతాము. ఎంతగా మనకు దేవుని గుణగణాలు, దివ్యశక్తులు తెలుస్తాయో అంతగా మన భక్తి బలపడుతుంది. అందుచేతనే ఈ పుస్తకంలో దేవుని 100కు పైగా యథార్థ గుణాలను వివరించి వ్రాయటం జరిగింది.

సగుణస్తుతి, నిర్గుణస్తుతి యని స్తుతి రెండు రకాలుగా ఉంటుంది. ఎట్లంటే-

“స బ్రహ్మా, స విష్ణుః, స రుద్రః, స్సశివస్సోఽక్షర స్స పరమః స్వరాట్ । స ఇంద్ర స్స కాలాగ్ని స్స చంద్రమాః....” అని కీర్తించటం సగుణ స్తుతి - దేవుడు ఏఏ గుణాలు కలిగి ఉంటాడో వాటిని కీర్తించటం అన్నమాట.

స పర్యగాత్ శుక్ర మకాయ మవ్రణ మశ్నావిరం శుద్ధమపాప విద్ధం..... (40-1)” అని గాని, “అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం తథారసం నిత్య మగంధవ చ్ఛ యత్” (కఠోపనిషత్తు 3-15) అనిగాని స్తుతించటం నిర్గుణ స్తుతి. దేవుడు ఏఏ గుణాలు కలిగి ఉంటాడో వాటిని కీర్తించటం సగుణ స్తుతి అన్నమాట. ఈ రెండూ అవసరమే.

ప్రార్థన : మనం చేయగలిగినంత ఎక్కువగా ప్రయత్నం చేస్తూ దానికి పరమేశ్వరానుగ్రహం కూడా అవసరం కనుక హృదయపూర్వకంగా అంతర్యామిని ప్రార్థించాలి. ఏదైనా కార్యం ఫలిస్తే గర్వపడకూడదు. దేవుని దయగా భావించాలి.

ఉపాసన : పైన వివరించిన స్తుతి ప్రార్థనలను మనం అంతర్ముఖులమై మనలో

అంతర్యామిగా, అతిసమీపంగాఉన్న పరమేశ్వరునకు వినిపించటమే ఉపాసన. ఎంత అంతర్ముఖులమైతే అంత ఆనందం కలుగుతుంది. వివరంగా తెలుసుకోగోరువారు సత్యార్థ ప్రకాశం సప్తమ సముల్లాసంలో చూడండి.

మంగళాచరణం – శాంతిపాఠం

ఆధ్యాత్మిక గ్రంథాలు వ్రాసిన మన ప్రాచీన ఋషులంతా 'ఓం' అని గానీ 'అథ' అని గానీ ముందు వ్రాసి గ్రంథాన్ని ప్రారంభించేవారు. అథ పదము అధికారార్థాన్ని (యోగ్యతను) సూచిస్తుంది.

ఉదా: ఓమిత్యేత దక్షర ముద్గీథ ముపాసీత (ఛాందోగ్యోపనిషత్)

ఓమిత్యేత దక్షర మిదం సర్వం తస్యోపవ్యాఖ్యానమ్ (మాండూక్యోపనిషత్)

అథాతో ధర్మం వ్యాఖ్యాస్యామః (వైశేషిక దర్శనం)

అథాతో ధర్మ జిజ్ఞాసా (పూర్వమీమాంసా దర్శనం)

అథాతో బ్రహ్మ జిజ్ఞాసా (వేదాంత దర్శనం)

అథ యోగానుశాసనమ్ (యోగదర్శనం)

అథ త్రివిధ దుఃఖాత్యంత నివృత్తిరత్యంత పురుషార్థః (వైశేషిక దర్శనం)

ఈశ్వరీయమైన వేదం కూడా –

ఓం అగ్ని మీళే పురోహితం .... (ఋగ్వేదం)

ఓం ఇషేత్వోర్జేత్వా .... (యజుర్వేదం)

ఓం అగ్న ఆయాహి వీతయే .... (సామవేదం)

ఓం యే త్రిషప్తాః .... (అథర్వవేదం) అంటూ ప్రారంభింపబడ్డాయి.

అట్టి పరంపర ఇప్పుడు కల్పిత దేవీ దేవతల నామములతో ప్రారంభింపబడుతోంది. శ్రీగణేశాయ నమః, సీతారామాభ్యాం నమః, హనుమతే నమః, రాధాకృష్ణాభ్యాం నమః మొదలగు మంగళాచరణాలతో ప్రార్థింపబడుతున్నాయి. "హరిః ఓం" కూడా మధ్యకాలీన కల్పితమే. కాబట్టి గ్రంథ ప్రారంభంలో ఓం అని కాని, అథ అని కాని వ్రాయటం ఉత్తమం. దానితోబాటు ఒక ప్రార్థనతో కూడిన వేదమంత్రం వ్రాయవచ్చు.

శాంతిపాఠం

గ్రంథాన్ని ముగించేటప్పుడు "ఓం శాంతిః శాంతిః శాంతిః" అంటూ ముగించటం ఉత్తమం. మానవులకు కలిగే అనేక కష్టాలను 3 వర్గాలుగా చేసి వ్యవహరించారు మన ప్రాచీన ఋషులు. ఆధ్యాత్మిక, ఆధిభౌతిక, ఆధిదైవిక దుఃఖాలన్నీ శాంతించాలని – ఉపశమించాలని దీని భావం.

ఆధ్యాత్మిక దుఃఖాలంటే – శారీరకమైన రోగాదులు, మానసికమైన అవిద్యా రాగద్వేషాలు, అనేక రకములైన చింతలు, భయాలు, అనుమానాలు.

ఆధిభౌతిక దుఃఖాలు – ఇతర ప్రాణులవల్ల కలిగే దుఃఖాలను ఆధిభౌతిక దుఃఖాలంటారు. శత్రువులవల్లగాని, మనపై ద్వేషంతో మనను ఇబ్బందులలో పడవేసే వారివల్ల గాని తేలు, పాము, కుక్కలు మొదలగు ప్రాణులవల్లగాని వచ్చే దుఃఖాలు.

ఆధిదైవిక దుఃఖాలు – అతివృష్టి, అనావృష్టి, ఎక్కువ శీత ఆతపాలు, వరదలు, భూకంపాలు మొదలగు వానివల్ల కలిగే దుఃఖాలు.

ఇవన్నీ శాంతించాలని శాంతిపాఠ భావం. ఇంతేకాని, శ్రీరామార్పణమస్తు, శ్రీకృష్ణార్పణమస్తు అని ముగించటం అంత సమంజసం కాదు. ఆ చారిత్రక పురుషులు కర్మయోగులు, తపస్వులు, ధర్మమూర్తులు కనుక వారు ముక్తి పొంది ఉంటారు. వారికి మనమెట్లు అర్పించగలం?

ఉపసంహారము (Conclusion)

ప్రియ పాఠకులారా!

మీరింతవరకు దేవుడు ఒకే ఒక్కడనీ, అతనికే అనేకానేక నామములనీ (పేర్లనీ) హేతుబద్ధంగా, శాస్త్రబద్ధంగా, వైజ్ఞానికంగా తెలుసుకున్నారు. అతడు సర్వవ్యాపకుడనీ, సర్వశక్తిమంతుడనీ ఇతరుల సహాయం లేకుండా తానొక్కడే సృష్టి స్థితి ప్రళయాలు మూడింటినీ చేస్తున్నాడనీ తెలుసుకున్నారు. దేవుడు అత్యంత న్యాయకారియనీ, కోటానుకోట్ల జీవులకు వారు పూర్వ మానవ జన్మలలో చేసిన అనేకానేక మనోవాక్కాయ కర్మలకు సరియైన ఫలితాలనిస్తున్నాడనీ తెలుసుకున్నారు, మంగళాచరణం (గ్రంథారంభం), శాంతిపాఠం (ముగింపు) ఎలా ఉండాలో కూడా సంక్షిప్తంగా తెలపటం జరిగింది.

దయచేసి ఈ విషయాలు మీ బుద్ధితో మననం చేసి మీకు సత్యమనిపించిన వాటిని స్వీకరించండిం. లేకున్న ప్రక్కకు పెట్టండి. మేము వ్రాసినవి మాత్రం శాశ్వత సత్యాలు. ఋతాలు (సృష్టి నియమాలు). మతానికి ఒక దేవుడు, సంప్రదాయానికి ఒక దేవుడు, వర్గానికి ఒక దేవుడు ఉండరు. మతాల పేరుతో, సంప్రదాయాల పేరుతో, వర్గాల పేరుతో ఒకరిని ఒకరు ద్వేషించుకుంటూ మా దేవుడే గొప్ప అనుకోవటం ఎంతమాత్రం మంచిదికాదు. మనమందరం ఒకే దేవుని బిడ్డలం.

"అజ్యేష్ఠాసో అకనిష్ఠాస ఏతే సంభ్రాతరో వావృధుః సౌభగాయ । = ఓ మానవులారా! మీలో ఒకరు ఎక్కువగాని, ఒకరు తక్కువగాని కారు. మీరంతా పరస్పరం సోదరులు. కనుక, అందరు కలిసిమెలిసి సౌభాగ్యాలను-అభ్యుదయ నిశ్శ్రేయసాలను పొంద యత్నించండి" అంటుంది ఋగ్వేదం (5-60-5). కనుక, వేదమార్గాన్ని అనుసరిద్దాం రండి.

"ఏకం సత్ విప్రా బహుధా వదన్తి"

సబ్‌కా మాతా పితా ఏక్ హై ।

మనందరికీ తల్లీ తండ్రీ ఆ పరమేశ్వరుడే

God is one, God is one, God is one for everyone

God is here, God is there, God is every where

"లోకాః సమస్తాః సుఖినో భవంతు"

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః.

అనుబంధము (Appendex)

దేవుని అనేక నామములలో మరికొన్ని

1. అంగ : అంగము అంటే శరీరంలోని ఒక భాగము. చాలా ప్రియమైన వాటిని కూడా అంగము అనవచ్చు. "అతడు నా కుడిభుజం వంటివాడు" అని లోకంలో ప్రయోగం ఉంది కదా! వేదాలలో అక్కడక్కడ దేవుని "ఓ అంగ!" అనే నామముతో పిలిచినట్లు ప్రయోగింపబడింది (ఋ. 1-1-6).

2. అంగిరుడు : ప్రాణప్రియః జగదీశ్వరః (యజు. 3-3).

3. పురుహూతుడు : బహు విద్వాంసులచే పూజింపబడువాడు! (యజు. 18-69). పురుప్రియ = బహు విద్వాంసులకు ప్రియమైనవాడు (యజు. 15-31).

4. స్కంభమ్ : స్తంభమని సామాన్యార్థం. వేదాలలో కొన్నిచోట్ల దేవుడు స్తంభమువలె జగదాధారుడనీ, సర్వజగద్ధారక పరమేశ్వరా! అనీ ప్రయోగాలున్నాయి. అథర్వవేదం 10-7, 8 సూక్తాలలో చాలా మంత్రాలలో ఈ పదము వస్తుంది.

5. శతక్రతువు : శతమంటే 100 అని అర్థం. కాని, నిఘంటువులో బహు నామములలో (అనేకం అనే అర్థం గలవి) 12 ఉన్నాయి. అవి ఏవంటే - ఉరు, తువి, పురు, భూరి, శశ్వత్, విశ్వమ్, పరీణసా, వ్యానశిః, శతమ్, సహస్రమ్, సలిలమ్, కువిత్.

కనుక, శతక్రతుః అంటే అనేక కర్మలు చేయువాడు (క్రతురితి కర్మనామ) - పరమేశ్వరుడనే అర్థంలో ప్రయోగింపబడింది.

6. జాతవేదుడు : పుట్టిన పదార్థాల నన్నిటిని ఎరుగువాడని సామాన్యార్థం. ఈ పదం అగ్నిహోత్ర కార్యంలో సామాన్యాగ్నికి - యజ్ఞాగ్నికి వర్తిస్తుంది.

ప్రార్థనా మంత్రాలలో దేవునికి వర్తిస్తుంది. సామాన్యాగ్ని మనకు కొన్ని వస్తువులను మాత్రమే చూపగలుగుతుంది. కాని, దేవుడు సంపూర్ణ విశ్వంలోని పదార్థాలన్నిటిలో వ్యాపించి ఉన్నాడు కదా! కనుక, దేవుడే నిజమైన - పూర్ణమైన జాతవేదుడు. (యజు. 12-16).

7. సుమృడీకుడు : శ్రేష్ఠ సుఖములనిచ్చు దేవుడు (యజు. 20-51).

8. సుప్రకరస్నుడు : సర్వత్రా వ్యాపక కరములు గలవాడు (ఋ. 8-32-10).

9. ప్రియస్తోత్రుడు : స్తుతించ తగిన ప్రియుడు. (ఋ. 1-11-9).

10. వనస్పతి : భక్తుల పాలకుడు (ఋ. 1-11-9).

11. సుక్షత్రుడు : మంచి రక్షకుడు (ఋ. 7-89-4).

12. సమహ : తేజోమయ ప్రభువు (ఋ. 7-89-3).

13. యజిష్ఠుడు : పూజనీయ ప్రభువు (ఋ. 5-14-2).

14. విచర్షణుడు : విశేషద్రష్ట, సర్వశక్తిమంతుడు (ఋ. 9-45-19).

15. వృషక్రతుః : గొప్ప బుద్ధి కలవాడు (ఋ. 6-45-19).

16. దస్మ : పాపనాశక ప్రభువు (ఋ. 1-4-6).

17. అచర కృషత్‌డు : ఆకర్షించేవాడు (సా. పూర్వార్థం 3-11-3).

18. ప్రచేతసుడు : మిక్కిలి జ్ఞానవంతుడు (ఋ. 3-1-4-2).

19. అభ్రాతృవ్యుడు : శత్రురహితుడు (ఋ. 8-21-13).

20. అనాపిః : సంసారమోహరహితుడు (ఋ. 8-21-13).

21. అశ్విన్ : (అశూజ్ - వ్యాప్తౌ) వ్యాపకగుణం కలిగి ఉండే రెండు జంట శక్తులను 'అశ్విన్' అని ద్వివచనంలో చెబుతారు. ఈ పదమే వేదాలలో 'అశ్వినా'గా ప్రయోగింపబడింది. ఈ పదము వినగానే అశ్వనీ దేవతలనబడే వైద్య దేవతలని (Doctors అని) పెక్కురనుకుంటారు. అదియును ఆది భౌతికార్థంలో (ప్రాణుల పరంగా) సరిగానే ఉంది. ప్రాచీనకాలంలో వైద్యులు ఔషధీవైద్యం + శస్త్రచికిత్స రెండూ తెలిసినవారై ఉండేవారు. మందులతో సాధ్యపడని వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేసేవారు. నేటి భాషలో Physicians and Surgeons అని చెప్పవచ్చు. వేదాలు వైద్యులనేకాక గురుశిష్యులను, అధ్యాపక ఉపదేశకులను, తల్లిదండ్రులను కూడా అశ్విన్ అని పేర్కొంటాయి. వీరు కూడా మనను మంచి ఆదర్శమార్గంలో నడుపుతూ సామాజిక రుగ్మతలు, దుర్వ్యసనాలు అంటకుండా కాపాడుతూ ఉంటారు కదా!

వారి బోధనలు వారితోనే పరిమితంకాక తరతరాలలో వ్యాపిస్తూ ఉంటాయి కనుక అట్టివారిని కూడా అశ్వనీ దేవతలంటాయి వేదాలు. ఆదిదైవికార్థంలో (జడ

దేవతల పరంగా) సూర్యచంద్రులను, భూలోక ద్యులోకాలను, రాత్రీ పగలును, శీతోష్ణాలను అశ్వినులుగా వేదం అక్కడక్కడ పేర్కొంటుంది. వాటి దివ్యశక్తులు కూడా వ్యాపకగుణం కలిగి ఉంటాయట. అందుకని అవి కూడా అశ్వనీ దేవతలే. వివరంగా తెలుసుకోగోరువారు నా రచన "వేదాలలో అశ్వనీ దేవత"లలో చూడగోరుచున్నాను.

ఇక మనం అశ్వినా పదము దేవునకు ఎట్లు వర్తిస్తుందో తెలుసుకుందాము. సృష్టి ప్రళయాలు రెంటిని చేయగల ఏకేశ్వరుడు కనుకను, లోకాలోక శక్తులు రెంటినీ కలిగినవాడగుటచేతను వేదాలలో అక్కడక్కడ దేవుని అశ్వినా నామంతో పేర్కొనబడింది.

ఉదా: **ప్రాతరగ్నిం ప్రాతరిన్ద్రం హవామహే, ప్రాతర్మిత్రా వరుణా ప్రాతరశ్వినా ।** (ఋ. 7-41-4), (యజు. 34-34), అథర్వ (3-16-1) పరమేశ్వరార్థంగా చెప్పబడింది. కొందరేమంటారంటే – పరమేశ్వరుడు సర్వ వ్యాపకుడు కదా! అట్లే అతని శక్తి కూడా లోకమంతా వ్యాపించి ఉన్నది కదా! కనుక దేవుడు + అతని శక్తి = అశ్వినా అనవచ్చునంటారు.

22. పూషణుడు : (పూష పుష్టౌ) దేవుడు సర్వపదార్థాలలోను లోపల వెలుపల వ్యాపించి ఉంటూ వాటికి పుష్టిని (వాటికా శక్తులను) కలిగిస్తూ పుష్టివంతం చేస్తున్నాడు కనుక దేవునకు పూషణుడనే పేరు కూడా ఉంది. 8-21-13).

23. బ్రహ్మణస్పతి : (బృహ, బృహి – వృద్ధౌ) పెద్దది గొప్పది అయినది బ్రహ్మ. సృష్టి అంతా దేవునిలో ఏకపాదంగా ఉంది కనుక దేవుణ్ణి బ్రహ్మ అంటుంది వేదం. ఇంతేగాక, లోకంలోని వివిధ జ్ఞానాలలో వేదమే గొప్పది. దానినుండే అన్నిరకాల సత్యమైన విద్యావిజ్ఞానాలు విస్తరించాయి. కనుక వేదాన్ని కూడా బ్రహ్మ–గొప్పజ్ఞానం అన్నారు ఋషులు. అట్టి వేదాలను ఇచ్చినవాడు కూడా దేవుడే కనుక అతనిని బ్రహ్మణస్పతి అంటుంది వేదం ప్రాతః స్మరణ మంత్రాలలో. ఇంతేగాక, ఈ ప్రాతఃస్మరణ మంత్రాలలో దేవుణ్ణి జితం, ఉగ్రమ్, అదితిః, మఘవన్ అనే నామములతో కీర్తిస్తుంది. కేవలం ప్రాతఃస్మరణ సూక్తంలోనే 13 నామములున్నాయి.

24. మఘవన్ : మఘం అంటే కూడా ధన మనియే అర్థం, యాస్క మహర్షి తన

వేద నిఘంటువులో ధన నామాలు 28 వ్రాశారు. వేద నిఘంటువంటే వేదాలలో ఆయా నామాలకు పేర్కొన్న పర్యాయ పదములని గ్రహించాలి. మఘం అంటే ధనం కనుక, దానిని పుష్కలంగా కలవాడు కనుకను, ఆ ధనాలను సృష్టించినవాడు కూడా అతనే. కనుక అతనిని మఘవన్ అంటుంది వేదం, భగవన్ అన్నట్లుగా.

25. కః : సామాన్య సంస్కృత భాషలో కః అంటే ఎవరు? అనే ప్రశ్నార్థకం. కాని, వేదాలలో ముఖ్యంగా హిరణ్యగర్భ సూక్తాలలో ధృత వాక్యంగా **"కస్మై దేవాయ హవిషా విధేమ"** అనే వాక్యం వస్తుంది. అక్కడ ఆ వాక్యానికి ఏ దేవుని కొరకు హవిస్సు నర్పించి నమస్కరించాలి? అని ప్రశ్నించటంకాదు. బ్రాహ్మణ గ్రంథాలలో అంటే ఋషులు వ్రాసిన వేదవ్యాఖ్యాన గ్రంథాలలో "కః వై ప్రజాపతిః" అని వ్యాఖ్యానించారు. సర్వజీవుల పతియైన ప్రజాపతికే 'కః' అనే ఒక విశేష నామమన్నారు. మహర్షి దయానందులవారు కూడా ప్రాచీన ఋషుల మార్గాన్నే అనుసరిస్తూ 'కస్మై' అనే పదమునకు తమ వేద భాష్యంలో "సుఖస్వరూపాయ పరమేశ్వరాయ" అని అర్థం వ్రాశారు.

కొందరు విద్వాంసులు "వేదాలలో అక్కడక్కడ 'ఏ' అనే అక్షరం లోపిస్తూ ఉంటుంది. మనం అర్థం చెప్పుకునేటప్పుడు ఏ + కస్మై = ఏకస్మై = అట్టి ఏకేశ్వరునకే హవిస్సు నర్పించి నమస్కరిస్తున్నాను" అని అర్థం చెప్పుకోవాలంటారు. ఇక్కడ మనం 'కః' అంటే సుఖస్వరూపుడని అర్థం చేసుకుంటే సరిపోతుంది.

26. శచీవ ఇంద్ర పురుకృద్ ద్యుమత్తమ ...... : (ఋ. 1-53-3), (అథర్వ. 20-3-21). శచీవ = సర్వశక్తిమంతుడు, పురుకృత్ = ఎక్కువ తక్కువలను చేయువాడు, ద్యుమత్తమ = అతిశయ దీప్తిమంతుడు. ఇవన్నీ ఏకేశ్వరుని శక్తులే. వేరువేరు దేవుళ్ళుకారు.

27. విపశ్చితుడు : జ్ఞానమయుడు (ఋ. 9-86-4).

28. శంభవుడు : సుఖ స్వరూపుడు.

29. మయోభవుడు : సర్వోత్తమ సుఖ ప్రదాత.

30. శంకరుడు : కల్యాణకరుడు.

31. మయస్కరుడు : తన భక్తులను కల్యాణకర కార్యాలలో నియుక్తం చేయువాడు.

32. శివుడు : మంగళ స్వరూపుడు.

33. శివతరాయుడు : మోక్షసుఖ ప్రదాత (యజు. 16-41).

పై 6 నామములు ఒకే ఈశ్వరునకు చెందినవి. యజుర్వేద 16వ అధ్యాయంలోను (నమకంలోను), అట్లే నాలుగు వేదాలలోను మరెన్నో పేర్లున్నాయి. వెదుకగలిగితే వేదేశ్వరునికి మనం సహస్రనామాలు తయారు చేయవచ్చు. ఇంతేగాక, ఋషులేమన్నారంటే - "అతని గుణకర్మ స్వభావాలు అనంతం కనుక అతని నామములును అనంతములే" నన్నారు.

కవులు ఆ ఏకేశ్వరుని - "అనంత గుణగణ భూషిత ఓం, శుద్ధ బ్రహ్మ పరాత్పర ఓం" అంటూ కీర్తించారు. మనం కూడా అట్లే కీర్తిద్దాము.

34. త్ర్యంబకుడు : భూ అంతరిక్ష ద్యులోకాలు మూడిటికిని మాత, ద్రష్ట, పాలకుడు (ఋ. 7-59-12, యజు. 3-60).

35. పౌర్ణమాసీ : (పూర్ణమ్ + ఆసీత్) విశాల విశ్వం అంతటా నిండియున్నవాడు (అథర్వ. 7-81. 1 నుండి 4 - పౌర్ణమాసీ సూక్తమంతా).

36. అమావాస్యుడు : అమా అంటే తోడుగా అని అర్థం. వాస్యుడంటే వసించేవాడు. సర్వవ్యాపక సర్వేశ్వరుడు మాత్రమే మనకు సదా తోడుగా ఉంటాడు. జననంలోను, మరణంలోను, జీవితంలోను చివరికి ముక్తిలో కూడా మనలో వ్యాపించి మనకు తోడుగా ఉంటాడు. (అథర్వ. 7-79-1 నుండి 4 - అమావాస్యా సూక్తమంతా).

37. ఉచ్ఛిష్టుడు : సామాన్య సంస్కృత భాషలో ఉచ్ఛిష్టమంటే భోజనం చెయ్యగా మిగిలిన ఎంగిలి పదార్థమని అర్థం. కాని, వైదిక వ్యాకరణానుసారం "ఉత్ సర్వస్మాదూర్ధ్వం శిష్టాత్ పరమేశ్వరః" = విశ్వంలోని నక్షత్ర గ్రహగోళాదులన్నిటి పైనా విద్యమానమై యుండు పరమేశ్వరుడని అర్థం.

అథర్వవేదం 11 కాం - 7వ సూక్తమంతటికి (27 మంత్రాలకు) ఉచ్ఛిష్టః దేవత. అక్కడ ఉత్పత్తి ప్రలయాలనుండి మిగిలియుండు దేవుని చేతనే ఈ జగత్తంతా సృజింపబడినట్లు వర్ణించబడింది.

38. వైకుంఠుడు : (వికుణ్ఠాయాం మయాయాం భువః) మూల ప్రకృతిని వికృతిగా

– విశేషకృతిగా – రమణీయ సృష్టిగా చేసి విశ్వం అంతా వ్యాపించి ఉన్నవాడు అని అర్థం.

39. అంగిరుడు : ప్రాణప్రియుడు, **అంగిరసుడు** = అంగముల మధ్య రసరూపుడు (ఋ. 2–23–18) **అంగిరసతముడు** = అతిశయ రస స్వరూపుడు (ఋ. 1–100–4).

40. శవ సస్పతుడు : (బహువిధం శవో బలం విద్యతే యస్య తత్ సమ్మృద్ధౌ) అందరికన్న, అన్నిటికన్న బలవంతడు కనుక దేవునకు శవస్పతుడని మరియొక పేరు (ఋ. 1–11–2).

41. ఈశానుడు : అన్నిటిని నియమించువాడు (ఋ. 1–9–5), (యజు. 25–1).

42. పురుష్టుతుడు : బహు విధముల స్తుతింపతగినవాడు (ఋ. 1–57–4).

43. మంహిష్టుడు : మహాదాత (ఋ. 1–57–1).

44. బృద్రదుడు : అనంత గుణములు, అనంత ధనములు కలవాడు.

45. త్విషీమతుడు : మహాతేజస్వి (ఋ. 1–55–5).

46. ధృతవ్రతుడు : దృఢమైన సృష్టి స్థితి లయ వ్రతధారి.

47. క్షోణీరివ ప్రతి హర్యుడు : పృథివివలె ఆకర్షించువాడు (ఋ. 1–57–4).

48. దర్శత శ్రీః : దర్శనీయ విభూతి గలవాడు (ఋ. 10–91–2).

49. యజిష్టుడు : పూజనీయుడు, సర్వోత్తమ సుఖ ప్రదాత (ఋ. 1–44–6).

50. మందిష్టుడు : అతిశయ ఆనంద ప్రదాత (ఋ. 1–51–11).

ఓం **అకామో ధీరో అమృతః స్వయంభూ రసేన తృప్తో న కుతశ్చనూనః ।**
తమేవ విద్వాన్ న బిభాయ మృత్యో రాత్మానం ధీర మజరం యువానమ్ ॥

– అథర్వవేదం 10–8–44

పై వేదమంత్రంలోని అకాముడు, ధీరుడు, అమృతుడు, స్వయంభువుడు, రసతృప్తుడు, కుతశ్చనూనుడు (ఏ రకమైన కొరతలు లేనివాడు) – ఈ 6 నామములు ఏకేశ్వరునివే. అట్లే –

ఓం సపర్యగాత్ + శుక్రమ్ + అకాయమ్ + అవ్రణమ్ + అస్నావిరం శుద్ధమ్ + అపాపవిద్ధమ్ । కవిర్ మనీషీ పరిభూః,
స్వయంభూః + యాథా తథ్యతోర్థాన్ వ్యదధాత్ +
శాశ్వతీభ్యః సమాభ్యః ॥ - యజు. 40-8

పర్యగాతుడు (అంతటా వ్యాపించి ఉండువాడు), శుక్రుడు (అత్యంత శీఘ్రకారి) అకాయుడు (శరీర రహితుడు), అవ్రణుడు (వ్రణాలు లేనివాడు), అస్నావిరుడు (నాడీ బంధనాలు లేనివాడు), శుద్ధుడు, అపాపవిద్ధుడు (పాపములచే, కర్మలచే అంటబడనివాడు), కవి (వేద కవి, సృష్టి కవి), మనీషీ (సర్వజీవుల మనస్సుల నెరుగువాడు), పరిభూతుడు (దుష్టుల నణచి పెట్టువాడు), స్వయంభువుడు (మాతా పితలు లేకనే స్వయంగా సదా ఉండువాడు) - ఈ 11 నామములు కూడా ఏకేశ్వరునివే.

1. అన్నపతి : అన్నాన్ని - ఆహారాన్ని ఉత్పన్నం చేస్తున్నవాడు. (యజు. 11-83)

2. శవసస్పతి : బలాధిపతి (ఋ. 1-11-2)

3. సుద్రవిదిః : సుందరమైన బలము, ధనము కలవాడు (ఋ. 1-94-15)

4. సహాస్వ : బలతేజ శక్తి భండారము (ఋ. 7-4-4)

ఈ విధంగా వేదసంహితలను వెతుకుతూ వెడితే మరెన్నో దేవుని నామములు కనబడతాయి. గ్రంథ విస్తరణ భీతిచే ఈ అనుబంధము నింతటితో ముగిస్తున్నాము.

ఓ3మ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

God is an embodiment ot truth, intelligence and bliss, and one without form, all powerful, just, kind, unborn, infinite, unchangeable, beginningless, incomparable, support of all, all-pervading, ominiscient, undeteriorable, immortal, fearless, eternal, holy and Creator of the Universe, He alone is worthy of worship.

- Maharshi Dayanand Saraswathi

పాఠకుల మెదడుకు పదునుగా - కొన్ని ప్రశ్నలు

1. దేవుళ్ళు ఎంతమంది? ఎవరిని దేవుడనాలి?
2. దేవుని అసలు పేరేమి? ఆ పేరుకు అర్థమేమి?
3. దేవునికి ఎన్ని పేర్లున్నాయి? ఏ ఆధారంతో అన్ని పేర్లు కలిగాయి?
4. దేవుడు మనవలె జన్మిస్తాడా? లేక అవతరిస్తాడా?
5. ఏ దేవుణ్ణి స్తుతించాలి? ప్రార్థించాలి? ఉపాసించాలి?
6. దేవుని స్తుతి ప్రార్థనోపాసనలు ఎందుకు చెయ్యాలి? ఎలా చెయ్యాలి?
7. దేవునికన్న అధిక శక్తిమంతులెవరు?
8. దేవుని పేర్లలో కొన్ని ముఖ్యమైన వాటికి అర్థ వివరణలు తెలుపండి?
9. దేవుని కొన్ని గౌణ నామములు (అంత ముఖ్యంకాని పేర్లు) తెలిపి వాటి అర్థాలను తెలుపండి?
10. దేవుణ్ణి బ్రహ్మ విష్ణు మహేశ్వరులనీ, రాహు కేతువులనీ, నారాయణ గణపతులనీ ఎందుకంటారు?
11. దేవునికి కేవలం పుంలింగ నామములేకాక స్త్రీలింగ, నపుంసకలింగ నామములు కూడా ఉన్నాయా? అవి ఏవి?
12. దేవుని గుణకర్మ స్వభావాలు కొన్ని తెలుపండి?
13. మనకు వచ్చే దుఃఖాలు ఎన్ని రకాలు? అవి ఏవేవి? సంక్షిప్తంగా వివరించండి?
14. మంగళాచరణం (గ్రంథ ప్రారంభం) ఎలా చేస్తే మంచిది?
15. 'సత్యార్థ ప్రకాశం' అనే జగత్ప్రసిద్ధ గ్రంథాన్ని ఎవరు వ్రాశారు?

శమ్ ఇతి ఓ3మ్

అష్టోత్తర శతనామావళి - శ్లోకాలతో ప్రార్థన

ఓ3మ్ ఖం విశ్వేశ్వరం ప్రాణం కుబేరం పురుషం తథా,
సవితారం చ పృథివీం స్వరాజం సర్వవ్యాపినమ్. 1

భగవంతం సర్వశక్తిమంతం శేషం పితామహం,
నిర్గుణం సగుణం మిత్రం సుపర్ణం శంకరం కవిమ్. 2

శం సత్యం చ మహాదేవం స్వప్రకాశ మురుక్రమం,
కాలాగ్నిం మాతరిశ్వానం భూమిం పరమపూరుషమ్. 3

విరాజం నిత్య మాప్తం చార్యమణం చ నిరంజనం,
ధాతారం విశ్వ స్రష్టారం పోషకం లయకారకమ్. 4

జ్ఞానానందమయం దేవం నిర్వికారం దయానిధిం,
న్యాయకారిణమాత్మానం విష్ణు మద్వైత మీశ్వరమ్. 5

శివం దివ్యం చ బ్రహ్మాణం చిత్రగుప్తం యమం ప్రియం,
అజం హిరణ్యగర్భం చానాదిం చ ప్రపితామహమ్. 6

పరమాత్మాన మన్నాదం రుద్ర మిద్రం వసుం జలం,
సూర్యం చంద్రం మంగళం చ రాహుం కేతుం శనైశ్చరమ్. 7

బుధం బృహస్పతిం బంధుం పితరం మాతరం తథా,
ఆచార్యం శక్తిం కూటస్థం నిరాకారం ప్రజాపతిమ్. 8

విశ్వంభరం శుద్ధబుద్ధం ముక్తం శుక్రం సరస్వతీం,
ధర్మరాజం మనుం లక్ష్మీం దేవీం చ పరమేశ్వరమ్. 9

ఆకాశం చ శ్రియం కాలం వరుణం చ గణాధిపం,
గురుం నారాయణం యజ్ఞం హోతారం ప్రాజ్ఞ మక్షరమ్. 10

ఆదిత్యం తైజసం వాయు మగ్నిం చాపి స్వయంభువం,
అవ్యయం ధ్యానమార్గేణ గంతవ్యం నాన్యథాలభమ్. 11

ఇంద్రియాణి సుసంయమ్య కృత్వా చ స్థిమితం మనః,
జన్మాది బంధమోక్షార్థం ధ్యాయే జ్ఞాన సమృద్ధయే 12

అనుబంధం

వైదిక సుప్రభాతం

ఓం విశ్వాని దేవి సవితర్ దురితాని పరాసువ ।
యద్ భద్రం తత్ + నః + ఆ సువ ॥

ఓ సవితా! సృష్టికర్తవైన పరమేశ్వరా! ఓ సర్వాంతర్యామీ! మాలోని దుర్గుణాలను, దుష్టభావాలను, అడ్డంకులను, అసత్యాలను దూరంచేసి యద్ భద్రం – ఏవి భద్రములైనవో, కళ్యాణకరమైనవో, ఏవి నీదరికి చేర్చునవియో వాటిని మాకు ప్రసాదింపుము. మానవ మాత్రులందరికీ, ప్రాణిమాత్రులందరికీ ప్రసాదింపుము.

ఓ3మ్ శాంతి శ్శాంతి శ్శాంతిః

'సుప్రభాతం' అంటే శుభప్రదమైన ఉషోదయం. అందరికి శుభాలను, సుఖాలను ప్రసాదించేది పరమేశ్వరుడే కనుక అతని సేవలో, అతని ఆజ్ఞానువర్తులమై జీవితాన్ని గడుపుతామని గట్టిగా సంకల్పించుకోవటమే సరియైన సుప్రభాతం. మన పూర్వులు ఆ విధంగా చేశారు. కాని మధ్యకాలంలో వేదధర్మ ప్రచారం లోపించటం వల్లా, దేశాన్ని సరియైన మార్గంలో నడిపే ధర్మాత్ములైన రాజులు లేకపోవటంవల్లా, దేశం ఛిన్నాభిన్నమై స్వతంత్రరాజ్యాలు రాజ్యమేలాయి. ఏకచ్ఛత్రాధిపత్యం, అఖండత, ఐకమత్యం లోపించాయి. కొందరు విదేశీయులు దోపిడీ దొంగలై దోచుకోగా, కొందరు స్వతంత్ర రాజులకు పరస్పర ద్వేషాలు రెచ్చగొట్టి వారి పబ్బం గుడుపుకున్నారు. చివరికి దేశం విదేశీయుల పాలనలోకి వెళ్లిపోయింది. అట్లే వైదిక ధర్మం స్వార్థపరుల స్వార్థానికి గురియై అనేక సంప్రదాయాలు పుట్టగొడుగులుగా పుట్టుకొచ్చాయి. దానితో సుప్రభాతాలు కూడా చాలానే పుట్టుకొచ్చాయి.

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంతో ప్రారంభమైన ఈ సుప్రభాతాల పరంపర క్రమంగా అన్నిరకాల దేవీ దేవతలకు రచింపబడ్డాయి. ఈమధ్య బాబాలకు, గురువులకు, గాంధీ గారి వంటి మహాపురుషులకు కూడా సుప్రభాతాలు వ్రాసి ప్రసారం చేస్తున్నారట. ఇక ముందు గంగ, యమున, గోదావరి, కృష్ణా వంటి

నదులకు కూడా సుప్రభాతాలు వ్రాస్తారేమో తెలియదు. ఈ సుప్రభాతాలతో దేవుళ్లను మేల్కొల్పుతారు. "మేలుకొని మమ్మేలుకో" మని ప్రార్థిస్తారు. దానితో దేవీ దేవతల అనుగ్రహం తమపై వర్షిస్తుందని నమ్ముతారు. దీనిని మూఢనమ్మకమనాలో, పిచ్చి నమ్మకమనాలో తెలియటంలేదు. సృష్టికర్తయైన ఏకేశ్వరుడు వేదాల ద్వారా ఏమి ఉపదేశించాడో, ఉషోదయకాలంలో ఏమి చెయ్యాలని ఆదేశించాడో దానిని ఉపదేశించేవారు కరువయ్యారు. వినేవారు కూడా తక్కువౌవుతున్నారు. ఏమంటే సమయం లేదంటున్నారు. మాకు చాలా బరువు బాధ్యతలున్నాయంటున్నారు. మరి వినోదాలలో, విందులలో, వింతలలో గడపటానికి ఈ మహానుభావులకు సమయ మెక్కడనుండి వస్తున్నదో తెలియదు.

శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలోని మొదటి శ్లోకం వాల్మీకి మహర్షి వ్రాసిన రామాయణం లోనిది. విశ్వామిత్ర మహర్షి దశరథ మహారాజును అనునయింపజేసి, తన యాగ సంరక్షణార్థం రామలక్ష్మణులను తనవెంట తీసుకువెడతాడు. రామలక్ష్మణులు ధనుస్సులను, రెండేసి అంబుల పొదులను ధరించి సూర్యతేజస్సుతో విశ్వామిత్ర మహర్షి వెనక నడుస్తూ ఒకటిన్నర యోజనములు అడవిలో కాలినడకన సరయూనది సమీపానికి చేరుకున్నారు. అప్పటికి సాయం సంధ్యాసమయ మయ్యింది. అలవాటులేని నడక ప్రయాణం కనుక రామలక్ష్మణులు బాగా అలసిపోయారు. అది గమనించిన విశ్వామిత్ర మహర్షి ఆ రాత్రి అక్కడనే విశ్రమిద్దామని చెప్పారు. ముగ్గురూ స్నానం చేసి సంధ్యా ప్రార్థనోపాసనలు చేసుకున్నారు. మహర్షి వారిద్దరికి ఆకలిదప్పులు స్మరణకు రాకుండా 'బల, అతిబల' అనే విద్యలను ఉపదేశించాడు. బహుశా ఈ విద్యలు ఒక రకమైన ప్రాణాయామ విద్యలు కావచ్చు. విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులకు గడ్డిని పరచి శయ్యలుగా తయారుచేసి పరుండమని చెప్పి, తానును వారి ప్రక్కన శయనించాడు.

మరునాడు బ్రహ్మీముహూర్తంలోనే మహర్షి నిద్రలేచి సంధ్యోపాసన చేసుకున్నాడు. ఉషఃప్రభ వచ్చుచున్నది. అలసి నిద్రించియున్న రామలక్ష్మణులు ఇరువురు ఇంకా నిద్ర లేవలేదు. అప్పుడు మహర్షి ఈ క్రింది విధంగా నిద్రలేపాడు.

శ్లో॥ కౌసల్యా సుప్రజా రామా పూర్వా సంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవ మాహ్నికమ్ ॥

"కౌసల్యాదేవికి ఉత్తమ సంతానమైన ఓ రామా! తూర్పున ఉషస్సులు ఉదయించాయి. ఉదయ దైవకార్యాలైన సంధ్యాగ్నిహోత్రాలు చేసుకోవాలి కదా! నీవింక నిదురలెమ్ము" అంటూ సౌమ్యంగా నిద్రలేపాడు. అప్పుడు రామ లక్ష్మణులు –

శ్లో॥ తస్యర్షేః పరమోదారం వచః శ్రుత్వా నృపాత్మజౌ ।
స్నాత్వా కృతోదకౌ వీరౌ జపేతుః పరమం జపమ్ ॥

మహర్షి మాటలు విన్న ఆ వీర రాకుమారులు సరయూనదిలో స్నానం చేసి సంధ్యావందనం చేసుకున్నారు. పరమ పవిత్ర మంత్రమైన గాయత్రిని వారిరువురు కొంతసేపు జపించారు.

శ్లో॥ కృతాహ్నికౌ మహావీర్యౌ విశ్వామిత్రం తపోధనమ్ ।
అభివా ద్యాభిసంహృష్టౌ గమనా యాభి తస్థతుః ॥

– గీతా ప్రెస్ వారి వాల్మీకి రామాయణం (బాలకాండ 23–2,3,4)

అనంతరం మహాపరాక్రమవంతులైన ఆ రామలక్ష్మణులు సంధ్యాగ్నిహోత్రాది ప్రాతః దైవకార్యాలను ముగించుకొని తపోధనులైన విశ్వామిత్ర మహర్షికి అభివాదం చేశారు. సాష్టాంగ నమస్కారం చేశారు.

పై శ్లోకాలలోని మొదటి శ్లోకాన్ని శ్రీ వేంకటేశ్వర సుప్రభాతంలోని మొదటి శ్లోకంగా తీసుకుని అనంతరం వారి పౌరాణిక వేంకటేశ్వరుని పొగడ్తలతో ముంచెత్తారు. ఆ స్తోత్రాలలో కొన్ని అపశృతులు కూడా చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు –

1. కాంతా కుచాంబురుహ కుట్మల లోల దృష్టి ....
2. కమలా కుచ చూచుక కుంకమతో నియతారుణితాతుల నీలతనో ....
3. సప్రేమ భీతి కమలాకర పల్లవాభ్యాం సంవాహనేఽపి ....

(వీటి తెలుగు అర్థాలు వ్రాయ నా మనసొప్పుట లేదు. సంస్కృత పండితుల నెవరినైన అడిగి తెలుసుకోండి.)

అయినా ఏకపత్నీవ్రతుడు, అన్ని విషయాలలో మర్యాదను అతిక్రమించని శ్రీరాముడెక్కడ? ఇట్టి కాముక పౌరాణిక దేవుడెక్కడ? అందుచేతనే మన మహర్షులు

దేవుని గురించి తెలుసుకోగోరే జిజ్ఞాసువులు శ్రుతి వాక్యాలతోనే – వేద వాక్యాలతోనే తెలుసుకోవాలని **"శ్రోతవ్యః శ్రుతి వాక్యేభ్యః"** అని నియమ మేర్పరచినారు. ఇక మనం ఉపోద్ఘాతాన్ని యింతటితో ఆపి నిద్రలేవగానే ఏ దేవుని స్మరించాలో, వేదం ఏమి చెబుతున్నదో తెలుసుకుందాం.

ప్రాతః స్మరణ మంత్రాలు - కొన్ని ముఖ్య విషయాలు: వేదమంత్రాలకు ఋషి, దేవత, ఛందస్సు, స్వరము అని నాలుగు విషయాలుంటాయి. ఈ క్రింద వ్రాయబోయే మంత్రాలు ఋగ్వేద సప్తమ మండలంలోని 41వ సూక్తానికి చెందినవి. ఈ మంత్రాలన్నిటికి **వశిష్టుడు ఋషి.** ఈ వశిష్టుడు రామాయణ కాలంనాటి వశిష్టుడు కాదు. స్వాయంభువ మన్వంతరంలోని మొదటి చతుర్యుగం యొక్క మొదటి కృతయుగానికి చెందినవాడు. ఈయన స్వయంగా ఈ మంత్రాలను రచించలేదు. సృష్టికర్త ముందుగా ఈ మంత్రాలను 'అగ్ని' అనే పేరుగల ఆదిఋషి హృదయంలో ప్రకాశపరిచాడు. వారినుండి 'బ్రహ్మ' అనే పేరుగల ఋషి నేర్చుకొని తనలో ధారణ చేసుకున్నాడు. ఆయన ఒక గురుకులాన్ని ఏర్పాటు చేసుకొని తనవద్దకు వచ్చిన శిష్యులకు ఋగ్వేదాన్ని నేర్పాడు. ఆ శిష్యులు దూరదూరంగా గురుకులాల నేర్పరచుకొన్నారు. ఈ మంత్రాల ద్రష్టయైన ఋషి వశిష్టుడు ఆ శిష్యకోటిలోనివాడే. ఆయన వ్యాకరణం ద్వారా వేదమంత్రాల అర్థం తెలుసుకోవటమేగాక, యోగాభ్యాసం చేస్తూ అంతర్ముఖుడై ఆత్మ పరమాత్మల సాక్షాత్కారం పొందాడు. తాను ఈ మంత్రాల అర్థం తెలుసుకోగోరుతూ సమాధి స్థితిలోనికి వెళ్లి అంతర్యామియైన సృష్టికర్తనుండి వీటి సరియైన అర్థాలను తెలుసుకున్నాడు. ఆ అర్థాలను తన శిష్యులకు, సామాన్య ప్రజలకు వివరించి చెప్పాడు. కనుక ఆనాటినుండి తరతరాలు ఆ ఋషికి కృతజ్ఞతలు తెలుపుకోవటానికి ఈ సూక్తాన్ని పఠించేటప్పుడు ఆ ఋషిపేరు చెప్పుకొని ఆరంభించటం అనాదిగా వస్తున్న ఆచారం. కనుకనే ముందుగా ఆ ఋషిపేరు చెప్పుకోవటం జరిగింది. 'వస–నివాసే' అనే మూల ధాతువు నుండి 'వశిష్ట' పదం పుట్టింది. కనుక దీని మూలార్థం (Root meaning) వసింపచేసేవాడు, ఆశ్రయమిచ్చేవాడు. ఈ పేరు మన పిల్లలకు కూడా పెట్టుకోవచ్చు.

వేదమంత్రాలకు ఋషినామంతో బాటు దేవతలను, ఛందస్సులను, స్వరాలను కూడా వేదపాఠీయులు చెప్పుకుంటారు. ఇక్కడ దేవతలంటే – ఆయా

మంత్రాలలో ఏ ఏ పదార్థాల గురించి లేదా ఏ ఏ విషయాల గురించి చెప్పబడిందో వాటిని దేవతగా వ్యవహరిస్తారు. ఈ ప్రాతఃస్మరణ మంత్రాలలో అగ్ని, ఇంద్రుడు, మిత్రావరుణులు, అశ్వినులు, భగుడు మొదలైన చాలామంది దేవతలుండటంవల్ల అంటే – ఏకేశ్వరునికే అనేక పేర్లుండటంవల్ల **'అగ్న్యాదయో లింగోక్తా దేవతా'** అని చెప్పబడింది. ఈ సూక్తంలో ఈ పేర్లన్నిటితో సర్వవ్యాపక సర్వేశ్వరుఇన మన హృదయంలోనికి ఆహ్వానిస్తున్నాము. ఒక్కొక్కపేరు ఆ ఏకేశ్వరుని ఒక్కొక్క గుణాన్ని, శక్తి సామర్థ్యాలను సూచిస్తాయి.

వేద మంత్రాలకు ముఖ్యంగా సప్తఛందస్సులుంటాయి. 1) గాయత్రీ 2) ఉష్ణిక్, 3) అనుష్టుప్, 4) బృహతీ, 5) పంక్తీ 6) త్రిష్టుప్, 7) జగతీ. వీటిలో కూడా మరికొన్ని ఉపభాగాలుంటాయి. ఈ ప్రాతఃస్మరణ మంత్రాలకు వేరు వేరు ఛందస్సులున్నాయి.

అట్లే వేదస్వరాలును సప్త విధాలుగా ఉంటాయి."షడ్జ, ఋషభ, గాంధార, మధ్యమ, పంచమ, దైవత, నిషాద్" అని సప్తస్వరాలు. వీటినుండే సంగీత శాస్త్రంలోని "స, రి, గ, మ, ప, ద, ని, స"లు వచ్చాయట. ఈ మంత్రాలకును స్వరాలు వేరువేరుగా ఉన్నాయి. మనం సస్వర వేదపాఠీయులం కాదు కనుక యింత మాత్రం తెలుసుకొంటే సరిపోతుంది. వివరంగా తెలుసుకోగోరేవారు వేద సంహితలను చూడగోరుచున్నాము. ఆయా దేవతలను గురించిన విషయాలను మంత్ర వివరణ భాగంలో సంక్షిప్తంగా తెలుసుకుందాము.

ప్రాతః స్మరణ సూక్తమ్ - భగసూక్తమ్

లోకంలో ప్రాతఃస్మరణ సూక్తం 'భగసూక్తం'గా ప్రసిద్ధిని పొందింది. వేదపాఠీయులంతా దీనిని 'అథ భగసూక్తమ్' అంటూ ప్రారంభిస్తారు. ఎందుకంటే ఈ సూక్తంలో పలుమార్లు భగ పదం వస్తుంది. 'భగః' అంటే ఐశ్వర్యము, సంపదలు అని అర్థం. ఈ సూక్తంలో దేవుని అనేక నామాలతో స్మరించినా, ఆహ్వానించినా ఐశ్వర్యం కొరకు ప్రార్థించబడింది. కనుక ఈ మంత్రాల దేవత 'భగః' అని కూడా అనవచ్చు. అందుచేతనే ఇది భగసూక్తం అని ప్రాచుర్యం పొందింది.

ఈ భగసూక్తం ఋగ్వేదంలోని సప్తమ మండలంలో 41వ సూక్తంగాను, అథర్వవేదంలోని తృతీయకాండలో 16వ సూక్తంగాను ప్రత్యేక సూక్తాలుగా ఉన్నాయి. యజుర్వేదంలో మాత్రం 34వ అధ్యాయంలో 34వ మంత్రం నుండి

40వ మంత్రం వరకు ఉన్నాయి. మరి, వేటిని భగ (ఐశ్వర్యం) అనాలి అంటే –

శ్లో॥ ఐశ్వర్యస్య సమగ్రస్య వీర్యస్య యశసః శ్రియః ।
జ్ఞాన వైరాగ్యయోశ్చైవ షణ్ణాం భగ ఇతీరణ ॥

సమగ్ర ఐశ్వర్యం (రాజ్యాధిపత్యం), పరాక్రమం, కీర్తి, వివిధ సంపదలు ఆత్మ పరమాత్మల విషయక జ్ఞానం, వైరాగ్యం (భౌతిక సంపదలపై విరక్తి, భగవంతునిపై అనురక్తి) అనే ఆరింటిని 'భగము' అనవచ్చునని ఒక పండితుడన్నాడు. మరొక పండితులవారు –

శ్లో॥ ఉత్పత్తి వినాశం చ, భూతానా మాగతమ్ గతమ్ ।
వేత్తి విద్యాం చావిద్యాం చ, స వై భగవాన్ ఇతి స్మృతః ॥

సృష్టి యొక్క ఉత్పత్తి వినాశాలను, ప్రాణుల (జీవుల) రాకపోకలను, విద్య అవిద్యలను చక్కగా తెలుసుకున్న సాధు మహాత్ములను భగవాన్ అంటారన్నారు. భగవాన్ అంటే భగాన్ని (ఐశ్వర్యాన్ని) కలవాడని అర్థం కనుక పై సంపదలలో ఏ సంపదను కలిగి ఉన్నా, వారిని భగవాన్ అనవచ్చు. అట్లే ఆధ్యాత్మిక జ్ఞానం కలిగినవారినీ, వైరాగ్య సంపన్నులను కూడా 'భగవాన్' అని సంబోధించవచ్చు. ఈ సూక్తంలో సృష్టికర్తయు, సర్వవ్యాపక సర్వేశ్వరుడును, సృష్టిలోని సమస్త ఐశ్వర్యాలను కలిగినవాడును అగుటచే పరమేశ్వరుని 'భగ ఏవ భగవానస్తు దేవాః' అని కీర్తింపబడింది. కనుకనే మనం సృష్టికర్తను 'భగవంతుడు' అంటాము.

'వైదిక సుప్రభాతం' ఎప్పుడు పఠించాలి?

మహర్షులు దీనిని నిద్రలేవగానే శయ్యపైననే నిటారుగా కూర్చొని హృదయ స్థానంలో మనస్సును నిలిపి మనస్సులోనే దీనిని పఠించాలన్నారు. ఆ విధంగా మనస్సు నిలువకుంటే ప్రక్కవారికి యిబ్బంది లేకుండా మందస్వరంతో పఠించవచ్చు. దీనిని అర్థభావనతో పఠిస్తేనే మనఃశాంతి, ఆత్మతృప్తి కలుగుతాయి. లేకుంటే పెద్దగా ఫలితం ఉండదు.

ఆయుర్వేద శాస్త్రం మూడవ ఝాము ప్రారంభం కాగానే (తెల్లవారుఝామున 3 గంటలకే) నిద్రలేవాలంటుంది. సాయంత్రం 7 గంటలకే భోజనం చేసి 9 గంటలకు నిద్రిస్తేనే ఇది సాధ్యం అవుతుంది. ఎక్కువలో ఎక్కువ 10 గంటలకు నిద్రించి 4 గంటలకు నిద్రలేవాలి. అప్పుడు శరీరం, మనస్సు సేదదీరి స్ఫూర్తిని

పొంది ఉంటాయి. దానినే మహర్షులు బ్రాహ్మీముహూర్తమన్నారు. అప్పుడు జప ధ్యానాదులు చేసుకోవడానికి చాలా అనుకూలంగా ఉంటుంది. ధ్యానానంతరం కొద్దిసేపు వ్యాయామం, ప్రాణాయామం చేసుకొని స్నానం చెయ్యవచ్చు. సంధ్యాగ్నిహోత్రాలు చేసుకోవచ్చు.

ప్రియ పాఠకులారా! మనమంతా ఆత్మస్వరూపులం. జీవాత్మలం. మన పరిమాణం పరమాణువంత. ఈ శరీరంలో మన హృదయ ప్రాంతంలో ఉంటాం. మన మనస్సు, బుద్ధి కూడా మనవద్దనే ఉంటాయి. సృష్టికర్తయైన దేవుడు సర్వవ్యాపకుడు కనుక అతడు మన దేహేంద్రియ మనోబుద్ధులలోనూ, జీవాత్మలలోనూ కూడా వ్యాపించి ఉన్నాడు. కనుక మనం మనలోనికి అంతర్ముఖులమై మనలో వ్యాపించి ఉన్న అంతర్యామిని నిద్రలేవగానే ఈ క్రింది మంత్రాలతో ప్రార్థన చేసుకోవాలి.

అథ ప్రాతః స్మరణమ్

ఓ3మ్ ...... ఓ3మ్ .... ఓ3మ్=హే సర్వ సంరక్షక అంతర్యామీ!

1. ఓం ప్రాతరగ్నిం ప్రాతరిన్ద్రం హవామహే
ప్రాతర్మిత్రా వరుణా ప్రాతరశ్వినా ।
ప్రాతర్భగం పూషణం బ్రహ్మణస్పతిం
ప్రాతః సోమ ముత రుద్రం హువేమ ॥

– ఋగ్వేదం (7–41–4), యజు. (34–34), అథర్వ. (3–16–1)

వాక్యార్థం :

ప్రాతః + అగ్నిం ప్రాతః + ఇంద్రం హవామహే = ఓ అంతర్యామీ! ఈ ప్రభాత ప్రశాంత సమయాన నీ అగ్నితత్త్వాన్ని – జ్ఞాన ప్రకాశాన్నీ, నీ ఇంద్ర శక్తినీ – ఐశ్వర్య శక్తినీ మాలోనికి ఆహ్వానించుచున్నాము.

ప్రాతః + మిత్రా వరుణా ప్రాతః + అశ్వినా = ఈ ప్రాతః కాలమున పరమ మిత్రుడు, శ్రేష్ఠశాసకుడు, లోకాలోక శక్తులు కలవాడు అయిన పరమేశ్వరుని మాలోనికి ఆహ్వానించుచున్నాము.

ప్రాతః + భగం పూషణం బ్రహ్మణస్పతిం = ఈ ప్రభాత సమయాన భజనీయుడు

(సేవింప దగినవాడు), బ్రహ్మాండ పోషకుడు, వేదజ్ఞాన ప్రదాత అయిన సృష్టికర్తను మాలోనికి ఆహ్వానించుచున్నాము.

ప్రాతః + సోమమ్ + ఉతరుద్రమ్ హువేమ = ఈ ప్రభాత సమయాన సోముని సౌమ్యంగా సత్పురుషులకు ప్రేరణ కలిగించువానిని, రుద్రుని, దుష్టులకు తగిన దుఃఖములను కలిగించువానిని మాలోనికి ఆహ్వానించుచున్నాము.

సరళార్థం : ఓ అంతర్యామీ! ఈ ప్రభాత సమయాన నీ జ్ఞాన ప్రకాశాన్ని, నీ ఐశ్వర్యశక్తిని మాలోనికి ఆహ్వానించుచున్నాము. ఈ ప్రాతఃకాలాన మాకు పరమ మిత్రుడవు, శ్రేష్ఠశాసకుడవు, లోకాలోకాలు (సృష్టి ప్రళయాలు) చేయగల అశ్వినీశక్తులు గల నిన్ను మాలోనికి సాదరంగా ఆహ్వానించుచున్నాము. భజనీయుడవు, బ్రహ్మాండ పోషకుడవు, వేదజ్ఞాన ప్రదాతవు అయిన నిన్ను స్వాగతించుచున్నాము. నీవు సత్పురుషులకు సౌమ్యుడవు. దుష్టులకు రుద్రుడవు. నీలో సహనము మన్యువు అనంతంగా ఉన్నాయి. అట్టి దివ్యగుణయుక్త పరమేశ్వరా! నీకు మా సాదర స్వాగతం.

వైదిక ఆధ్యాత్మిక వివరణ : (ముఖ్య గమనిక) : పై మంత్రంలోని అగ్ని, ఇంద్ర, మిత్రావరుణా, అశ్వినా మొదలైన పదములన్నీ ఇది ఆధ్యాత్మిక ప్రకరణం (దైవ ప్రార్థన విషయం) కావటంవల్ల ఏకేశ్వరునికే వర్తిస్తాయి. వేరే విషయాలు వచ్చినప్పుడు – స్వస్తివాచన, శాంతికరణ మంత్రాలలో ఆ ప్రకరణాలకు చెందిన అర్థాలను తెలుసుకుందాము. ఇక్కడ కేవలం ఆధ్యాత్మిక అర్థాలను గురించి మాత్రమే వివరించుచున్నాము. వేదం ఏమంటుందంటే –

"ఇంద్రం మిత్రం వరుణ మగ్నిం మాహురథో దివ్య స్సుపర్ణో గరుత్మాన్ ।
ఏకం సద్విప్రా బహుధా వదన్తి అగ్నిం యమం మాతరిశ్వాన మాహుః ॥

– ఋగ్వేదం (1–164–46)

వేదంలో ఇంద్రుడు, మిత్రుడు, వరుణుడు, అగ్ని, దేవుడు, సుపర్ణుడు, గరుత్మంతుడు మొదలైన నామములతో సంబోధింపబడే పరమేశ్వరుడు ఒకే ఒక్కడు. విప్రులు (జ్ఞానులు) ఆ ఏకేశ్వరునే అగ్ని అనీ, యముడనీ మాతరిశ్వుడనీ ఆయా సందర్భాలలో పేర్కొంటారు'' అంటుంది. వీరంతా వేరు వేరు దేవుళ్ళనుకుంటారేమోనని మరొకచోట –

న ద్వితీయో న తృతీయశ్చతుర్థో నా ప్యుచ్యతే.......

.... య ఏతం దేవ మేక వృతం వేద ॥

– అథర్వవేదం (13–14, 16–18)

సృష్టి స్థితి లయ కర్త ఒకే ఒక్కడు. ఇద్దరు గాని, ముగ్గురు గాని..... లేనేలేరు. అతడే ఒకే ఒక్కడు అంటుంది వేదం. కనుక ఈ మంత్రంలోని పదములన్నిటికి ఏకేశ్వరుని పరంగానే అర్థాలు వ్రాయబడ్డాయి.

1. అగ్ని : (అ ఇచ్చు గతి పూజనయోః) – అగ్ని అంటే 'గతి కలిగినది, పూజించతగినది' అని అర్థం. ఇక్కడ గతి అంటే కేవలం కదలిక, వేగం అని అర్థం కాదు "గతిస్త్రయోఽర్థాః జ్ఞానం, గమనం, ప్రాప్తిశ్చేతి పూజనం నామ సత్కారః. యోఽఇఛ్చతి అచ్యతేఽ గత్యంగత్యేతి వా సోయమగ్నిః" అని నిర్వచనం. అంటే జ్ఞాన పూర్వకమైన గమనంతో లక్ష్యం వైపు పయనించి ప్రాప్తించవలసిన దానిని ప్రాప్తించటాన్ని గతి అంటారని ఋషులు వివరించారు.

అట్లే పూజనం అంటే గుళ్లలో పూజించినట్లు కాదు. తగిన విధంగా సత్కరించటం. దేవుడు వేదం ద్వారా బోధించిన ఉపదేశాలను పాటించటం. ఆజ్ఞాపాలనం. తల్లిదండ్రులను పూజించటమంటే – శ్రీరామునివలె వారి మనస్సు నొప్పింపక ఆచరించటమే కదా!

'స్వాభావకీ యస్య జ్ఞాన బలక్రియా చ' అని చెప్పినట్లు సృష్టికర్త బలక్రియలు పరిపూర్ణములు. అతడే పూజింపదగినవాడు. కనుక ఇచట 'అగ్ని' పదం సర్వాంతర్యామికే వర్తిస్తుంది.

2. ఇంద్రుడు : "ఇది – పరమైశ్వర్యే" అనే మూల ధాతువుతో ఇంద్ర పదము నిర్మించబడుతుంది. **"య ఇన్దతి పరమైశ్వర్యవాన్ భవతి స ఇంద్రః పరమేశ్వరః"** అని నిర్వచనం. అంటే – సృష్టిలోని సమస్త ఐశ్వర్యాలకు అధిపతి, జీవుల కర్మలనుబట్టి వారికి తగిన భోగభాగాల్యనిస్తూ ఉంటాడు కనుక ఏకేశ్వరునకే ఇంద్రుడని మరొక పేరు.

3. మిత్రుడు : (ఞి మిదాస్నేహనే) – **"మేద్యతి స్నిహ్యతి స్నిహ్యతే వా స మిత్రః"** అని నిర్వచనం. అందరితో స్నేహం చేస్తూ అందరిచే ప్రేమింపబడతాడు కనుక ఏకేశ్వరునికి మిత్రుడని మరొక నామము.

4. వరుణుడు : (వృఞ్ – వరణే, వర – ఈప్సాయామ్) **"యః సర్వాన్ శిష్టాన్**

ముముక్షూన్ ధర్మాత్మనో వృణోత్యథవా యః శిష్టైర్ముముక్షుభిర్ ధర్మాత్మ భిర్ ప్రియతే వర్యతే వా స వరుణః పరమేశ్వరః" అని నిర్వచనం. అంటే - శిష్టులగు (యోగ్యులగు) యోగ సాధకులను, విద్వాంసులను, ముక్తిని కోరువారిని, ముక్తాత్మలను, ధర్మాత్ములను స్వీకరించువాడును; అట్టివారిచే వరింపబడేవాడును కావటంచేత సృష్టికర్తకు వరుణుడని మరొకపేరు. **"అథవా వరుణోనామ వరః శ్రేష్ఠః"** - లేక సృష్టికర్త అందరికంటే శ్రేష్ఠుడు కనుక అతనిని వరుణుడనవచ్చును.

5. అశ్వినౌ : పదము వేదాలలో అశ్వినా గా ప్రయోగింపబడింది. (అశూజ్–వ్యాప్తౌ) వ్యాపకగుణం కలిగి ఉండే రెండు జంట శక్తులను 'అశ్వినౌ–అశ్వినా' అని ద్వివచనంలో చెబుతారు. ఆయా సందర్భాలను బట్టి ఆ జంటశక్తులు అనేక రకాలుగా ఉంటాయి. వైద్యులపరంగా చెబితే "Physician and Surgeon" మందులు ఇచ్చేవాడు, శస్త్రచికిత్సకుడు అని అర్థం. ఇక్కడ దేవునిపరంగా చెప్పుకోవాలి కదా! అందుచే సృష్టి ప్రళయాలు రెంటినీ చేయగల ఏకేశ్వరుడని అర్థం. వీటిని కొందరు లోకాలోక శక్తులని కూడా అంటారు. అశ్వినీ దేవతలను గురించిన మరెన్నో విషయాలు నా రచన "వేదాలలో అశ్వినీ దేవతలు" చూడండి.

6. భగుడు : (భజ సేవాయామ్) **"భగః - సకలైశ్వర్యం, సేవనం వా విద్యతే యస్య స భగవాన్"** అని నిర్వచనం. సకలైశ్వర్యాలకు అతడు స్వామి కనుకను అందరిచే సేవింప తగినవాడు కనుకను అతనిని మనం తరచుగా 'హే భగవాన్' 'ఓ భగవంతుడా!' అని స్మరించుకుంటాం.

7. పూషణుడు : (పూష–పుష్టౌ) సృష్టిలోని పదార్థాలన్నిటి లోపలా బయట (వెలుపల) వ్యాపించి వాటికి పుష్టిని (శక్తి సామర్థ్యాలను) కలిగిస్తాడు. కనుక సృష్టికర్తకు పూషణుడని మరొకపేరు.

8. బ్రహ్మణస్పతి : (బృహ, బృహి - వృద్ధౌ) పెద్దది, గొప్పది అయినది బ్రహ్మ ఔతుంది. సృష్టికర్త అన్నిటిని తనలో ఏకపాదంగా కలిగి ఉన్నాడు కనుక అతడు బ్రహ్మ. బ్రహ్మాండ నాయకుడు. అట్లే లోకంలోని వివిధ జ్ఞానాలలో వేదమే గొప్పది కనుకనూ, అన్ని సత్యజ్ఞానాలు దానినుండే వచ్చినవి కనుకనూ వేదాలను కూడా 'బ్రహ్మ' అంటారు. అట్టి వేదాలను ఇచ్చినవాడు కనుక అతడు 'బ్రహ్మణస్పతి' కూడా అయ్యాడు.

9. సోముడు : షుఞ్–అభిషవే, షూ–ప్రేరణే, షు–ప్రసవైశ్వర్యే అనే మూడు

ధాతువులకు 'మన్' ప్రత్యయం చేర్చి సోమః పదం నిర్మించవచ్చు. కనుక 3 రకాలుగా అర్థాలు చెప్పవచ్చు.

1. బ్రహ్మాండాలను అందలి ప్రాణులను ఉత్పన్నం చేస్తాడు కనుక సృష్టికర్తకు సోముడని పేరు.

2. ఎవరు అంతర్యామిని ఉపాసిస్తారో వారికి అతడు సత్కర్మలయందు, ధర్మమునందు ప్రేరణ కలిగిస్తాడు కనుక అతడు సోముడు.

3. ఉపాసకులకు ఆనందాన్ని, ఐశ్వర్యాలను ప్రసాదిస్తాడు కనుక పరమేశ్వరునకు సోముడని మరియొక పేరు.

10. రుద్రుడు : (రుదిర్ – అశ్రుమోచనే) దుష్టులకు కాలాంతరంలో కష్టాలను కలిగించి వారిని రోదింపచేస్తాడు – ఏడిపిస్తాడు కనుక సర్వాంతర్యామికే రుద్రుడని మరొక పేరు.

ఈ ఒక్క మంత్రంలోనే ఏకేశ్వరుని 10 పేర్లను తెలుసుకున్నాము కదా! అట్లే అతనికి 100కు పైగా పేర్లు వేదాలలో కనబడతాయి. వాటిని గురించి మహర్షి దయానందుల వారు రచించిన జగత్ప్రసిద్ధ గ్రంథం 'సత్యార్థ ప్రకాశం' మొదటి సముల్లాసం (అధ్యాయం)లో చూడండి. మరికొన్ని కొత్త నామములను రాబోవు మంత్రాలలో తెలుసుకుందాము.

ఈ మంత్రంలోని 'మిత్రావరుణా' పదమునకు "అశ్వినా" పదమునకు ప్రాణాపాన వాయువులనీ, ఆచార్య ఉపదేశకులనీ, మాతాపితలనీ కూడా అర్థాలు చెప్పవచ్చు. సంక్షిప్తంగా ఆంగ్లంలో మంత్రార్థం ఈవిధంగా ఉంటుంది.

We invoke God at dawn, we pray for progress at dawn, we practice breath control at dawn, we respect father and mother at dawn. At dawn we invoke God, the Lord of the Vedas, the sustainer of All, and Adorable by all. We use medicinal herbs in the morning and at dawn, we try to realise the true nature of soul.

2. ఓం ప్రాత ర్జితం భగముగ్రం హువేమ
వయం పుత్ర మదితేర్ యో విధర్తా ।
ఆధ్రశ్చిద్యం మన్యమాన స్తురశ్చిద్
రాజాచిద్యం భగం భక్షీత్యాహ ॥

వాక్యార్థం :

ప్రాతః + జితం భగమ్ + ఉగ్రం హువేమ = ఈ ప్రభాత సమాయన జయశీలుడు, సర్వైశ్వర్యకర్త దుష్టులయెడ ఉగ్రుడైన సర్వాంతర్యామిని మా హృదయంలోనికి సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

వయం పుత్రమ్ + అదితేః + యః + విధర్తా = అదితి యొక్క పుత్రుని (ఆకాశము యొక్క పుత్రుని వలె భాసించు సూర్యుని) ఎవరు చక్కగా ధరించి యున్నారో ఆ సర్వాధారుని మాలోనికి ఆహ్వానించుచున్నాము.

ఆధ్రః + చిద్యం మన్యమానః + తురః + చిత్ = సర్వవిధాల ధారణ చేయతగినవాడు, మాననీయుడు శీఘ్రకారియైన పరమాత్మను ఆహ్వానించుచున్నాము.

రాజాచిత్ + యమ్ భగమ్ భక్షి + ఇతి + ఆహ = ఎవడు విశ్వప్రకాశకుడో ఐశ్వర్య ప్రదాతయో అట్టి దేవుని మేము కీర్తింతుముగాక! ఇతరులకు ఉపదేశింతుము గాక!

సరళార్థం = ఈ ప్రభాత ప్రశాంత సమయాన సదా జయశీలుడు, సర్వైశ్వర్యకర్త దుష్టులయెడ ఉగ్రుడు, ఆకాశ పుత్రుని వలె భాసించు సూర్యుని ధరించువాడు అయిన సర్వాంతర్యామిని మాలోనికి సాదరంగా ఆహ్వానించుచున్నాము. సర్వ విధాల ధారణ చేయతగినవాడు, మాననీయుడు, శీఘ్రకారి, విశ్వప్రకాశకుడు ఐశ్వర్యప్రదాత అయిన దేవదేవుని మాత్రమే మేము ఉపాసింతుము గాక! ఆ దేవుని యథార్థ స్వరూపాన్నే ఇతరులకు ఉపదేశింతుము గాక!

వివరణ : ఈ మంత్రంలో మరికొన్ని క్రొత్త పదములు వచ్చాయి. వాటిని తెలుసుకుందాము.

జితం : దేవుడు సదా జయశీలుడు. ఒకచోట సృష్టికర్త ఏమన్నాడంటే -

"అహమిన్ద్రో న పరాజిగ్య ఇద్ధనం న మృత్యవేఽవ తస్థే కదాచన

- ఋ. 10-48-5

ఓ మానవులారా! నేనెప్పుడూ పరాజయాన్ని పొందలేదు. ఒక్కసారి కూడా ఓడిపోలేదు. మృత్యువుకానీ, అపజయం కానీ నాకెప్పుడూ కలుగవు" అన్నాడు. కనుక అతడిని ఏ రాక్షసుడు ఒక్కసారి కూడా జయించలేదు.

ఉగ్రమ్ = దుష్టులయెడ అతడు ఉగ్రుడు. రాక్షసుల పాలిట రుద్రుడు.

అదితిః = దీని మూలార్థం ''రెండుగా ఖండింపనలవి కానిది'' అని. నాశరహితమైనదని భావం. అట్టివి చాలా ఉన్నాయి. వాటిని వేదం ఈవిధంగా వివరిస్తుంది –

అదితిః ద్యౌరదితి రన్తరిక్ష మదితి ర్మాతా స పితా స పుత్రః ।
విశ్వేదేవా అదితిః పంచజనా అదితి ర్జాత మదితిర్ జనిత్వమ్ ॥

– ఋ. 1–89–10

ద్యు అంతరిక్షలోకాలు, మాతా పిత పుత్రులు, సమస్త ప్రాకృతిక దేవతలు, విద్యా దేవతలు, పంచ జనులు (పంచ జ్ఞానేంద్రియాలు) వీటినన్నిటిని అదితులనవచ్చును. ఎందుచేతనంటే సృష్టి నశించేదైనప్పటికీ ప్రవాహరూపంలో అనాది. అంటే మరల మరల ఈవిధంగానే సృష్టి జరుగుతూ ఉంటుంది. ఉత్పన్నమైనవి, ఉత్పన్నం కాబోయేవి కూడా అదితులే – నాశరహితములే" అంటుంది. కనుక ఇక్కడ అదితి పుత్రుడంటే ఆకాశ పుత్రునివలె భాసించే సూర్యుడని అర్థం చెప్పబడింది. ఇట్లే వేదాలలో అదితి పదము కనబడినపుడు ఆ ప్రకరణానికి (సందర్భానికి) తగిన విధంగా అర్థం చెప్పుకోవాలని మహర్షి దయానందులవారన్నారు.

"ఆకాశంలోని సమస్త గోళాలను ధరించి నియమించి భ్రమణం చేయించే సర్వవ్యాపక సర్వాధార పరమాత్మనే మనం ఉపాసించాలి కాని, ఒక ఆకారంతో సీమిత పరిమాణం గల ఏకదేశీయుని ఉపాసించకూడదు. అట్టి దేవీదేవతలను వర్ణిస్తూ ఇతరులకు ఉపదేశించకూడదు" అని ఈ మంత్రం బోధిస్తున్నది. శ్రీ దేవీచంద్ గారు ఆంగ్లంలో ఈవిధంగా అర్థం వ్రాశారు.

At dawn we invoke the victorious Mighty Bhaga, God the only object of adoration, the creator of the sun which is situated in the atmophere and the upholder and sustainer of all, the knower of all beings, the Imperial ruler, the chastiser of evil doers. He admonshes us to worship Him so we invoke alone.

3. ఓం భగ ప్రణేతర్ భగ సత్యరాధో

భగేమాం ధియ ముద వాదదన్నః ।
భగ ప్రణో జనయ గోభి రశ్వైర్
భగ ప్రనృభిర్ నృవంతః స్యామ ॥

వాక్యార్థం :

భగ ప్రణేతః భగ సత్యరాధః = హే భగవాన్! పరమైశ్వర్యశాలీ! మమ్ము ఐశ్వర్యవంతుల మగుటకు ప్రేరేపింపుము. ఓ సత్యరాధా! సత్యధనీ! మమ్ము చక్కని సత్యమార్గమున నడుచుటకు ప్రేరేపింపుము.

భగ + ఇమామ్ ధియమ్ ఉత్ + అవ + దదత్ + నః = మా బుద్ధులను ధర్మధనమును పొంద ప్రేరేపించి మమ్ము రక్షింపుము.

భగ ప్రనః + జనయ గోభిః + అశ్వైః = ఓ భగా! ఐశ్వర్య ప్రదాత! మాకు కేవలం ధనధాన్యములనే గాక గోసంపదను, అశ్వసంపదను కూడా ప్రసాదింపుము.

భగః ప్రనృభిః నృవన్తః స్యామ = నీ కృపవలన మేము ఉత్తమ సంతానము కలవారము, ఉత్తమ నాయకులు గలవారము అగుదుముగాక!

సరళార్థము : హే భగవాన్! పరమైశ్వర్యశాలీ! మమ్ము ఐశ్వర్యవంతుల మగుటకు ప్రేరేపింపుము. మా బుద్ధులలో వసించి ధర్మమార్గాన ధనవంతులమగుటకు మమ్ము ప్రేరేపింపుము. పుణ్య కార్యాలను చేయ ప్రేరేపింపుము. కేవలం ధన ధాన్య సంపదలనేగాక, గో అశ్వాది సంపదలను, ఉత్తమ సంతాన సంపదను కూడా పొంద ప్రేరేపింపుము. నీ కృపవలన మేము ఉత్తమ నాయకులు గలవారమై, మేమును ఉత్తమ నాయకుల మగుదుము గాక!

వివరణ : ఐశ్వర్యం అంటే కేవలం రూపాయలే (కరెన్సీయే) కాదు. గో అశ్వ సంతానాదులు కూడా సంపదలే. గోవు పదము పాడి పశువులన్నిటికీ ప్రతీక. అశ్వ పదము అన్నిరకాల ప్రయాణ సాధనాలకు ప్రతీక. జన పదము సుసంతానమునకు, సన్మిత్రులకు, అక్కరకు ఆదుకొనే బంధువర్గానికి ప్రతీక. ఇవి లేకుంటే ఎంత డబ్బు ఉన్నా పెద్ద ప్రయోజనముండదు.

ధనం అవసరమే కానీ అది ధర్మమార్గాన (సుపథాన) లభించినది కావాలి. మన యోగ్యతను మించి ఆశించటం కూడా మంచిది కాదు. ఆదిశంకరులు చెప్పినట్లు –

"యల్లభసే నిజకర్మోపాత్తం విత్తం తేన వినోదయ చిత్తం ॥"

మన కష్టార్జితంగా లభించిన ధనంతో సంతృప్తిని చెందాలి. సంతృప్తిని మించిన సౌభాగ్యం లేదంటారు పెద్దలు. ఎంత ఉన్నా సంతృప్తి లేకపోతే సుఖం ఉండదు. పిసినారితనం ఉంటే ధనమున్నా దరిద్రుడౌతాడు. సంపాదించిన దానిలో కొంతైనా ధర్మకార్యాలకు వినియోగించకపోతే అభ్యుదయ నిఃశ్రేయసాలు రెండింటిని కోల్పోతాడు. కనుక ఈ మంత్రంలో అంతర్యామిని **"భగేమామ్ ధియ ముదవా దదన్నః"** అని ప్రార్థించాము. "ఓ ఐశ్వర్య ప్రదాత! ఓ సర్వాంతర్యామీ! మాకు ఉన్నతి కలుగునట్లు మా బుద్ధులను ప్రేరేపింపు"మని వేడుకున్నాము.

దయానంద మహర్షి దీనికి భావార్థం వ్రాస్తూ – "మానవులు భగవంతుని ప్రార్థించేటప్పుడూ, విద్వాంసులను సేవించేటప్పుడూ మాకు సదా సద్బుద్ధిని, సజ్జన సాంగత్యాన్ని ప్రసాదించుమని కోరుకోవా"లన్నారు.

O Bhaga; (God, the only object of adoration) Thou art the leader of all beings and O Bhaga; (God, the only object of adoration) Thou art Lord of all eternal substances, please confer on us the supreme wisdom and shield us form danger. O Bhaga; (God, the only object of adoration) please augment our earthly possession by bestowing on us kine and horses and O Bhaga; (God the only object of adoration) let us become rich in men and heroes.

4. **ఓం ఉతేదానీం భగవంతః స్యామ**
ఉత ప్రపిత్వ ఉత మధ్యే అహ్నామ్ ।
ఉతోదితా మఘవన్ త్సూర్యస్య
వయం దేవానాం సుమతౌ స్యామ ॥

వాక్యార్థం :

ఉత + ఇదానీమ్ భగవంతః స్యామ = హే భగవాన్! ఈ ప్రాతః సమయంలో మేమును భగవంతుల మగుదుము గాక! ఐశ్వర్యవంతుల మగుదుము గాక! దైవీ సంపదను పొందుదుముగాక!

ఉత ప్రపిత్వే + ఉత మధ్యే అహ్నామ్ = పూర్వాహ్నము, మధ్యాహ్నము,

అపరాహ్నములలో కూడా దైవీసంపదలను పొందుదుము గాక!

ఉత + ఉదితా మఘవన్ + తు + సూర్యస్య = హే మఘవన్! ఉత్తమ ధనయుక్త పరమేశ్వరా! ఈ సూర్యోదయ సమయాన ....

వయం దేవానాం సుమతౌ స్యామ = విద్వాంసుల, సాధుమహాత్ముల, సుమతుల అంటే సత్సంగాల గడిపి విద్యాజ్ఞానాదులను పొందుదుముగాక! నూతనోత్సాహమును పొందెదము గాక!

సరళార్థం : హే మఘవన్! సకలైశ్వర్య ప్రదాతా! మేము ఈ ప్రభాత ప్రశాంత ఉపాసనా కాలంలోనూ, పూర్వాహ్న, మధ్యాహ్న, అపరాహ్న కాలాల్లోనూ రోజంతా దైవీసంపదతో వర్ధిల్లునట్లు అనుగ్రహింపుము. ఉదయించే సూర్యుని చూస్తూ మేమును ఉన్నతిని పొందుదుముగాక! దేవతల సుమతులలో – దివ్యగుణయుక్తులైన సాధుమహాత్ముల సత్సంగాలలో గడుపుదుము గాక! అట్టివారు ఆ సమయమున లభించకున్న మహర్షుల గ్రంథాల స్వాధ్యాయంలో గడుపుదుముగాక!

వివరణ = ఈ మంత్రాలలో క్రొత్తగా భగవంతుని 'మఘవన్!' పేరుతో సంబోధించబడింది. 'మఘమ్' అంటే కూడా ధనమనియే అర్థం. ధనం కలవారిని 'మఘవన్' 'మఘవాన్' అనవచ్చు. పరమేశ్వరుడు ధనవంతులందరికన్న గొప్ప ధనవంతుడు కనుక అతడు శ్రేష్ఠమఘవన్. "నిధీనాం నిధిపతిం హవామహే" అంటుంది యజుర్వేదం (23–19).

యాస్క మహర్షి వేదవేదములకు చక్కటి నిఘంటుకోశాన్ని, నిరుక్తాన్ని రచించి తరతరాలకు గొప్ప మేలు చేశారు. వేదార్థాన్ని తెలుసుకోవాలంటే వాటిని అధ్యయనం చెయ్యక తప్పదు. మధ్యకాలంలో మరుగున పడిపోయిన వాటిని మహర్షి దయానందుల వారు పునరుద్ధరించారు. 'వేదాంగ ప్రకాశ్' అనే పేరుతో ఒక బృహత్ గ్రంథం కూడా వ్రాశారు. ఆర్ష సాహిత్య మండలి – అజ్మీర్ వారు దానిని 14 భాగాలుగా ప్రచురించారు. అందులోని ఒక భాగమైన నిఘంటువును మన తెలుగువారికి మేలుచేయ కీ.శే. శ్రీ ఆరమండ్ల వెంకయ్య ఆర్యగారు అనువదించి ప్రచురించారు. అట్టి నిఘంటువులో ధనానికి పర్యాయపదాలుగా 28 పేర్లు పేర్కొనబడ్డాయి.

1. మఘమ్, 2. రేక్ణః, 3. రిక్థమ్, 4. వేదః, 5. వరివః, 6. శ్వాత్రమ్, 7. రత్నమ్, 8. రయిః, 9. క్షత్రమ్, 10. **భగః,** 11. మీళ్హా + మీళ్హమ్, 12. గయః,

13. నృమ్ణమ్, 14. ద్యుమ్నమ్, 15. తనా, 16. బంధుః, 17. ఇన్ద్రియమ్, 18. వసు, 19. రాయః, 20. రాధః, 21. భోజనమ్, 22. మేధా, 23. యశః, 24. బ్రహ్మ, 25. ద్రవిణమ్–శ్రవః, 27. వృత్రమ్ (ఋతమ్, విత్తమ్–అని పురాణాలలో), 28. వృతమ్. ఇతి ధన నామః. అంటే– వేదాలలో ధనం గురించి 28 రకాల పదములు ప్రయోగింపబడ్డాయి. వీటి వివరాలు నిరుక్తశాస్త్రంలో ఉంటాయి.

ధనం ఎంత అవసరమో ఈ మంత్రం ఎంత చక్కగా వివరించిందో చూడండి. దినంలో ప్రాతః పూర్వాహ్న మధ్యాహ్న అపరాహ్నలలోనూ, దినమంతా ధనం అవసరమే నంటున్నది. అందుకనే "ధనం లేనిది క్షణం గడవ" దంటారు పెద్దలు. ముందుగా మనిషి స్వయం పోషకుడు కావాలి. పరాన్నభుక్ కాకూడదు. అందుచేతనే వేదం పలుచోట్ల సోమరితనాన్ని నిరసిస్తుంది. **'అకర్మణ్యా దస్యుః'** – సోమరి దస్యుడు – దుష్టుడవుతాడని కూడా అంటుంది. తస్మాత్ జాగ్రత్త.

మను మహర్షి ఎంత చక్కటి నీతి చెప్పారో చూడండి –

శ్లో॥ బ్రహ్మే ముహూర్తే బుధ్యేత ధర్మార్థౌ చానుచిన్తయేత్ ।
కాయక్లేశాంశ్చ తన్మూలాన్ వేదతత్త్వార్థమేవ చ ॥ – మనుస్మృతి. 4–92

బ్రహ్మీ ముహూర్తంలో (సుమారు 4 గంటలకు) నిద్రలేచి ముందుగా దైవప్రార్థన, ఆత్మ పరమాత్మల చింతన, ఉపాసన మొదలైన ధర్మకార్యాలు ఆచరించాలి. అనంతరం తన ఆర్థిక పరిస్థితి ఏమిటి? తన అవసరాలు ఏమిటి? కొంతైనా దాన ధర్మాలకు వినియోగించి పుణ్యం సంపాదించుకోవాలి కదా! లేకుంటే మరుజన్మ మంచిజన్మ ఎలా వస్తుంది? అని ఆలోచించాలి. అనంతరం శరీర పరిస్థితి ఏమిటి? ఏ ఆహార పానీయ ఔషధాలు అవసరం? ఏ వ్యాయామ ప్రాణాయామాలు అవసరం అనేది కూడా దృష్టిలో పెట్టుకోవాలి. వీటన్నిటికీ వేదం పరిష్కార మార్గాలు సూచిస్తుంది. కనుక వేద స్వాధ్యాయం, వేద తత్త్వార్థ చింతన కూడా చేయాలంటారు మనుమహర్షి. అస్తు – మనం అట్లే చేద్దాం.

O Noble pure God, may prosperity be ours at present, in future and during the day time! May we, O Bounteous Lord, at the rising of the sun, be happy, in the wake of excellent wisdom of the learned.

5. **ఓం భగ ఏవ భగవానస్తు దేవా**
స్తేన వయం భగవంతః స్యామ ।
తం త్వా భగ సర్వ ఇజ్జోహవీతి
స నో భగ పుర ఏతా భవేహ ॥ - ఋగ్వేదం 7-14-1 నుండి 5

వాక్యార్థం :

భగః + ఏవ భగవాన్ + అస్తు దేవాః = హే భగవాన్! సకల ఐశ్వర్యయుక్త పరమేశ్వరా! నీ కృపవలన మేము దివ్యగుణాలతో దేవతల మగుదుముగాక!

తేన వయం భగవంతః స్యామ = నిన్ను ఉపాసించటంవల్లా, నీ ఆజ్ఞాపాలన చేయటంవల్లా మేము ఐశ్వర్యవంతుల మగుదుము గాక!

తమ్ + త్వా భగ సర్వః + ఇత్ + జోహవీతి = నీవు భగవంతుడవు (సకలైశ్వర్య ప్రదాతవు) కనుకనే సర్వజనులు నిన్ను స్తుతిస్తారు. ప్రార్థిస్తారు. అగ్నిలో ఆహుతులిస్తారు.

సః + నః + భగ పుర ఏతా భవ + ఇహ = అట్టి నీవే మాకు మార్గదర్శకుడవై మమ్ము నడిపింపుము.

సరళార్థం = హే భగవాన్! సకలైశ్వర్యయుక్త పరమేశ్వరా! నీ కృపవలన మేము దివ్యగుణాలతో దేవతలమగుదుము గాక! నిన్నుపాసించుటవల్ల మేము సంపన్నుల మగుదుము గాక! నీవు భగవంతుడవు - సకలైశ్వర్య ప్రదాతవు కనుకనే జనులంతా నిన్నే స్తుతిస్తారు. ప్రార్థిస్తారు అగ్నిహోత్రంలో ఆహుతులిస్తారు. అట్టి నీవే మాకు మార్గదర్శకుడవై మమ్ము సుపథాన నడిపింపుము. ఐశ్వర్యవంతులను, దివ్యగుణ సంపన్నులను చేయుము.

వివరణ = సృష్టికర్తయైన దేవుడే సర్వైశ్వర్యకర్త, ఐశ్వర్య ప్రదాత కూడా. అందుకనే ఈ మంత్రం **"భగ ఏవ భగవాన్ అస్తు -** నీవే ఐశ్వర్య స్వరూపుడవై ఉన్నావు" అంటున్నది. అయితే ఆ భగవంతుని ప్రార్థించినవారంతా ఐశ్వర్యవంతులు కాలేకపోతున్నారు కదా! దేవునికి పక్షపాతమా? పక్షపాతం చూపేవాడు దేవుడెట్లవుతాడు? దానికి వేదం చెప్పే సమాధానం ఏమంటే - **"ఐశ్వర్యం పురుషార్థం వల్లా, పుణ్యకర్మల వల్లా వస్తుందేకాని కేవలం ప్రార్థనవల్ల కాదు"** అంటుంది.

"అక్షైర్ మా దీవ్యః కృషిమిత్ కృషస్వ
విత్తేరమస్వ బహూ మన్యమానః" - ఋగ్వేదం 10-34-13

"ఓ మానవులారా! మీరు సోమరులై పాచికలాడవద్దు. లాటరీలలో, షేరుమార్కెట్లలో, పందాలలో లక్షలు కోట్లు గడించాలని ఆశించవద్దు. వ్యవసాయదారునివలె కష్టించి అనంతరం ప్రార్థించండి" అంటుంది. పూర్వ జన్మలలో చేసిన పుణ్యకర్మల వలననే భాగ్యవంతుల యింట పుడుతున్నారంటుంది.

ప్రారంభంలో చెప్పుకున్నట్లుగా 'భగం' అంటే కేవలం ధన కనక వస్తు వాహనాలే కాదు. దైవీ గుణాలు కూడా సంపదలే. కర్మయోగియైన మన శ్రీకృష్ణుడు ఏవేవి దైవీసంపదలో చక్కగా వివరించి చెప్పాడు.

శ్లో॥ అభయం సత్త్వ సంశుద్ధిః జ్ఞానయోగవ్యవస్థితిః ।
దానం దమశ్చ యజ్ఞశ్చ స్వాధ్యాయః + తప ఆర్జవమ్ ॥

తా॥ నిర్భయత్వం, అంతఃకరణశుద్ధి, తాను జీవాత్మనే కాని శరీరం కాదు అనే జ్ఞానయోగంలో స్థిరంగా ఉండటం, సాత్త్విక దానం, ఇంద్రియ నిగ్రహం, పంచమహాయజ్ఞాలు చెయ్యటం, వేద స్వాధ్యాయం, నిజాయితీగా జీవించటం, ఇంకా...

శ్లో॥ అహింసా సత్య మక్రోధః + త్యాగః శాంతి రపైశునమ్ ।
దయా భూతేష్వలోలుప్త్వం మార్దవం హ్రీ రచాపలమ్ ॥

తా॥ మనో వాక్కాయాలతో అకారణంగా ఎవరినీ హింసించకపోవటం, సత్యం పలకటం, ఎవరిపైనా వైరభావం (ద్వేషభావం) లేకుండటం, వీలైనంత ఎక్కువగా త్యాగం చెయ్యటం, శాంతంగా ఉండటం, అపైశునమ్ (ఎవరినీ నిందించకుండటం), తోటి ప్రాణులపై దయ కలిగి ఉండటం, చెడు పనులు చేయటానికి సిగ్గుపడటం, కాలాన్ని వ్యర్థంగా గడపక సద్వినియోగం చెయ్యటం. ఇంకా.....

శ్లో॥ తేజః క్షమా ధృతిః శౌచమ్ అద్రోహో నాతిమానితా ।
భవంతి సంపదం దైవీమ్ అభిజాతస్య భారత ॥ - భగవద్గీత 16-1 నుండి 3

ఓ భరతశ్రేష్ఠా! అర్జునా! పై వాటితోబాటు బ్రహ్మచర్య తేజస్సు, క్షమ, ధైర్యం,

పరిశుభ్రత, ఎవరికీ ద్రోహం చెయ్యకపోవటం, గర్విష్టి కాకుండటం మొదలైన గుణాలన్నీ దైవీ సంపదలు. ఇవి మనకు ఇహ పర సుఖశాంతులను కలిగిస్తాయి. అంతేగాక, సంస్కారరూపంలో ఇవి మనవెంట మరుజన్మలో కూడా వస్తాయి" అంటాడు. ఇంతేకాక **"దైవీ సంపద్ + విమోక్షాయ నిబంధాయ + అసురీ మతా"** (భగవద్గీత 16–5)" ఈ దైవీ సంపదలే మిమ్ము సమస్త దుఃఖాలనుండి విడిపిస్తాయి. వీటికి వ్యతిరేకమైనవన్నీ అసురీ సంపదలు. అవన్నీ త్రివిధ దుఃఖాలతో కూడిన ఈ సంసార చక్రంలో బంధిస్తాయి" అంటాడు. కనుక అంతర్యామిని ఉపాసిస్తూ దైవీసంపదలను పొంద యత్నించాలి. అప్పుడే మనం "తేన వయం భగవంతః స్యామ" = నిన్ను ఉపాసించి మేమును నీవంటి వారము అగుదుము గాక! అనుకోవాలి.

O learned person, God verily is supreme. May we become supreme through Him. O God, all invoke Thee. O supreme God, be Thou our leader in this world.

ఈ భగసూక్తంలో మొత్తం 7 మంత్రాలున్నాయి. వాటిలో నుండి పైన చెప్పిన 5 మంత్రాలతో నిద్రలేవగానే ప్రార్థన చేసుకుంటే సరిపోతుందని మహర్షి దయానందుల వారన్నారు. మిగిలిన రెండు మంత్రాలలో ఉషస్సుల విశేషత, మహిమలు తెలుపబడ్డాయి. ఉషస్సులంటే – సంధ్యా సమయంలో సూర్యోదయానికి ముందు వచ్చే వెలుగు. ఇది చాలా ఆరోగ్యకరమైనది. ఆ సమయంలో ఊరిబయట విహరిస్తే, భ్రమణం (నడక) చేస్తే చాలా లాభాలు కలుగుతాయని వేదం చెబుతుంది. ఆ లాభాలు వివరించటానికి కొన్ని ఉషః సూక్తాలు కూడా ఉన్నాయి. సందర్భం వచ్చింది కనుక ఆ రెండు మంత్రాలను కూడా సంక్షిప్తంగా తెలుసుకుందాము.

ఓం సమధ్వరాయోషసో నమన్త
దధిక్రావేవ శుచయే పదాయ ।
అర్వాచీనం వసువిదం భగం నో
రథమివాశ్వా వాజిన ఆ వహన్తు ॥ – ఋగ్వేదం 7–41–6

వాక్యార్థం :

సమ్ + అధ్వరాయ ఉషసః నమన్త = ప్రభాత ఉషస్సులు సత్త్వ గుణయుక్తములు.

అప్పుడు ప్రాణులన్నీ నమ్రములుగా – హింసాభావ రహితంగా ఉంటాయి. సత్త్వగుణంతో ఉంటాయి.

దధి క్రావేవ శుచయే పదాయ = అవి వేగవంతమైన అశ్వాలవలె ఉంటాయి.

అర్వాచీనమ్ + వసు + విదమ్ భగం నః = అవి మాకు పెక్కు ప్రాకృతిక సంపదలిచ్చునవి అగునుగాక!

రథమివ + అశ్వాః వాజిన ఆ వహన్తు = వేగవంతమైన అశ్వాలు రథాన్ని వేగంగా తీసుకుపోవునట్లు అవి మమ్ము మా లక్ష్యాలను చేర్చునుగాక!

సరళార్థం = ప్రభాత ఉషస్సులు వేగవంతమైన గుఱ్ఱాల వంటివి. అవి నమ్రములై మన అందరకు అనుకూలంగా ఉంటాయి. మన రమణీయ జీవన రథాన్ని మన లక్ష్యం వైపు వేగంగా తీసుకు వెడతాయి.

Dawns like a disciplined horse, incline us to acquire a pure, desirable non-voilent conduct. As strong steeds draw a chariot, may they remind us the presence of the Mighty God, the Lord of riches.

ఓం అశ్వావతీ ర్గోమతీర్న ఉషాసో వీరవతీః
సదముచ్ఛన్తు భద్రాః ।
ఘృతం దుహాన విశ్వతః ప్రపీతా యూయం
పాత స్వస్తిభిః సదానః ॥ – ఋగ్వేదం 7-41-7

వాక్యార్థం : ఇది మహిళామణులకు ప్రత్యేకంగా ఉపదేశం :

అశ్వావతీః గోమతీః + నః వీరవతీః = ఓ విదుషీ మహిళలారా! ఏవిధంగా అశ్వములవలె వ్యాపించు ఉషస్సులు కళ్యాణప్రదములో, వీరవంతములో – శక్తిప్రదములో ఆవిధంగా మీరు కూడా లోక కళ్యాణకరులు కండు. వీర పుత్రులను కని లోకానికి మేలు చేయండి.

సదమ్ + ఉచ్ఛన్తు భద్రాః = ఉషస్సులవలె మీరు మా సభలను ప్రకాశ పరచండి.

ఘృతమ్ దుహానా విశ్వతః ప్రపీతా = ఘృతమును పూర్ణపరచుచు అన్నివిధాల మమ్ము తృప్తి పరచండి.

మహర్షి దయానందుల వారు ఈ మంత్రంలోని ఘృత పదమునకు 'శుద్ధం ప్రదీప్త ముదకమ్ – ఘృత మిత్యుదక నామ నిఘంటువు (1-12)" అని

వ్రాశారు. అప్పుడు ఈ వాక్యం 'శుద్ధ జలాన్ని' అనియును అర్థం చెప్పుకోవచ్చు.

యూయం పాత స్వస్తిభిః సదా నః = మీరు సదా మాకు స్వస్తులను (శుభములను) కలిగించుచు రక్షించండి.

సరళార్థం : ఓ విదుషీ మహిళలారా! ఏవిధంగా అశ్వాలవలె లోకంపై ప్రసరించు ఉషస్సులు కళ్యాణకరములు, శక్తిప్రదములో ఆవిధంగా మీరు కూడ లోక కళ్యాణం చెయ్యండి. మీ విద్యలతో మా సభలను ప్రకాశపరచండి. శుద్ధజలమువలె మమ్ము తృప్తి పరచండి. మీరు మాకు సదా శుభములను కలిగించండి.

వివరణ : ఈ చివరి రెండు మంత్రాలలో ప్రభాత ఉషస్సులు ఆరోగ్యకరములు. సత్త్వ గుణ ప్రేరకములు, ఆనందకరములు, జీవిత లక్ష్యాన్ని ప్రేరేపించేవి అని చెప్పబడింది. వాటిని ఉపమానంగా చెబుతూ ఆవిధంగా విదుషీ మహిళలు లోకానికి మేలు చేయాలని ప్రబోధించబడింది. ఉషస్సుల గురించి తెలుసుకోవలసింది చాలా ఉంది. నా రచన 'వేదాలలో సూర్యకిరణ చికిత్స' లోని ఉషోదయ వైశిష్ట్యం చదవండి.

O learned ladies, just as Dawns, full of nice cold water, and manifold beams, awakeners of heroic persons; auspicious; bestowers of pure water, advancing magnificiently from all sides, dawn on our assembly, so should ye adorn our assembly and preserve us evermore with your health giving joys.

ఈ రెండు మంత్రాలు ఉషస్సుల గురించినవి కనుక నిద్రలేవగానే ఈ భగసూక్తంలోని మొదటి 5 మంత్రాలతో సృష్టికర్తను స్మరించి ప్రార్థన చేసుకుంటే సరిపోతుంది.

నిద్రలేవగానే "ప్రాతరగ్నిం....." అంటూ దహించే గుణం గల అగ్నిని తలచుకోవటమేమని సందేహించకండి. ఆ మంత్రార్థంలోని 'అగ్ని' పద వివరణ మరొకమారు చదివి ఇది ఆధ్యాత్మిక ప్రకరణం కనుక ఇక్కడ అగ్ని అంటే 'జ్ఞాన ప్రకాశక' అంతర్యామిగా భావిస్తూ స్మరించుకోండి. ప్రాతః స్మరణాన్ని గురించి లోకంలో కొన్ని నమ్మకాలున్నాయి. ఇక మనం వాటిలోని నిజానిజాలను గురించి ఆలోచిద్దాము.

కొన్ని నమ్మకాలు - నిజానిజాలు

1. భగసూక్తం - సాయణాచార్యుల వారి అభిప్రాయం :

శ్రీ సాయణాచార్యుల వారు వేదాంగాలు చదువుకోకపోయినా సామాన్య సంస్కృత జ్ఞానంతో 4 వేదాలకు భాష్యం వ్రాశారు. ఆనాడు లోకంలో వేదాల విషయంలో ప్రజలలో ఉన్న అభిప్రాయాలను, వైదిక కర్మకాండలోని యాజ్ఞిక పశుహింసను సమర్థిస్తూ భాష్యం వ్రాశారు. ఆనాడు వేదాంగాలతో కూడిన వేదాలు చదివిన గట్టి పండితులు లేకపోవుటచే వారి భాష్యమే బహుళ ప్రచారం పొందింది. విదేశీ విద్వాంసులు కూడా దానినే ప్రమాణంగా తీసుకొని ఆంగ్లంలో భాష్యాలు వ్రాశారు. మహర్షి దయానందులవారు శాస్త్రార్థాలతో వారి కళ్ళు తెరిపించేవరకు ఆ పరంపర అట్లే నడిచింది. వారు ఈ భగసూక్తం ప్రారంభించేముందు ఈ సూక్త మహాత్మ్యాన్ని ఈవిధంగా కొనియాడారు – **"అత్ర కేచిదాహుః నివేష్టుకామో రోగార్తో భగంసూక్తం జపేత్సదా – నివేశం విశతి క్షిప్రం రోగైశ్చ పరిముచ్యతే"** – అంటే ఈ భగసూక్తాన్ని జపిస్తూ ఉంటే కోరికలన్నీ నెరవేరతాయనీ, రోగాలన్నీ విడిపోతాయని భావం. అది ఆనాటి ప్రజల నమ్మకం. కాని, దీనిని అర్థభావనతో జపించి ఆ రకంగా జీవితాన్ని గడిపితేనే ఆ లాభాలు కలుగుతాయని మనం అర్థం చేసుకోవాలి.

2. ప్రభాత కరదర్శనం :

నిద్ర లేవగానే భగవంతుణ్ణి స్మరిస్తూ నెమ్మదిగా కండ్లు తెరిచి కుడి అరచేతిని చూడాలని ఒక నమ్మకం. ఆవిధంగా చూస్తూ ఈ క్రింది శ్లోకం నెమ్మదిగా పఠించాలంటారు.

శ్లో॥ కరాగ్రే వసతే లక్ష్మీః, కరమధ్యే సరస్వతీ ।
కరపృష్ఠే చ గోవిందః ప్రభాతే కరదర్శనమ్ ॥

ఈ శ్లోకం ఏవో పురాణాలలోనిది. చేతి మూలంలో లక్ష్మీదేవి, అరచేతి మధ్యలో సరస్వతీదేవి వసిస్తారనీ, చేతుల వెనుక గోవిందుడు వసిస్తాడనీ, కనుక కరదర్శనం చెయ్యాలనీ దీని భావం.

లక్ష్మీ సరస్వతులు వేరువేరు మూర్తులు కారు. ఐశ్వర్యానికి లక్ష్మీ, చదువుకు వ్రాతకు సరస్వతి ప్రతీకలు. వాటిని పొందటానికి చేతుల యొక్క సహకారం చాలా అవసరం. సామాన్య జీవితం గడపటానికి కూడా చేతులే ఎక్కువ అవసరం. కనుక ప్రభాత కరదర్శనం చేయటంలో దోషం లేదు. రెక్కాడితేగాని డొక్కాడదని

పేదలూ, తాతల ఆస్తులు ఏమీ లేవు; నా రెక్కల కష్టంతోనే పిల్లలను పెంచి పెద్దచేసి ఈ కొద్దిపాటి ఆస్తిపాస్తులను సంపాదించుకోగలిగానని మధ్య తరగతివారు అంటూ ఉంటారు కదా! అయితే కరదర్శనం చేసేటప్పుడు అందుకు తగిన వేదమంత్రాలు పఠించటం ఉత్తమం. వేద మంత్రాలలో ఉన్నంత ప్రేరక భావాలు సామాన్య శ్లోకాలలో ఉండవు. అందుకు ఉదాహరణంగా రెండు మంత్రాలను తెలుసుకుందాము -

ఓం కృతం మే దక్షిణే హస్తే, జయోమే సవ్య ఆహితః ।
గోజిద్ భూయాస మశ్వజిద్ ధనంజయో హిరణ్యజిత్ ॥

- అథర్వవేదం 7-50-8

"పురుషార్థం నా కుడిచేతిలో ఉండగా, జయం నా ఎడమచేతికి అందటంలో సందేహమేముంది? నేను గో సంపదను, అశ్వ సంపదను పొందుదును గాక! వివిధ రకాల ధనాలను, కనక రత్న మణిమాణిక్యాది ఆభరణాలను పొందుదును గాక!" అనుకుంటూ కరదర్శనం చెయ్యవచ్చు.

ఈ మంత్రంలోని "గోజిద్" పదము పాడి పశువులన్నిటికి ప్రతీక. 'అశ్వజిత్' పదము వాహనాలన్నిటికి ప్రతీక. ఈ మంత్రం గురించి వ్రాస్తే ఒక పుస్తకమే అవుతుంది. వ్యాకరణ విద్వాంసులైతే ఈ మంత్రంపై గంటల తరబడి వ్యాఖ్యానించగలరు. ఇంత గొప్ప భావం, ప్రేరణ పురాణ శ్లోకంలో ఏముంది?

మరొక వేదమంత్రం.

ఓం "అయం మే హస్తో భగవాన్ అయం మే భగవత్తరః ।
అయం మే విశ్వ భేషజో ఽయం శివాభి మర్శ నః ॥

- అథర్వవేదం 4-13-6

నా ఈ హస్త భగవాన్ - ఐశ్వర్య సంపన్నమైనది. నా రెండవ హస్తం అంతకన్నను గొప్పది. నా ఈ రెండు చేతులు విశ్వభేషజాలు - అన్నిరకాల భౌతిక, సామాజిక, నైతిక ఆధ్యాత్మిక రోగాలన్నిటికీ భేషజాలు. వాటిని పోగొట్టగల శక్తి సంపన్నములు. నా ఈ చేతులు విశ్వకళ్యాణకరములు" అనుకుంటూ కూడా కరదర్శనం చెయ్యవచ్చు.

అయితే, కరదర్శనం చేసేముందు మనకు ఉత్తమోత్తమమైన మానవ దేహాన్నీ, ఎన్నెన్నో కార్యాలను చేయగల చేతులను నిర్మించి యిచ్చిన సృష్టికర్తను స్మరించటమే

మన మొదటి కర్తవ్యం. అందుకు ఈ భగసూక్తంలోని మొదటి 5 మంత్రాలు ఎక్కువ అనుకూలం. అనంతరం కరదర్శనం చేస్తూ పై రెండు మంత్రాలతో సంకల్పం చేసుకోవచ్చు.

3. మహాపురుషుల, గురువుల సంస్మరణ :

ప్రాతఃస్మరణీయులు మనకు చాలామంది ఉంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, విద్యాబుద్ధులు చెప్పిన గురువులు, మహాత్ములు, మహాపురుషులు, ఆదరించిన బంధుమిత్రులు మొదలగువారు చాలామంది ఉంటారు. కానీ, ప్రథమస్థానం వీరందరికీ జన్మనిచ్చిన భగవంతునికే యివ్వాలి. కనుక, ఈ భగసూక్త మంత్రాలతో ప్రాతఃస్మరణమ్ చేయటమే సర్వోత్తమం.

4. ఆది శంకరాచార్యుల వారి అభిప్రాయం :

వీరు ముందుగా ఆత్మతత్త్వాన్ని స్మరించాలంటారు. ఉదాహరణకు కొన్ని శ్లోకాలు –

శ్లో॥ ప్రాతః స్మరామి హృది సంస్ఫుర దాత్మ తత్త్వమ్ ।
సచ్చిత్సుఖం పరమహంస గతిం తురీయమ్ ।
యత్స్వప్న జాగర సుషుప్తి మవైతి నిత్యం ।
తద్బ్రహ్మ నిష్కళమహం న చ భూతసంఘః ॥

శ్లో॥ ప్రాతర్భజామి మనసా వచ సామ గమ్యమ్
వాచో విభాన్తి నిఖిలా యదను గ్రహేణ ।
యన్నేతిన్నేతి వచర్నిగమా ఆ వోచుః
తం దేవదేవ మజ మచ్యుత మాహురగ్ర్యాః ॥

వీరి ప్రాతఃస్మరణ శ్లోకాలు కొన్ని బాగానే ఉన్నాయి కానీ కొన్ని నవీన అద్వైతానికి కలుపుతూ "బ్రహ్మ సత్యం జగన్మిథ్యా; జీవో బ్రహ్మైవ నాపరః" అనే భావానికి కలుపుతున్నాయి. అందుకనే మా మిత్రుడు ఒకాయన "అద్వైతం అంటే చెప్పేవానికి, వినేవానికి అర్థం కానిది" అనేవారు. ఈ నవీన వేదాంతాన్ని వేదం అంగీకరించదు. కనుక వేదమంత్రాల ద్వారానే పరమాత్మ తత్త్వాన్ని – జీవాత్మ తత్త్వాన్ని స్మరించటం ఉత్తమం.

సృష్టి అంతా 3 తత్త్వాలతో కూడి ఉన్నదని వేదం చాలా స్పష్టంగా చెబుతుంది.

అట్టి మంత్రాలు అనేకం ఉన్నాయి. వాటిలో ఒకటి -

ఓం బాలాదేకమ్ + అణీయస్కం + ఉత + ఏకం నేవ దృశ్యతే ।
తతః పరిష్వ జీయసీ దేవతా సా మమ ప్రియా ॥

- అథర్వవేదం 10-8-25

"సృష్టిలోని ఒక తత్త్వం వెంట్రుక మొనకన్నను సూక్ష్మమైన పరమాణువులతో కూడియున్నది. అదే ప్రకృతి తత్త్వం - సత్వ రజ తమస్సులనబడే అత్యంత సూక్ష్మ పరమాణువులు. దానికన్నను సూక్ష్మతత్త్వం మరొకటి ఉన్నది. అది ఎలక్ట్రానిక్ మైక్రోస్కోప్‌కు కూడా కనబడనిది. అదే జీవతత్త్వం. ఆ జీవతత్త్వం కంటె ఇంకను సూక్ష్మమైనది మరొకటున్నది అదే పరమాత్మతత్త్వం. అది అన్నిటిని కౌగలించుకొని అన్నిటి లోపలా వెలుపలా వ్యాపించి యున్నది." ఆ సర్వవ్యాపక పరమాత్మయే నాకు అత్యంత ప్రియమైనది. అదే నాకు కావాలి" అంటూ ప్రార్థించమంటుంది వేదం. మనం వివేకవంతులమై సృష్టికర్త మాట వినటమే ఉత్తమం.

రామకృష్ణాది మహాపురుషులను, మహర్షులను స్మరించవచ్చును కాని వారంతా సృష్టికర్త తరువాతనే. మధ్యకాలంలో పుక్కిట పురాణాలు పుట్టుకువచ్చి అనేక దేవీ దేవతల కల్పన జరిగింది. అన్నిటికీ వేరువేరు షోడశోపచార పూజలు, సుప్రభాతాలు కూడా వ్రాస్తున్నారు. వారినే సృష్టికర్తలుగా కూడా కీర్తిస్తున్నారు. మిగిలిన దేవీదేవతలంతా వారికి సహాయకులు, సేవకులు అంటున్నారు. మనవలెనే వారికిని భార్యాపిల్లలను, బంధుత్వాలను, ఇంద్రియ భోగాలను కామకేళిని కల్పిస్తున్నారు. మరి, సృష్టికర్త లెంతమంది ఉంటారు? అనేకమంది ఉంటే పరస్పర కలహాలు, ఆధిపత్యాల కోసం పోరాటాలు తప్పవు కదా! ఆలోచించండి.

వేదం ఏకేశ్వరవాదాన్నే ప్రతిపాదిస్తున్నది. పుస్తక ప్రారంభంలో చెప్పినట్లుగా - "న ద్వితీయో న తృతీయో..... అంటూ అనేకేశ్వరవాదాన్ని ఖండిస్తుంది. ఆ ఏక తత్త్వానికే అనేక దివ్యగుణాలుండటంవల్ల అనేక పేర్లు చెప్పబడ్డాయి. పేరుకొక ఆకారం, పేరుకొక సంసారం, పేరుకొక చరిత్ర కల్పించడం మంచిదికాదు. హిందూ సమాజాన్ని ఛిన్నాభిన్నం చెయ్యటం అసలు మంచిదికాదు. ఇప్పటినుండైనా రకరకాల సుప్రభాతాలు, వ్రతకల్పాలు, నైవేద్యాలు, కళ్యాణాలు విరమించి హిందువులమని వ్యవహరింపబడే మనమంతా సృష్టికర్త చెప్పిన వేదమార్గాన్ని అనుసరిద్దాం, రండి. వైదిక సుప్రభాతంతో ప్రారంభించి మన ఆధ్యాత్మిక దినచర్యనంతా వేదమార్గంలోనే గడుపుకుందాం. మహర్షి దయానందుల వారు సంకలనం చేసిన వైదిక దినచర్యను అనుసరిద్దాం. అప్పుడు మన సంస్కృతీ సభ్యతలు వైజ్ఞానికము, యుక్తిసంగతము, తర్కసంగతము అవుతాయి. ప్రపంచ

భగసూక్తమ్ - ప్రాతః స్మరణ సూక్తమ్

1. ఓం ప్రాత రగ్నిం ప్రాత రింద్రం హవామహే
ప్రాత ర్మిత్రా వరుణా ప్రాత రశ్వినా
ప్రాత ర్భగం పూషణం బ్రహ్మణస్పతిం
ప్రాతః సోమ ముత రుద్రం హువేమ. - ఋ. 7-41-1

2. ఓం ప్రాత ర్జితం భగ ముగ్రం హువేమ
వయం పుత్ర మదితేర్ యో విధర్తా
ఆధ్ర శ్చిద్యం మన్యమాన స్తురశ్చిద్
రాజాచిద్యం భగం భక్షీత్యాహ. - ఋ. 7-41-2

3. ఓం భగ ప్రణేతర్ భగ సత్యరాధో
భగేమాం ధియ ముదవాదదన్నః
భగ ప్రణో జనయ గోభిరశ్వైర్
భ ప్రనృభిర్ నృవంతః స్యామ. - ఋ. 7-41-3

4. ఓం ఉతేదానీం భగవంతః స్యామ
ఉత ప్రపిత్వ ఉత మధ్యే అహ్నామ్
ఉతోదితా మఘవన్ త్సూర్యస్య
వయం దేవానాం సుమతౌ స్యామ. - ఋ. 7-41-4

5. ఓం భగ ఏవ భగవా నస్తు దేవా
స్తేన వయం భగవంతః స్యామ
తం త్వా భగ సర్వ ఇజ్జోహవీతి
స నో భగ పుర ఏతా భవేహ. - ఋ. 7-41-5

6. ఓం సమధ్వరాయోషసో నమన్త
దధిక్రావేవ శుచయే పదాయ ।
అర్వాచీనం వసువిదం భగం నో
రథమివాశ్వా వాజిన ఆ వహన్తు ॥ - ఋ. 7-41-6

7. ఓం అశ్వావతీ ర్గోమతీర్న ఉషాసో వీరవతీః
సదముచ్ఛన్తు భద్రాః ।
ఘృతం దుహాన విశ్వతః ప్రపీతా యూయం
పాత స్వస్తిభిః సదానః ॥ – ఋ. 7-41-7

ఓ మానవా! దేవదేవుని గుణగణాలు కీర్తించు

ఓం అర్వాచీనం సు తే మన ఉత చక్షుః శతక్రతో ।
ఇన్ద్ర కృణ్వంతు వాఘతః ॥ (2)
నామాని తే శతక్రతో విశ్వాభిః గీర్భిః ఈమహే ।
ఇన్ద్ర అభిమాతిషా హ్యే ॥ (3)

– ఋగ్వేదం 3-37-2, 3 అథర్వవేదం 20-19-2, 3

ఓ శతక్రతు – సర్వవ్యాపక సర్వేశ్వర! నీ దివ్యశక్తులు, క్రియలు వందలు, వేలు, లక్షలు. నీ భక్తులు నీ కరుణా కటాక్షాలకై నీ వేదాజ్ఞలను చక్కగా పాలిస్తారు. అనేకానేక నామములతో నిన్ను కీర్తిస్తూ జీవన సంగ్రామం చేస్తారు. తమలోని దురహంకార దురభిమానాలను పోగొట్టుకొని పరిశుద్ధులౌతారు. ప్రకృతిలో పరిపక్వమై సర్వ బంధన విముక్తులౌతారు. నీ ఆనందమార్గాన్ని చేరుకొని స్వేచ్ఛగా విహరిస్తారు. మేమును వారి మార్గమునే అనుసరింతుము గాక!

O Alimighty God! You are endowed with hundred powers and operations. Let these devotees of yours make their spirit and eye upto date and upto standard.

O God Almighty! You are the performer of hundred acts. We the worldly battle of encountering evils pronounce and think of your names and powers with all the hymns of praise.

గాయత్రి ఆశ్రమ ట్రస్టు 12-10-586/6, ఆర్య సమాజము, వారాసిగూడ, సికింద్రాబాద్-500 061. (ఇందిరానగర్ రోడ్డు - 2) సెల్ : 9848011073, 9908994084	Bill No.: Date : .... To : ....

S.No.	Particulars	copies	Rate	Amount
	డా॥ కోడూరి సుబ్బారావు గారి రచనలు			
1.	గాయత్రీ విజ్ఞానం		100.00	
2.	వేదార్థ విజ్ఞానం		100.00	
3.	వేదాలలో సూర్యకిరణ చికిత్స		80.00	
4.	వేదాలలో సార్వజనిక నియమములు		80.00	
5.	మన ఇతిహాసం		70.00	
6.	మన వేదశాస్త్రాల పరిచయం		70.00	
7.	అగ్నిహోత్రం 100 శాతం వైజ్ఞానికం		60.00	
8.	వేదాలలో జలచికిత్సా విజ్ఞానం		60.00	
9.	జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ		60.00	
10.	వేదాలలో దేశభక్తి		60.00	
11.	పెండ్లినాటి ప్రమాణాలు		50.00	
12.	గర్భాధాన విజ్ఞానం		50.00	
13.	సంధ్యావందనం-వైజ్ఞానిక సమాలోచన		50.00	
14.	వేదామృతం		50.00	
15.	గణపతి రహస్యము, శివరాత్రి రహస్యము		50.00	
16.	వేదాలలో మనోవిజ్ఞానం		50.00	
17.	వైదిక ధర్మం అంటే?		50.00	
18.	అగ్నిహోత్ర రాసాయనిక విశ్లేషణ		40.00	
19.	గోమాత		40.00	
20.	దౌహృదిని		40.00	
21.	మరణానంతరం జీవుని ప్రయాణం		40.00	
22.	మానవ ధర్మము		40.00	

23.	పండుగల పరమార్థం		40.00	
24.	వైదిక క్రాంతి పథం		40.00	
25.	ఈశావాస్యమిదం సర్వం		35.00	
26.	గాయత్రీ మహిమ		30.00	
27.	యజ్ఞో వై శ్రేష్ఠతమమ్ కర్మ		80.00	
28.	దేవుడు – జీవుడు – ప్రకృతి		30.00	
29.	వేదాల వెలుగుచూపే ఆర్య సమాజము		30.00	
30.	వైదిక జన్మదిన వేడుక		30.00	
31.	వైదిక గృహప్రవేశ విధి		30.00	
32.	వేదాలలో వర్షేష్టి విజ్ఞానం		30.00	
33.	వేదాలలో అశ్వనీ దేవతలు		30.00	
34.	పురుష సూక్తము		30.00	
35.	వైదిక శాంతి పాఠం (వైజ్ఞానిక వ్యాఖ్య)		20.00	
36.	సృష్టికథ		20.00	
37.	సరస్వతీ సూక్తము		20.00	
38.	విశుద్ధ లక్ష్మీ సూక్తము		20.00	
39.	వైదిక సంస్కృతిలో వానప్రస్థాశ్రమము		20.00	
40.	స్వతంత్ర సముపార్జనలో దయానందుడు		20.00	
41.	గంగాధర శివుడు		20.00	
42.	చతుర్దశ భువనములు		20.00	
43.	యజ్ఞోపవీత వైశిష్ట్యము		60.00	
44.	చతుర్వేద మంత్ర రత్నాలు*		120.00	
45.	విశిష్ట వేద సూక్తములు*		150.00	
46.	వైదిక విజ్ఞానము*		60.00	
47.	వేదాలలో భౌతికశాస్త్ర విజ్ఞానము		70.00	
48.	దేవుడొక్కడే నామములనేకం			
	ఇతర విద్వాంసుల రచనలు			
1.	మాతా పుత్రికల జ్ఞాన చర్చ		60.00	
2.	వేదాలలో విజ్ఞాన బీజాలు		30.00	
3.	స్వరాజ్య సంగ్రామములో ఆర్య సమాజము		20.00	
4.	మరికొన్ని చిన్న పుస్తకాలు ఒక్కొక్కటి		10.00	
	** పోస్టల్ ఖర్చులు అదనం **		Total	